


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

RNI-APTEL/2023/88162

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 113 | గురువారం 23 - 04 -2026 | పేజీలు : 12 | వెల-3


## కాకినాడలో ఉద్రిక్త పరిస్థితులు

ఎమ్మెల్సీ అనంతబాబు నివాసంలో సోదాలు

అందుబాటులో లేని ఎమ్మెల్సీ



## ఆర్టీసీ సమ్మెతో

# బస్సులకు రెస్ట్

- డిపోలకే పరిమితం అయిన బస్సులు
- డిపోల ముందు ధర్నాలతో కార్మికుల నిరసన
- నగరంలో అద్దె బస్సులను ఫ్రీగా తిప్పిన ప్రభుత్వం
- చాన్నాళ్లకు ఆటోలు, క్యాబ్‌లకు పెరిగిన గిరాకీ
- కరీంనగర్‌లో లారీని ఢీకొట్టిన అద్దె బస్సు
- నగరంలో మెట్రో సర్వీసులను పొడగించిన సర్కార్
- కార్మికుల సమస్యలపై సానుకూలంగా ఉన్నాట్లు ఎండి వెల్లడి

చాలాలకాలం తరవాత ఆర్టీసీ బస్సులు సేదదీరుతున్నాయి. సమ్మె కారణంగా అన్ని బస్సులు ఆయా డిపోలకే పరిమితం అయ్యాయి. తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. దీంతో బస్ డిపోల్లో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. డిపోల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సమ్మెతో రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. కార్మికుల సమ్మెతో పెద్దపల్లిలో 150 బస్సులు డిపోనకే పరిమితమయ్యాయి.



## రూ.5,400 కోట్ల పెట్టుబడులతో

# రెన్యూ ఎనర్జీ గ్లోబల్

అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఎనర్జీ ప్లాంట్ నేడు శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ లోని రెన్యూవబుల్ రంగంలో భారీ పెట్టుబడులతో ఎనర్జీ ప్లాంట్ స్థాపించేందుకు ప్రముఖ రెన్యూ ఎనర్జ్ గ్లోబల్ సంస్థ ముందుకొచ్చింది. క్లీన్ ఎనర్జీ రంగంలోని ప్రధాన సంస్థల్లో ఒకటిగా ఉన్న రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ ఇప్పటికే దేశంలో 19.2 గిగావాట్ల సామర్థ్యంతో వివిధ ప్రాంతాల్లో క్లీన్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేసి ప్రముఖ స్థానంలో ఉంది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ 6 గిగా వాట్లకు పైగా ఉత్పత్తి సామర్థ్యంతో క్లీన్ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. దీంట్లో భాగంగా ఆ ప్లాంట్‌కు భూమి పూజ గురువారం జరగనుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భూమి పూజ చేయనున్నారు. మొత్తంగా రూ.5,400 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేయబోయే సంస్థకు భూమి పూజ చేపట్టడంతో అనకాపల్లి జిల్లా అభివృద్ధికి కీలక అడుగులు పడనున్నాయి.

## సమ్మెతో సమస్యలు పరిష్కారం కావు

వెంటనే సమ్మె విరమించి రండి

ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం వినతి



## కాల్పుల విరమణ పొడిగించిన ట్రంప్

స్పష్టమైన ప్రతిపాదనతో రావాలని ఇరాన్‌కు సూచన

ట్రూత్ సోషల్ మీడియాలో వెల్లడించిన అధ్యక్షుడు

ఇరాన్‌తో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ అమెరికా



## అనిల్ జైన్‌పై చర్య తీసుకోండి

జలశక్తి మంత్రికి బండి లేఖ

కేంద్ర జల్‌శక్తి మంత్రికి కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ బుధవారం లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. ఎన్డీఎస్ఏ చైర్మన్ అనిల్ జైన్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.



## అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి

# రూ.148 కోట్లు



### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ

తెలంగాణలో అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.148 కోట్లకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. బ్రిడ్జిలు ఉన్నా అప్రోచ్ రోడ్లు లేక నిరుపయోగంగా మారాయని కేబినెట్ దృష్టికి వచ్చింది. పెండింగ్‌లో ఉన్న అప్రోచ్ రోడ్ల పనులను వెంటనే ప్రారంభించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన ఇన్‌ఫ్రా అండ్ క్యాపిటల్ వర్క్స్ కేబినెట్ సబ్ కమిటీ బుధవారంసచివాలయంలో సమావేశమైంది. ఈ సమావేశంలో సబ్ కమిటీ కీలక నిర్ణయాలు తీసుకుంది. 1:4 నిష్పత్తిలో ప్రతిపాదనలు పంపాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.



# ర్యాంకుల గోలతో విద్యార్థులపై ఒత్తిడి !

టీవీలు, పేపర్ల నిండా ర్యాంకుల గోల. మా వద్ద చదివిన వారికి ర్యాంకులే ర్యాంకులు అంటూ... ప్రకటనలు..1,2,3 ఇలా టీవీల్లో ఊదరగొడుతున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే...ర్యాంకుల గొడవలో పిల్లల్లో సృజనాత్మకతను దెబ్బతీస్తున్నారు. లక్షల్లో ఫీజులు వసూళ్లు చేసి, పేద మధ్యత తరగతి వారిని మాయలో పడేస్తున్నారు. ఇంతపెద్ద దేశంలో ఇలాంటి చదువులు సాగుతున్నందుకు సిగ్గుపడాలి. ప్రభుత్వ విద్యారంగం పూర్తిగా భ్రష్టు పడుతోంది. ప్రభుత్వ హాస్టళ్లు నానాటికి తీసికట్టుగా తయారవుతున్నాయి. విద్యార్థులకు సరైన తిండి దక్కడం లేదు. ఫుడ్ పాయిజనింగ్‌తో చస్తున్నారు. అయినా పెద్దగా చర్యలు తీసుకోవడం లేదు. నానా రకాల పేర్లతో హాస్టళ్లు పెట్టి పిల్లలను ఘోష పెడుతున్నారు. ఇక ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజలు కట్టుకోలేనంత, తట్టుకోలేనంతగా ఉన్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలకు చీమకుట్టినట్లు కూడా లేదు. తల్లిదండ్రులు ధర్నాలు చేసినా, ఫీజలు భారం నుంచి తప్పించడం లేదు. జీవితమంటే చదువులు, మార్కులు, ర్యాంకులే అన్న విధంగా విద్యారంగం తయారయ్యింది.

## ప్రధాని మోదీపై ‘ఉగ్రవాది‘ వ్యాఖ్య.. ఖర్గేకు ఈసీ నోటీసులు



ప్రధాని మోదీపై ‘ఉగ్రవాది‘ వ్యాఖ్యల ఆరోపణలపై ఖర్గేకు ఈసీ నోటీసు

24 గంటల్లోగా వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ అధ్యక్షుడికి ఆదేశం

ఖర్గేపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈసీకి ఫిర్యాదు చేసిన బీజేపీ

తన వ్యాఖ్యలను తప్పుగా అన్వయించారని ఖర్గే వివరణ

ప్రజలను భయపెడుతున్నారనే ఉద్దేశంతో అన్నానని స్పష్టీకరణ

# కాల్పుల విరమణ పొడిగించిన ట్రంప్

అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇరుదేశాల మధ్య గతంలో కుదిరిన కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్ నాయకత్వం ఒక సమగ్ర ప్రతిపాదనను సమర్పించే వరకు ఈ కాల్పుల విరమణ కొనసాగుతుందని తెలిపారు. అమెరికా, ఇరాన్ మధ్య ఈ నెల 8వ తేదీన కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. రెండు వారాల ఈ సీజ్ ఫైర్ మరో కొద్ది గంటల్లో ముగియనుందనగా ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, పాకిస్థాన్ నుంచి వచ్చిన అభ్యర్థన మేరకే కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించినట్లుగా ట్రంప్ తెలిపారు. ముఖ్యంగా పాక్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్, ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ల అభ్యర్థన మేరకు సైనిక చర్యను వాయిదా వేసి, దౌత్య చర్చలకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లుగా పేర్కొన్నారు. ఈ మేరకు తన ట్రూత్ సోషల్ ఖాతా ద్వారా వివరాలను వెల్లడించారు.అయితే, సీజ్ ్గ ÷ర్ కొనసాగుతున్న సమయంలోనే ఇరాన్‌పై సముద్ర దిగ్బంధనాన్ని కొనసాగించాలని సైన్యానికి ఆదేశాలు ఇచ్చినట్లుగా ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ ప్రభుత్వంలో అంతర్గత విభేదాలు తీవ్రంగా ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో వారు ఏకీకృత ప్రతిపాదనతో రావడానికి సమయం అవసరం. అందుకే ఈ దాడిని నిలిపివేసి, సీజ్్గ÷ర్ పొడిగించాం అని తెలిపారు. బ్లాకేడ్ కొనసాగించాలని ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై ఇరాన్ మండిపడింది. ఇది కాల్పుల విరమణకు వ్యతిరేకమని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అర్ఘాచీ విమర్శించారు. వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడమంటే యుద్ధ చర్యే అని సమానమని అన్నారు. తమ ప్రయోజనాలను రక్షించుకోవడం ఇరాన్‌కు తెలుసని స్పష్టం చేశారు. ఇక పాక్‌లో జరగాల్సిన చర్చలకు హాజరుకాకూడదని ఇరాన్ నిర్ణయించుకున్నట్లుగా టస్నీమ్ వార్త సంస్థ వెల్లడించింది. అమెరికా అతిగా డిమాండ్లు చేస్తుందని.. అవి ఒప్పందానికి అడ్డుగా మారుతున్నాయి కాబట్టి చర్చల్లో పాల్గొనడం వ్యర్థమని అభిప్రాయపడుతున్నట్లుగా పేర్కొంది. ఇదిలావుంటే ఇరాన్‌తో ప్రస్తుతం కొనసాగుతున్న కాల్పుల విరమణ ఒప్పందంపై అమెరికా ఒక హెచ్చరిక జారీ చేసింది. ఈ కాల్పుల విరమణ అనేది 'అపరిమిత కాలం' కోసం కాదని, ఇరాన్ తన బాధ్యతలను నెరవేర్చడానికి ఒక నిర్దిష్ట సమయం మాత్రమే కేటాయించామని అమెరికా ఉన్నతాధికారి ఒకరు స్పష్టం చేశారు. ఈ అంశం గురించి సదరు అధికారి 'యాక్సియోస్' పత్రికతో మాట్లాడుతూ, ఇరాన్ నిబంధనలను పాటించకపోతే ప్రస్తుతం ఉన్న కాల్పుల విరమణను ఎప్పుడైనా రద్దు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఉద్రిక్తతలను తగ్గించడానికి ఇరాన్‌కు ఒక అవకాశం ఇచ్చామని, అయితే దీనిని ఆ దేశం బలహీనతగా భావించకూడదన్నారు. అణ్వాయుధ కార్యక్రమాలు, ప్రాంతీయ ఉగ్రవాద సంస్థలకు మద్దతు లేదా ఇతర దౌత్యపరమైన అంశాలపై ఇరాన్ నుంచి ఆశించిన మార్పులు రాకపోతే తదుపరి చర్యలు ఉంటాయని తేల్చిచెప్పారు. పశ్చిమాసియాలో నెలకొన్న అస్థిరతను అరికట్టడానికి అంతర్జాతీయ సమాజం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అయితే, ఇరాన్ తన ప్రాక్సీ గ్రూపుల ద్వారా లేదా నేరుగా వివాదాల్లో జోక్యం చేసుకుంటే సహించేది లేదని అమెరికా పదేపదే చెబుతోంది.

## అనిల్ జైన్‌పై చర్య తీసుకోండి

సీఎం రేవంత్‌రెడ్డి కార్యక్రమంలో ఆయన పాల్గొనడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈనెల 20వ తేదీన రాజకీయ ప్రయోజనాల కోసం రేవంత్‌రెడ్డి మేడిగడ్డను సందర్శించారని చెప్పుకొచ్చారు. ఆ కార్యక్రమంలో అనిల్ జైన్ ఎలా పాల్గొంటారని ప్రశ్నించారు. భవిష్యత్తులో బ్యారేజీలకు మరింత నష్టం జరిగితే.. ఎన్డీఎస్ఏపై కాంగ్రెస్ ప్రభుత్వం నిందమోపే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ కమిటీ సిఫార్సులను నీరుగార్చేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. కేంద్రానికి చెడ్డపేరు తెచ్చేందుకు యత్నిస్తున్నారని ఆగ్రహించారు. అనిల్ జైన్‌పై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ కుమార్ సూచించారు.

## అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.148 కోట్లు

సరైన ప్రతిపాదనలు ఉంటే త్వరితగతిన ఆమోదించాలని మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. జూన్ 8వ తేదీలోపు పనులు పూర్తి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మార్గనిర్దేశం చేశారు. ప్రతి వారం పనుల పురోగతిపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. టెండర్లు, పనుల నాణ్యతపై కఠిన పర్యవేక్షణ ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో హైకోర్టు తీర్పు.. స్పందించిన కేటీఆర్

**ఈ తీర్పు ద్వారా కాంగ్రెస్ కుట్రలు కూలిపోయాయన్న కేటీఆర్**

**హైకోర్టు తీర్పుతో తెలంగాణ ప్రజలు గెలిచారన్న కేటీఆర్**

**భూమిపై గోదావరి పారినన్ని రోజులు కేసీఆర్ చరిత్రను ఎవరూ చెరపలేరని వ్యాఖ్య**



కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్‌పై దుష్ప్రచారం చేసిన వారి చెంప చెళ్లుమనిపించేలా హైకోర్టు తీర్పు వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికపై బుధవారం హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, ఈ తీర్పు ద్వారా కూలింది కాళేశ్వరం కాదని, కాంగ్రెస్ చేసిన కుట్రలు అని వ్యాఖ్యానించారు. హైకోర్టు తీర్పుతో ఈరోజు గెలిచింది తెలంగాణ ప్రజలు, రైతులు, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కృషి చేసిన ఇంజినీర్లు అన్నారు. మూడేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంపై దుష్ప్రచారం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈరోజు తెలంగాణలో పారుతున్న ప్రతి నీటిబొట్టు కేసీఆర్ చేసిన కృషివల్లే వచ్చిందని అన్నారు. తెలంగాణ భూమిపై గోదావరి పారినన్ని రోజులు కేసీఆర్ చరిత్రను ఎవరూ చెరపలేరని అన్నారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై ఈరోజు హైకోర్టు ఇచ్చిన తీర్పుతో అందరికీ అసలు విషయం తెలిసిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు కచ్చితంగా వరప్రదాయిని అన్నారు. రూ.94 వేల కోట్లు ఖర్చయితే రూ.1 లక్ష కోట్లు అని ప్రచారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం అంటే ఒక్క బ్యారేజీ కాదని, మూడు బ్యారేజీలు అని తెలిపారు. కాంగ్రెస్ చేసిన కుట్రల వల్ల మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని ఆరోపించారు. రాష్ట్రంలో చెక్ డ్యాంలు బాంబులు పెట్టి పేలుస్తుంటే కేంద్రం ఏం చేస్తోందని ప్రశ్నించారు.

## ఆశ నిరాశల నడుమ ఇరాన్‌అమెరికా చర్చలు

అమెరికాఇరాన్ మధ్య కాల్పుల విరామం ఈ రోజు (బుధవారం 22, ఏప్రిల్)తో ముగియనున్నది. మరుసటి రోజు (గురువారం) నుంచి అరేబియా సముద్ర జలాలలో ఉత్పన్నమయ్యే పరిణామాలు ఒక్క పశ్చిమాసియాపైనే కాకుండా సమస్త దేశాలపై ప్రభావం చూపుతాయనడంలో సందేహం లేదు.ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌లు సంయుక్తంగా యుద్ధానికి దిగిన దరిమిలా నెలకొన్న సంక్షోభ పరిస్థితులలో ఇరాన్, అమెరికా మధ్య శాంతి చర్చలు జరగడమే విశేషం కాగా ఆ చర్చలు రెండోసారి జరిగేందుకూ అవకాశం ఉండడం ఒక ఆశాజనకమైన విషయం. అయితే ఇస్లామాబాద్‌లో జరిగే ఈ రెండో విడత చర్చలకు వెళ్లే ఉద్దేశం తమకు లేదని ఈ వ్యాసం రాస్తున్న సమయంలో కూడా ఇరాన్ అంటున్నది. అయినప్పటికీ, చైనా నుంచి వస్తున్న తమ నౌక నొకదాన్ని దిగ్బంధం చేసిన అమెరికాపై ఇరాన్ ఎలాంటి ప్రతీకార చర్యలకు పాల్పడలేదు. ఆ దిగ్బంధం సందర్భంగా మరో చమురు నౌక కూడా అరేబియా సముద్రంలో అమెరికన్ యుద్ధ నౌకలను దాటి ఇరాన్ ప్రాదేశిక జలాలలోకి సురక్షితంగా చేరుకోవడాన్ని పరిశీలిస్తే, శాంతి చర్చలకు ఆస్కారముందనే భావన కలుగుతోంది. అమెరికా సైతం తాము శాంతి చర్చలకు సంసిద్ధమని ప్రకటించింది. అయితే ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు వ్యతిరేకంగా చేస్తున్న హెచ్చరికలు, బెదిరింపులు, కవ్వింపు వ్యాఖ్యలు శాంతి చర్చల పట్ల అమెరికా చిత్తశుద్ధిని శంకిస్తున్నాయి. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నాయకత్వంలో అమెరికా ప్రతినిధి బృందం ఇస్లామాబాద్‌కు బయలుదేరిందని ఒకసారి, బయలుదేరనున్నదని మరోసారి చెప్పడం ద్వారా ట్రంప్ మహాశయుడు చిత్ర విచిత్రంగా వ్యవహరిస్తున్నారు. దౌత్య మర్యాదలకు అనుగుణంగా ఇరాన్ వ్యవహరిస్తుండగా, పరస్పర పొంతన లేని ట్రంప్ ప్రకటనల కారణాన అంతర్జాతీయ సమాజంలో అమెరికా నవ్వులపాలవుతోంది. ట్రంప్ ఒక మతిస్థిమితం లేని వ్యక్తి అని నికరాగ్వా అధ్యక్షుడు ఓర్టేగా పరిహసించాడు. ఇస్లామాబాద్‌లో రెండోసారి శాంతి చర్చలు సఫలమైనా, విఫలమైనా దాని ప్రభావం సమస్త ప్రపంచంపై పడుతుంది. ఎత్తుకు పై ఎత్తులతో జరిగే ఈ రకమైన సంగ్రామాలలో విజేతలు, పరాజితులు ఎవరనేది స్పష్టంగా చెప్పడం అంత సులువు కాదు.

# ర్యాంకుల గోలతో విద్యార్థులపై ఒత్తిడి !

ప్రైవేట్ మాఫియాలో అసలు విద్య గంగలో కలసిపోతోంది. ర్యాకులే విజయానికి కొలమానాలుగా మారాయి. నేటి విద్యావిధానం మార్కులు, ర్యాంకుల చుట్టూనే తిరుగుతోంది. పిల్లల ప్రతిభను ఈ కొలమానంతో కొలవడం దారుణం. ర్యాంకుల వేటలో పిల్లల మానసిక ఒత్తిడిని పెంచుతున్నారు. ఇటీవలి కాలంలో విద్యార్థుల ఆత్మహత్యలు సామాజిక సమస్యగా మారింది. చదివేది, పరీక్షలు రాసేదీ విద్యార్థులైతే, వాటి ఫలితాల కోసం ఎదురు చూసేది, వారి భవితపై అంచనాలు పెంచుకునేది వారి తల్లిదండ్రులు. వారి ర్యాంకులతో వ్యాపారం చేసేది ఆయా విద్యాసంస్థలు. ఈ ఒత్తిళ్ల మధ్య చదువులు, ర్యాంకుల వాతావరణానికి తోడు రకరకాల ఆర్థిక, సామాజిక, వివక్షల వంటి అనేక కారణాలు విద్యార్థుల్లో విపరీతమైన మానసిక సమస్యలను సృష్టిస్తున్నాయి. తల్లిదండ్రుల అంచనాల ను, విద్యాసంస్థల ఒత్తిళ్లను తట్టుకోలేక కుంగుబాటుతో, నిస్సహాయతతో కొందరు బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. తాజాగా వచ్చిన ఇంటర్ ఫలితాల అనంతరం పదుల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. పరీక్షల్లో ఫెయిలైతే జీవితం ముగిసిపోయినట్లే అన్న భావనలో..ఆత్మహత్యలే శరణ్యమని భావిస్తున్నారు. జీవితంలో చదువు, కెరీర్ ఒక భాగం మాత్రమే. అని వారికి అవగాహన కల్పించడం లేదు. మంచిచెడుల విచక్షణను తెలియజెప్పడం లేదు. ఇంటర్ ఫలితాలు వచ్చాక ఇటీవల తెలంగాణలో ఒక్క రోజులోనే ఏడుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటే, ఎపి లో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. టెన్త్, ఇంటర్ ఫలితాలొచ్చిన ప్రతిసారీ చిన్నారుల ఆత్మహత్యల వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. కార్పొరేట్ విద్యా ఫ్యాక్టరీలు ర్యాంకుల కోసం విద్యార్థులను యంత్రాల్లా మార్చుతున్నాయి. పిల్లలపై తల్లిదండ్రుల అంచనాలకు హద్దు లేకుండా పోతోంది. వారి అంచనాలను అందుకోలేక మరొకరితో పోల్చడాన్ని తట్టుకోలేక.. బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇవి కేవలం పిల్లల వ్యక్తిగత వైఫల్యాల ఫలితం కాదు. సమాజం, విద్యావ్యవస్థలోని లోపాలను ప్రతిబింబిస్తోంది. సుప్రీంకోర్టు సైతం ఇది వ్యవస్థాగత లోపానికి నిదర్శనం అని వ్యాఖ్యానించిందంటే.. పరిస్థితి తీవ్రత ఎంతగా వుందో అర్థం చేసుకోవచ్చు. పరీక్షల ఒత్తిడిలో వున్న పిల్లలకు కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో అవసరం. వారికి మానసిక స్థైర్యాన్ని ఇవ్వడం ముఖ్యం. మార్కులు, ర్యాంకుల కోసమే పుట్టలేదన్న విషయం పిల్లల్లో నూరిపోయాలి. ఫెయిలైతే మళ్లీ చదువుకునేందుకు అవకాశం ఉంది. అసలు చదువే ఇష్టం లేకపోతే అభిరుచి వున్న మరో రంగంలో సత్తా చాటడానికి విశాల ప్రపంచం ఉంది. తరగతి గదిలో వెనకబడిన వారు జీవితంలో అద్భుతాలు సాధించిన ఘటనలు అనేకం చరిత్రలో వున్నాయి. సచిన్ టెండూల్కర్, ధోనీ వంటి ప్రముఖ క్రికెటర్లు

హైస్కూల్ చదువులతోనే సరిపెట్టుకున్నారు. ఇప్పుడు పేరున్న వారంతా అభిరుచి కలిగిన రంగంలో స్వయంకృషితో ఎదిగినవారే. ఇంటర్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయనో, పదిలో ఫెయిల్ అయ్యామనో తనువు చాలిస్తే భవిష్యత్‌లో దేశం ఒక గొప్పవ్యక్తిని కోల్పోయినట్టే. మన శ్రమతో కొత్త చరిత్రను లిఖించాలి. ఇవన్నీ ఒక ఎత్తయితే విద్యారంగంలో సంస్కరణలు ముఖ్యం. ర్యాంకుల గోల, ఫీజులు గోల పోయేలా ప్రభుత్వరంగంలో స్కూళ్లను, కాలేజీలను బలోపేతం చేయాలి. ఒకేతరహా విద్య అందరికీ అందేలా చేయాలి. ముఖ్యమంగా ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టాలి. లక్షల్లో ఫీజులు వసూళ్ల దందాను ఆపాలి. అలాగే ర్యాంకుల చదవులను ఆపాలి. పలు తరహాల సిలబస్‌లకు బ్రేక్ వేయాలి. ప్రధానంగా ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేసి, టీచర్లను నియమిస్తే..పేదలు కార్పొరేట్ స్కూళ్ల మోజులో పడరు. వాటి వెనకాల పరుగెత్తరు. ఇది గుర్తించి ఉమ్మడి ఎపిలో ప్రభుత్వాలు చర్యలకు ఉపక్రమించాలి.

## ఎన్నికల రాజకీయాల్లో భగ్నమైన మహిళ కల

లక్ష్మిఈ'ఈ బిల్లు పాసవుతుందంటారా.. మా బాస్ ఒకటికి రెండుసార్లు అడుగుతున్నారు' అని ఒక మిత్రపక్ష ఎంపీ గతవారం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజూను అడిగారు. 'ఆ అనుమానం మీకు ఎందుకు వస్తోంది? నరేంద్ర మోదీ ప్రధానిగా ఉండగా ఆయన ఎట్టి పరిస్థితుల్లోనూ అనుకున్నది సాధించి తీరుతారు. తెరవెనుక చాలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అనేకమంది మన వైపు మొగ్గు చూపుతారు. చూస్తూ ఉండండి' అని ఆయన సదరు నేతకు చెప్పారు. 'అంతేకాదు, నేనే మీ బాస్‌తో మాట్లాడతా' అని స్వయంగా తానే ఫోన్ చేసి 'బిల్లు పాసవడానికి ఎలాంటి అడ్డంకులు లేవు' అని చెప్పారు. దీంతో ఆ రాష్ట్రంలో పెద్ద ఎత్తున మహిళలను పిలిచి సంబరాలు జరుపుకునేందుకు ఏర్పాట్లు చేశారు. అసలు బిల్లు ఆమోదం పొందదేమోనన్న అభిప్రాయం ప్రధానమంత్రికి కూడా ఉన్నట్లు కనిపించలేదు. ఏప్రిల్ రెండో వారం నుంచే దేశవ్యాప్తంగా మహిళలను ఢిల్లీకి రప్పించడం మొదలు పెట్టారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ అన్ని రాష్ట్రాల అధ్యక్షుల్ని, ముఖ్యమైన నేతల్ని పిలిపించి రాష్ట్రాల్లో మహిళా సదస్సులు నిర్వహించాలని, మహిళా రిజర్వేషన్‌పై విలేఖరుల సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. విజ్ఞాన్ భవన్‌లో మహిళలతో ఒక పెద్ద సదస్సు నిర్వహించి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగించారు. తమ పార్టీకి చెందిన మహిళల్లో ముఖ్య నేతలందర్నీ కేంద్ర కార్యాలయానికి రప్పించి ప్రజల్లోకి వెళ్లేందుకు, మీడియాతో మాట్లాడేందుకు శిక్షణ నిప్పించారు. ఏఏ రాష్ట్రాలలో ఎన్నెన్ని సీట్లు పెరుగుతాయో డాక్యుమెంట్లు తయారు చేసి పంపిణీ చేశారు. చివరకు లోక్‌సభ గ్యాలరీలను మహిళా ప్రజాప్రతినిధులతో నింపేశారు. దేశ రాజధాని, పార్లమెంట్ ప్రాంగణం అంతా మహిళలతో కళకళలాడిపోయింది. చాలామంది మహిళలు ఇక తాము కూడా త్వరలో సభలో ప్రవేశిస్తామని కలలు కన్నారు. కొందరు తమకు సీట్లను కూడా నిర్ణయించుకున్నారు. మహిళా రిజర్వేషన్ కల్పించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొంది ఉంటే దేశవ్యాప్తంగా మహిళల్లో పెద్ద ఊపు తెప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం, బీజేపీ ఎన్ని సన్నాహాలు చేసి ఉండేవో! కానీ, ఏప్రిల్ 16న పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన మొదటి రోజే ప్రతిపక్షాలు సంఘటితంగా ఉన్నట్లు స్పష్టమైంది. ప్రతిపక్షాలను తమ వైపునకు తిప్పుకునేందుకు, గైర్హాజరు చేయించేందుకు తెర వెనుక ప్రయత్నాలు ముమ్మరంగా జరిగాయి. 'ఈ బిల్లు వీగిపోతే ప్రతిపక్షాలను మహిళలు క్షమించరు' అని మోదీ హెచ్చరించాల్సి వచ్చింది. అసలు ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల నుంచి ప్రతిపక్ష ఎంపీలు ఈ సమావేశాలకు రాగలరా అన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. నిజానికి పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఈసారి గతంలో ఎన్నడూ లేనంత గట్టి పోటీని ఎదుర్కొంటున్నారు. ఆ పార్టీ ఎంపీలంతా ప్రచారంలో మునిగి ఉన్నారు. ప్రతిపక్షాలు ఎంత సంఘటితంగా ఉండాలనుకున్నా ఓటింగ్‌కు ఏడుగురు తృణమూల్ ఎంపీలు గైర్హాజరు కావల్సి వచ్చింది. అయినప్పటికీ లోక్‌సభలో రెండింట మూడోవంతు మెజారిటీకి, ఎన్డీఏ సంఖ్యా బలానికి ఎంతో తేడా ఉండడంతో రాజ్యాంగ సవరణ వీగిపోక తప్పలేదు. కర్ణుడి చావుకు లక్ష కారణాలున్నట్లు ఈ బిల్లు వీగిపోవడానికి కూడా ఎన్నో కారణాలున్నాయి. ఎంతో చరిత్రాత్మకమైన ఘట్టం అనుకున్నది ఇలా చివరకు ఒక ప్రహసనంగా ఎందుకు తేలిపోవల్సి వచ్చింది? 2023లో మహిళా రిజర్వేషన్ కల్పించేందుకు ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లును అన్ని పార్టీలు ఏకాభిప్రాయంతో ఆమోదించినప్పుడు ఈ బిల్లును ఎందుకు వ్యతిరేకించాయి? అసలు ఆ రాజ్యాంగ సవరణ బిల్లును మార్చాల్సిన అవసరం ఎందుకు వచ్చింది? ఒకవేళ మార్చాలనుకుంటే దానిపై కూడా ఏకాభిప్రాయం సాధించేందుకు ఎందుకు ప్రయత్నాలు జరగలేదు? 2029లో మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయాలనుకుంటే ఇంకా మూడేళ్ల సమయం ఉన్నది. అందుకోసం బడ్జెట్ సమావేశాలనే పొడిగించి అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సమయంలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎందుకొచ్చింది? మోదీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న బెంగాల్ ఎన్నికల్లో ఆ రాష్ట్రంలో మహిళలను తమ వైపునకు తిప్పుకునేందుకు మహిళా రిజర్వేషన్ పేరుతో పావులు కదిపారా? అటువంటప్పుడు ఆ రిజర్వేషన్‌కూ సీట్ల పెంపునకూ ముడిపెట్టి రాజ్యాంగ సవరణ బిల్లును తేవాల్సిన అవసరం ఏమిటి? ఉత్తరప్రదేశ్‌లో సీట్ల పెంపు వల్ల సమాజ్‌వాది పార్టీకి కూడా ప్రయోజనం కనుక ఆ పార్టీని తమ వైపునకు తిప్పుకునేందుకే ఈ మేరకు ప్రభుత్వం వ్యూహం పన్నిందా? డీలిమిటేషన్ బిల్లులో జనాభా ప్రాతిపదికనే నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని చెప్పడం, 50శాతం సీట్ల పెంపు ప్రతిపాదన లేకపోవడం, ఉత్తరాది దక్షిణాదికి మధ్య వ్యత్యాసాలు పెరుగుతాయన్న చర్చ ప్రబలడం అనుమానాలకు దారితీస్తుందని ప్రభుత్వం ముందుగా ఊహించలేదా? చివరి నిమిషంలో బిల్లును మారుస్తామని హోంమంత్రి అమిత్ షా చెప్పినా ప్రతిపక్షాలు ఒప్పుకోలేదంటే అధికార పక్షానికీ, విపక్షాలకూ మధ్య ఒకర్నొకరు విశ్వసించలేని శత్రుభావం ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతోంది.

# ఆర్టీసీ సమ్మెతో బస్సులకు రెస్ట్

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు. మహబూబ్‌నగర్‌లో 112 బస్సులు డిపోనకే పరిమితం కాగా.. ప్రయాణికుల కోసం 16 విద్యుత్ బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ఆర్టీసీ అద్దె బస్సులను నడుపుతోంది. కండక్టర్ లేకుండా వీటిని తిప్పుతోంది. మరోవైపు బస్సులు లేక పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ప్రయాణికులు ఆశ్రయిస్తున్నారు. అన్ని జిల్లాల వ్యాప్తంగా అర్ధరాత్రి నుంచే బస్సులను డిపోలకు పరిమితం చేశారు. రహదారులపై బైఠాయించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉదయం నుంచి బస్సులన్నీ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ వంటి మహానగరంలో దాదాపు రోజుకు 25 లక్షల మంది ప్రజా రవాణాను వినియోగిస్తున్నారు. ఇదే అదనుగా వారు అధిక ఛార్జీలను వసూలు చేస్తున్నారు.కరీంనగర్‌లో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రైవేటు డ్రైవర్‌తో నడిపిస్తున్న అద్దె బస్సు లారీని ఢీకొట్టింది. కరీంనగర్‌లోకి కోతిరాంపూర్ బైపాస్ వద్ద బస్సు అదుపు తప్పడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. కాగా, శిక్షణ లేని డ్రైవర్లతో బస్సులు నడిపిస్తుండటం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీజీఎస్ ఆర్టీసీ కార్మికుల సమ్మెతో హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. మెట్రో రైళ్ల సంఖ్య, ఫ్రీక్వెన్సీ పెంచాలని నిర్ణయించారు. ఆర్టీసీ సమ్మె ముగిసేవరకూ 56 మెట్రో రైళ్లను నడపనున్నట్లు అధికారులు వెల్లడించారు. మియాపూర్–ఎల్.బి.నగర్ కారిడార్‌లో 4 నిమిషాల 20 సెకన్ల విరామంతో, అలాగే నాగోల్– రాయదుర్గం కారిడార్‌లో 3 నిమిషాల 40 సెకన్ల విరామంతో రోజంతా గరిష్ఠంగా 56 రైళ్లను నడపనున్నట్లు తెలిపారు. చివరి మెట్రో రైలు సర్వీస్ రాత్రి 11 గంటల తర్వాత కూడా పొడిగించేలా చర్యలు చేపట్టినట్లు మెట్రో అధికారులు పేర్కొన్నారు. అయితే, కార్మికుల సమ్మెతో నగరవాసులు మెట్రో రైళ్లపై ఆధారపడాల్సి వచ్చింది. ఉదయం నుంచి రైళ్లన్నీ కిక్కిరిసిపోతున్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు తండోపతండాలుగా మెట్రోస్టేషన్లకు తరలివస్తున్నారు. పెరిగిన ప్రయాణికుల రద్దీ దృష్ట్యా 56 మెట్రో రైళ్లను నడపాలని అధికారులు నిర్ణయించారు. మరోవైపు కార్మికుల సమ్మెపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కొన్ని సంఘాలు నిజాలను విస్మరించి కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. సమస్యలు పరిష్కరించాలంటూ ఆర్టీసీ జేఏసీ సమ్మె బాట పట్టింది. మంగళవారం నాడు అధికారులతో చర్చలు విఫలం కావడంతో ఆందోళనకు దిగారు ఆర్టీసీ కార్మికులు. బస్సులను డిపోలకే పరిమితం చేసి రోడ్లపై బైఠాయించి నిరసనలకు దిగారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని తేల్చి చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం సమ్మె విరమించాలని కార్మికులను కోరుతోంది. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా బస్సులు నడపాలని సంబంధిత ఉన్నతాధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## రూ.5,400 కోట్ల పెట్టుబడులతో రెన్యూ ఎనర్జీ గ్లోబల్

డీకార్బనైజేషన్ రంగంలో ముందంజలో ఉన్న ఈ సంస్థ.. సుమారు రూ.4,200 కోట్ల పెట్టుబడితో 6 గిగావాట్ల సామర్థ్యం గల సోలార్ ఇంగాట్?వేఫర్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయబోతోంది. దీంతో పాటు మరో రూ.1,200 కోట్ల వ్యయంతో 125 మెగావాట్ల హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యూవబుల్ పవర్ ప్రాజెక్ట్‌ను నిర్మించనుంది. ఈ రెండు ప్రాజెక్టులు వచ్చే రెండేళ్లలో పూర్తి కానున్నాయి. రెన్యూ సంస్థ నిర్మించే సోలార్ ఇంగాట్?వేఫర్ తయారీ యూనిట్, హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యూవబుల్ పవర్ ప్రాజెక్టుల ద్వారా సుమారు 2,100 మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. దీంతో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు లభించనున్నాయి. రాష్ట్రంలో క్లీన్ ఎనర్జీని భారీ ఎత్తున ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకెళు తున్నారు. ఇంధన రంగం బలోపేతమైతే పారిశ్రామిక, వ్యవసాయ, సేవా రంగాలు వేగంగా వృద్ధి చెందుతాయని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఏపీని రెన్యువబుల్ ఎనర్జీకి కేంద్రంగా నిలబెట్టడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి అడుగులు వేస్తున్నారు. గతేడాది నవంబర్‌లో విశాఖపట్నంలో జరిగిన సీఐఐ పార్టనర్ సమ్మిట్‌కు హాజరైన రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ రాష్ట్రంలో దశలవారీగా రూ.82,000 కోట్ల పెట్టుబడులు పెడతామని ప్రకటించింది. దీంట్లో భాగంగా అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఎనర్జీ ఎ÷–లాంట్ ఏర్పాటుకు పనులను ప్రారంభించనుండగా త్వరలోనే సుమారుగా రూ.22,000 కోట్లతో దేశంలోనే అతిపెద్ద హైబ్రిడ్ రిన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టులలో ఒకదాన్ని అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ ప్రక్రియ చేపట్టనుంది. 2014–19 మధ్య కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడే 2015లో కళ్యాణదుర్గం లో విండ్ ప్రాజెక్ట్‌తో రాష్ట్రంలోకి రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ అడుగుపెట్టింది. 717 మెగావాట్ల విండ్, 60 మెగావాట్ల సోలార్ ఎనర్జీ సామర్థ్యంతో ఏపీలోని రెన్యూ ఎనర్జీ గ్లోబల్ ఎ÷–లాంట్లు ఇప్పటికే పని చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉత్తరాంధ్రకు పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. ఇప్పటికే ఆర్సెలార్ మిట్టల్, కాగ్నిజెంట్‌కు వంటి ప్రముఖ సంస్థలకు శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. టీసీఎస్ ఇప్పటికే కార్యకలాపాలను ప్రారంభించింది. ఈ నెలలో అతిపెద్ద అంతర్జాతీయ పెట్టుబడి గూగుల్ సంస్థకు శంకుస్థాపన చేయనున్నారు. సాఫ్ట్ వేర్, ఎనర్జీ, స్టీల్, మెడ్ టెక్, ఫార్మా వంటి రంగాల్లో ఉత్తరాంధ్ర ప్రాంతం భారీగా పెట్టుబడులను ఆకర్షిస్తోంది. అలాగే భోగాపురం ఎయిర్ పోర్టు త్వరలో అందుబాటులోకి రానుంది. మరోవైపు పర్యాటకంగా? ఆధ్యాత్మికంగా కూడా ఉత్తరాంధ్రలో అభివృద్ధి పెద్ద ఎత్తున చోటు చేసుకుంటోంది. ఉదయం 09.30 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి నుంచి జెడ్.చింతువకు బయలుదేరి వెళతారు. 11.10 గంటలకు రెన్యూ గ్లోబల్ ఎనర్జీ సంస్థ శంకుస్థాపనలో కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమాన్ని ముగించుకుని మధ్యాహ్నం 02.35 గంటలకు అమరావతి చేరుకుంటారు.

## ప్రధాని మోదీపై 'ఉగ్రవాది' వ్యాఖ్య.. ఖర్గేకు ఈసీ నోటీసులు



ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 'ఉగ్రవాది' అని వ్యాఖ్యానించారన్న ఆరోపణలపై భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) తీవ్రంగా స్పందించింది. ఈ వ్యాఖ్యలపై 24 గంటల్లోగా వివరణ ఇవ్వాలని ఖర్గేకు నోటీసులు జారీ చేసింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించేలా, రాజకీయ గౌరవాన్ని దెబ్బతీసేలా ఈ వ్యాఖ్యలు ఉన్నాయని ఈసీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.బుధవారం కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, నిర్మలా సీతారామన్, అర్జున్ రామ్ మేఘ్వాల్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్‌తో కూడిన ఉన్నత స్థాయి బీజేపీ ప్రతినిధి బృందం ఎన్నికల సంఘాన్ని కలిసి ఖర్గే వ్యాఖ్యలపై ఫిర్యాదు చేసింది. ప్రధానిపై కాంగ్రెస్ అధ్యక్షుడు విషం చిమ్మే వ్యాఖ్యలు చేశారని, రాజకీయాల్లో హద్దులు మీరేవారికి ఒక హెచ్చరికగా నిలిచేలా ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, ప్రధానిపై ఖర్గే వాడిన భాష పట్ల బీజేపీ తీవ్ర ఆగ్రహంతో, విచారంతో ఉందని తెలిపారు. "ప్రధాని మోదీని 'ఉగ్రవాది' అని పిలవడం కేవలం ఒక వ్యాఖ్య కాదు, ఇది యావత్ దేశాన్ని అవమానించడమే. ఇలాంటి నీచమైన ప్రవర్తనను సహించలేం" అని ఆయన స్పష్టం చేశారు.

**వివాదం నేపథ్యం.. ఖర్గే వివరణ** మంగళవారం చెన్నైలో జరిగిన ఒక మీడియా సమావేశంలో, ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ ఖర్గే ప్రధానిని ఉద్దేశించి 'ఉగ్రవాది' అనే పదాన్ని ఉపయోగించడంతో ఈ వివాదం మొదలైంది. అయితే, తన వ్యాఖ్యలను తప్పుగా అన్వయించారని ఆయన తర్వాత వివరణ ఇచ్చారు. "నేను మోదీని ఉగ్రవాది అని అనలేదు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, దర్యాప్తు సంస్థలను ఉపయోగించి ప్రతిపక్షాలను భయపెడుతున్నారనే ఉద్దేశంతో ఆ మాట అన్నాను" అని ఖర్గే స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో దేశంలో భయానక వాతావరణం నెలకొందని విమర్శించే క్రమంలోనే తాను ఆ వ్యాఖ్యలు చేశానని ఆయన తెలిపారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందిస్తూ, ఖర్గే క్షమాపణ చెప్పాలని, కాంగ్రెస్ పార్టీ రాజకీయాల స్థాయిని దిగజార్చుతోందని ఆరోపించారు.

# శ్రీశైలం దేవస్థానం లో వైభవంగా స్వర్ణరథోత్సవం





**శ్రీశైలం ఏప్రిల్ 22(నంది పత్రిక)** ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని (22.04.2026) శ్రీస్వామిఅమ్మవార్లకు స్వర్ణరథోత్సవం నిర్వహించబడింది.కాగా ఆరుద్రోత్సవంలో భాగంగా ఈ రోజు వేకువజామున శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి.

**అనంతరం స్వర్ణరథోత్సవం జరిపించబడింది**: ఈ స్వర్ణరథోత్సవంలో ముందుగా దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, అతివృష్టి అనావృష్టి నివారించబడాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు లోకకల్యాణానికాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. తరువాత రథారూఢులైన శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి. అనంతరం భక్తుల శివనామస్మరణతో వేదమంత్రాల నడుమ ఉదయం గం.7.30లకు ఈ స్వర్ణరథోత్సవం ప్రారంభమైంది. గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు తిరిగి అక్కడి నుండి నంది మండపం వరకు ఈ రథోత్సవాన్ని జరిపించడం జరిగింది.

సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా రథోత్సవంలో పలు కళా బృందాల కోలాటం, తప్పెట చిందులు, మొదలైన జానపద కళారూపాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. అదేవిధంగా రథోత్సవంలో సంప్రదాయ నృత్యం, ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో సహాయ కార్యనిర్వహణాధికారి కె. వెంకటేశ్వరరావు, అర్చకస్వాములు, పలువిభాగాల అధికారులు, పర్యవేక్షకులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.





# శ్రీ వాసవీ మాత జయంతి మహోత్సవములు.

**బేతంచెర్ల ఏప్రిల్ 22 ( నంది పత్రిక ).** స్వస్తిశ్రీ పరాభావనామ సంవత్సర వైశాఖ శుద్ధ దశమి 26/4/2026 వతేది ఆదివారం ఆర్య వైష్యుల ఇలవేల్పు, శ్రీ వాసవీ మాత జయంతి మహోత్సవములను శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానము నందు భక్తుల సహకారము చే నిర్వహించడం జరుగునని, ఆర్య వైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం బేతంచెర్ల వారు తెలిపారు.శ్రీ వాసవీ మాత జయంతి మహోత్సవ కార్యక్రమములను క్రింది విధంగా నిర్వహించడం జరుగునని తెలిపారు. ఆదివారం ఉదయం 5 గంటలకు నగర సంకీర్తన పతాకావిష్కరణ, 6 గంటలకు నవ దాన్యములతో నవగ్రహ పూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభి షేఖము,అమ్మ వారి ఉత్సవ విగ్రహమునకు పంచామృతములతో అభిషేఖము (హోమమునకు కూర్చొను దంపతులచే). 8 గంటలకు సువాసినులచే ఊరేగింపుగా 108 కలశములతో జలమును తెచ్చి, అమ్మవారికి అభిషేఖము చేయుట.8 గంటల 30 నిమిషములకు ఉదయము అల్పాహారము నిర్వహించుట. ఉదయం 9 గంటలకు గణపతి,నవగ్రహ,రుద్ర,మహా లక్ష్మీ సమేత వాసవీ హోమము.11 గంటల 30 నిమిషములకు అమ్మవారికి తులాభారము.మధ్యాహ్నము12 గంటల 30 నిమిషాలకు మహా మంగళ హారతి.మధ్యాహ్నము ఒంటి





గంటకు విందు భోజనము.

ఇతరాత్ర కార్యక్రమాల అనంతరం, రాత్రి 8 గంటల 30 నిమిషాలకు ఆల్పాహారము నిర్వహించ బడును. పై కార్యక్రమములలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేసి, అమ్మవారి కృపకు పాత్రులు ఆగుదురని నిర్వాహకులు కోరారు.(1). హోమము నందు పాల్గొను దంపతులు 20 /4/2026 తేది లోపు తెలుపవలయును.(2).హోమమునకు రుసుముగా ఒక వెయ్యి 616 రూపాయలు చెల్లించి, తగు రశీదు పొందవలయును.(3). హోమమునకు కూర్చొను దంపతులు స్వయంగా పసుపు,కుంకుమ, ఊదిబత్తీలు,ఆకులు,వక్కలు,విడి పూలు, కట్టిన పూలు, 2 పీచు తీసిన టెంకాయలు,పండ్లు, ఆచనము సెట్టు, కళశము చెంబు, కూర్చొనుటకు చాపలు, 15 చిల్లర నాణేములు. (4).భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించి రావలయును.(5).ఈ కార్యక్రమమునకు విరివిగా చందాలు ఇచ్చి, ఆర్ధిక తొడ్పాటును అందించ వలయుననియు. 5 వందలు రూపాయలు ఆపైన ఇచ్చిన వారి పేర్లు ఫ్లెక్సీ మీద వ్రాయించ బడునని, పూర్తి వివరములకు(1).జివి.సుబ్బయ్య సెల్ నెం. 94408 61801.(2).ఎస్ దామోదరయ్య -98660 24860.(3). ఎ. మురళీ మోహన్ - 83415 76115.(4).బి. లక్ష్మి నారాయణ -92474 55151.(5). అనుముల గోవిందు శెట్టి - 94403 366166. ఫోన్ నెంబర్లను సంప్రదించ గలరని కోరుతూ,శ్రీ వాసవీ మాత జయంతి మహోత్సవములలో భక్తులు పాల్గొని, జయ ప్రదం చేయుదురని నిర్వాహక కమిటి సభ్యులు కోరారు.



# ప్రభుత్వ కళాశాలలో చేరాలని లెక్చరర్ల పర్యటన





**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 22:** ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలోను సకల సౌకర్యాలు ఉన్నాయని బండి ఆత్మకూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్లు పేర్కొన్నారు. పదవ తరగతి విద్యార్థులు ఉత్తీర్ణులైన తర్వాత వచ్చే విద్యా సంవత్సరం సందర్భంలో బండి ఆత్మకూరు ప్రభుత్వ కళాశాలలో చేరాలని గ్రామాలలో కళాశాల లెక్చరర్లు పర్యటించి విద్యార్థులను వారి తల్లిదండ్రులను అభ్యర్థిస్తున్నారు. బుధవారం కళాశాల లెక్చరర్లు డాక్టర్ జివి రఘునాథ్ రెడ్డి, డాక్టర్ ఎస్ కే నజీరుద్దీన్. మౌలాలి, కిరణ్, శివరామకృష్ణ చారి, జయమ్మ, ప్రసాద్, బాబా ఫక్రుద్దీన్ శ్యామల కుమారి రామ తులసి తదితరులు కాకనూరు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో నాణ్యమైన విద్యకు, సత్ప్రవర్తనకు,క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అన్ని పోటీ పరీక్షలకు సంబంధించి న పుస్తకాలతో కూడిన గ్రంథాలయ సౌకర్యం ఉందని చెప్పారు. పూర్తిస్థాయిలో పరికరాలతో కూడిన ప్రయోగశాల సౌకర్యం ఉందని తెలిపారు. వర్చువల్ ల్యాబ్ తో పాటు డిజిటల్ క్లాసులతో విద్యాబోధన జరుగుతుందని అన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన సౌకర్యంతో పాటు, తల్లికి వందనం పథకం ద్వారా 15 వేల రూపాయల సౌకర్యం ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులకు మాత్రమే వర్తిస్తుందని పేర్కొన్నారు. కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి నగదు పురస్కారాలు అందజేయడంతో పాటు, మలబార్ జ్యువెలర్స్ ద్వారా స్కాలర్షిప్పులను అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థినీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ కళాశాలలో చేరి ఉన్నత విద్యను పొందాలని విద్యార్థులకు తల్లిదండ్రులకు సూచిస్తున్నామని కళాశాల లెక్చరర్లు పేర్కొన్నారు.

# దివ్యంగులకూ ఇండ్ల స్థలాలు ఇవ్వాలి.

## స్ఫూర్తి దివ్యాంగుల స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పీట్ల మద్దులేటి.



**బేతంచెర్ల ఏప్రిల్ 22 ( నందిపత్రిక ).** బేతంచెర్ల మండలం మరియు గ్రామీణ ప్రాంతాలలోని దివ్యాంగులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ఎపి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని స్ఫూర్తి దివ్యాంగుల స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పీట్ల మద్ధిలేటి ఆ సంఘం కార్యదర్శి రాముడు తెలిపారు.ఈ సందర్భంగా బుధవారం నాడు సంఘం కార్యాలయం నందు వారు మాట్లాడుతూ ఎంతో మంది దివ్యాంగులు నివసించుటకు గూడులేక, సకాలంగుల మధ్య ఎన్నో అవమానాలకు గురవుతున్నారు.ఎన్నో సంవత్సరాల నుండి దివ్యాంగుల కుటుంబాలు ప్రభుత్వాల ఆధరణకు నోచుకోక, దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, ప్రభుత్వం దివ్యాంగుల పట్ల కనీస మానవత్వంతో నైనా, అర్హులైన ప్రతి ఒక్క దివ్యాంగునకు రెండు సెంట్ల స్థలం, పిఎంవైఎ పథకం ద్వారా పక్కా గృహాలు మంజూరు చేయాలని, దివ్యాంగులకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శకుంతల,సురేష్,రామాంజనేయులు,మద్దమ్మ,రామ మోహన్, శ్రీనివాసులు తదితర దివ్యాంగులు పాల్గొన్నారు.

# వైఎస్ జగన్‌ను కలిసిన ప్యాపిలి మండల వైకాపా ఉపాధ్యక్షుడు కొండయ్య



**నందిపత్రిక -ప్యాపిలి** ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని పులివెందులలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ప్యాపిలి మండల పార్టీ ఉపాధ్యక్షుడు కొండయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగన్ మోహన్ రెడ్డికి కొండయ్య పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ భేటీలో ప్యాపిలి మండలంలోని పలు అభివృద్ధి పనుల పురోగతిని జగన్ అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఎదురవుతున్న సమస్యలు, ప్రజల అవసరాలు, పార్టీ బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై కొండయ్య ఆయనతో చర్చించారు. వైఎస్ఆర్సీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని జగన్ ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు.పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు, నాయకుడికి అండగా ఉంటామని జగన్ మోహన్ రెడ్డి భరోసా ఇచ్చారు. ప్యాపిలి మండలంలో పార్టీ కార్యకలాపాలను ముమ్మరం చేయాలని, ప్రజల పక్షాన పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొండయ్యతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వడ్డు మధుకు ఎంపీ శబరి సన్మానం




**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 22:** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఏ కోడూరు గ్రామానికి చెందిన వడ్డు మధుసూదన్ రెడ్డిని నంద్యాల పార్లమెంటు సభ్యురాలు బైరెడ్డి శబరి బుధవారం సన్మానించారు. గత నెల నాలుగవ తేదీన ఉభయ సంయుక్త రాష్ట్రాలు కలిసి జగ్గయ్యపేట మున్సిపాలిటీ ఈత పోటీలను నిర్వహించింది. ఏ కోడూరు గ్రామానికి చెందిన మధుసూదన్ రెడ్డి ఈతపై ఉత్సాహం కొద్ది తొలిసారిగా ఈ పోటీలలో పాల్గొన్నారు. మొత్తం నాలుగు రకాల స్విమ్మింగ్ ఈవెంట్లు పోటీలు జరిగాయి. ఈ నాలుగు రకాల ఈత పోటీలలో మధుసూదన్ రెడ్డి తృతీయ స్థానాలను సంపాదించారు. ఏపీ అండ్ టి జి, బిఎస్ఏ మాస్టర్ స్విమ్మింగ్ ఛాంపియన్షిప్ జగ్గయ్యపేట మున్సిపాలిటీ ఈవెంట్లను నిర్వహించగా తృతీయ స్థానం సంపాదించిన వడ్డు మధుసూదన్ రెడ్డి సర్టిఫికెట్లను మెడల్ ను అందుకున్నారు. ఈ సందర్భంగా నంద్యాల స్విమ్మింగ్ పూల్ అసోసియేషన్ ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీ శబరి సన్మానించి సత్కరించారు.

# స్వీయ గణన నమోదు ప్రక్రియలో పాల్గొన్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ...



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఏప్రిల్ 22నంది పత్రిక** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వీయ గణన నమోదు ప్రక్రియను ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ బుధవారం ప్రారంభించారు. ఆమె పట్టణంలోని తన నివాసంలో తమ వివరాలను కంప్యూటర్లో యాప్ ద్వారా స్వీయగణన నమోదు చేసుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియ ను చేసుకునేందుకు ప్రతి ఒక్క పౌరుడు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండల తహశీల్దార్ జ్యోతి రత్నకుమారి, మున్సిపల్ కమిషనర్ పి.కిశోర్ తదితరులు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కు జ్ఞాపికను అందజేశారు.

# జలధార జల హారతితో కంచాలమ్మ గండి చెరువు పునర్జీవనం కల్పించాలి

**మాండవ్య నది అభివృద్ధికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దిశానిర్దేశం**

**సమగ్ర ప్రణాళికలు రూపొందించి ప్రతిపాదనలు సమర్పించాలి**

**జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**

కడప బ్యూరో చీఫ్ ఏప్రిల్ 22:నంది పత్రిక జిల్లాలో జలవనరుల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "జలధార జల హారతి" కార్యక్రమానికి భాగంగా రాయచోటి మండలం ఎగువ అబ్బవరం వద్ద ఉన్న కంచాలమ్మ గండి చెరువును బుధవారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఇరిగేషన్, డ్వామా అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి, కలెక్టర్ మాండవ్య నది నుంచి చెరువుకు వచ్చే నీటి ప్రవాహ మార్గాన్ని పరిశీలించి, ప్రస్తుత పరిస్థితులపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మాండవ్య నదిని పూర్తిగా శుభ్రపరిచి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. నదిలో అవసరమైన ప్రదేశాల్లో కొత్త చెక్ డ్యాములు నిర్మించడం, ఇప్పటికే దెబ్బతిన్న చెక్ డ్యాములను మరమ్మతు చేయడం ద్వారా నీటి నిల్వ పెంపుతో పాటు భూగర్భ జలాల స్థాయిని గణనీయంగా పెంచవచ్చని ఆయన పేర్కొన్నారు కంచాలమ్మ గండి చెరువుకు నీరు చేరే సప్లై ఛానల్‌ను సరిచేసి, ఎక్కడైనా అడ్డంకులు ఉన్నా తొలగించి, నీటి ప్రవాహం నిరంతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కలెక్టర్‌ను కోరారు. చెరువు పునరుద్ధరణతో పరిసర ప్రాంతాల్లో వ్యవసాయానికి ఊతం లభించడంతో పాటు తాగునీటి సమస్యలు కూడా తగ్గుముఖం పడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా మాండవ్య నదిని కేవలం నీటి వనరుగా మాత్రమే కాకుండా, అందంగా తీర్చిదిద్దేలా బ్యూటిఫికేషన్ కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి సూచించారు. గాలివీడు రింగ్ రోడ్ సమీపంలో ఉన్న ట్యాంకును కూడా కలెక్టర్ తో కలిసి మంత్రి పరిశీలించి, నీటి ప్రవాహ పరిస్థితులను అంచనా వేసి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. మంత్రిసూచనల మేరకు చేపట్టాల్సిన అన్ని పనులపై సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసి, తక్షణమే ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వివిధ అంశాలలో వేగవంతమైన చర్యలు తీసుకొని, జలధార కార్యక్రమాన్ని ఫలితాల ఆధారితంగా విజయవంతం చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్, డ్వామా మరియు సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.



# నంద్యాలలో జన ఔషధీ మెడికల్ స్టోర్ ప్రారంభం





**పేదలకు తక్కువ ధరల్లో నాణ్యమైన మందుల అందుబాటు**

**రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో సేవల విస్తరణకు నూతన అడుగు**

**మంత్రి ఫరూక్, జిల్లా కలెక్టర్,**

**ఎంపీ బైరెడ్డి శబరి చేతుల మీదుగా ప్రారంభం**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి కీలక పాత్ర**

**కార్పొరేట్ సంస్థల సహకారంతో ఏర్పాటైన మెడికల్ స్టోర్**

నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 22 ( నంది పత్రిక ) స్వచ్ఛమైన, నాణ్యమైన మందులు తక్కువ ధరలకు అందించడమే జన ఔషధీ లక్ష్యమని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. బుధవారం నంద్యాల ప్రభుత్వాసుపత్రి ఆవరణలో జేఎస్డబ్ల్యూ, రాంకో, రేన్ సిమెంట్ కంపెనీల సహకారంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి భారతీయ జన ఔషధీ మెడికల్ స్టోర్‌ను మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి నంద్యాల పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెడ్ క్రాస్ జిల్లా ప్రెసిడెంట్ మరియు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి ప్రజలకు అత్యంత తక్కువ ధరల్లో నాణ్యమైన మందులు అందించాలనే లక్ష్యంతో ఈ జన ఔషధీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సమావేశంలో తీర్మానం చేసి ఈ మెడికల్ షాప్‌ను రెడ్ క్రాస్ సంస్థకు కేటాయించినట్లు చెప్పారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచి, సేవలను విస్తృతం చేయాలని రెడ్ క్రాస్ ప్రతినిధులను సూచించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, నంద్యాల జిల్లాలో తక్కువ వ్యవధిలోనే బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ఏర్పాటు చేయడంతో పాటు, "మీ ఇంటికి మీ డాక్టర్" వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అదే విధంగా ఇప్పుడు పేద ప్రజలకు నాణ్యమైన మందులు తక్కువ ధరల్లో అందించేందుకు జన ఔషధీ మెడికల్ స్టోర్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రజలు ఈ సదుపాయాన్ని విస్తృతంగా వినియోగించుకోవాలని ఆమె కోరారు. పార్లమెంట్ సభ్యులు డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ, ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన జన ఔషధీ పథకం ద్వారా నాణ్యమైన మందులు తక్కువ ధరలకు అందుబాటులోకి రావడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. నంద్యాలలో ఈ కేంద్రం ఏర్పాటు కావడానికి మంత్రి, జిల్లా కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ ప్రతినిధుల సమిష్టి కృషి కారణమని తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ వ్యాపారవేత్త గోళ్ళ సుదర్శనం రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న సంక్షేమ కార్యక్రమాల కోసం రూ.1 లక్ష విరాళం అందజేశారు.

జేఎస్డబ్ల్యూ సిమెంట్ కంపెనీ రూ.3,21,779 (మందులు మరియు పరికరాల కోసం), రాంకో సిమెంట్ రూ.3 లక్షలు (భవనం మరమ్మతులు, మౌలిక సదుపాయాల కోసం), రేన్ సిమెంట్ రూ.1 లక్ష, జిల్లా కలెక్టర్ కార్యాలయం రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా సహకరించిన సంస్థలు, ప్రతినిధులను ఘనంగా సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకరించిన జేఎస్డబ్ల్యూ సిమెంట్ కంపెనీ ప్రతినిధి గంగాధర్ కురుప్, రాంకో సిమెంట్ కంపెనీ ప్రతినిధి శోభన్ బాబు, రేన్ సిమెంట్ ప్రతినిధి ఆనంద్ భాస్కర్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, సెక్రటరీ వజ్రాల శ్రీకాంత్ రెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ మమతా రెడ్డి, ట్రెజరర్ నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.






# శ్రీ కాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థాన నూతన పాలక మండలి అభినందన సభ

**ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్**



నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 22 ( నంది పత్రిక ) నంద్యాల స్థానిక గాంధీ చౌక్ దగ్గరలో ఉన్న శ్రీ కాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థాన నూతన పాలక మండలి సభ్యుల అభినందన సభ బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆలయ నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీ బింగుమళ్ల సుబ్బలక్ష్మయ్య గారిని మరియు పాలక మండలి సభ్యులైన వసుంధర దేవి, లక్ష్మణ్ సింగ్, వరలక్ష్మి శారదాబాయి, భారతి విజయభాస్కర్, సుబ్రహ్మణ్యం,రాజ్ పురోహిత్ బాబు సింగ్, సుబ్రహ్మణ్య శాస్త్రి (ఎక్స్ అఫీషియో సభ్యులు) లను మంత్రి ఫరూక్ ఘనంగా సన్మానించారు చైర్మన్ సుబ్బలక్ష్మయ్య మాట్లాడుతూ భక్తులందరికీ స్వామివారి దర్శనం సులభతరం చేసేలా, ఆలయ ప్రతిష్టను మరింత పెంచేలా, భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తమ పాలక మండలి కృషి చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ దేవాలయాలు మన సంస్కృతికి, ఆధ్యాత్మికతకు నిలయాలని, భక్తుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నూతన పాలక మండలి పనిచేయాలని సూచించారు. ఆలయ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బింగుమళ్ల సుబ్బలక్ష్మయ్య గారికి మరియు సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వసతులు కల్పించాలని కోరారు. చారిత్రక నేపథ్యం ఉన్న శ్రీ కాళికాంబ చంద్రశేఖర స్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. పాలక మండలి సభ్యులందరూ సమన్వయంతో పనిచేసి ఆలయ ప్రతిష్టను మరింత పెంచాలని పిలుపునిచ్చారు. ఈ అభినందన సభలో గౌరవ అతిథులుగా ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు ఇల్లూరి లక్ష్మయ్య , కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, బిజెపి జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు, టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, టిడిపి మాజీ రాష్ట్ర కార్యదర్శులు రామచంద్రరావు, జిల్లెల్ల శ్రీరాములు, శ్రీశైలం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ మురళీధర్, మాజీ కౌన్సిలర్ కండే శ్యామ్ సుందర్ లాల్, ఆర్యవైశ్య సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షులు బింగ్ మల్లె శ్యామ్ సుందర్ గుప్తా, ప్రథమనంది దేవస్థానం చైర్మన్ చలం బాబు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు బోయ రామకృష్ణ తదితర నాయకులు, ఆలయ అర్చకులు మరియు భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



# ధరణిని కాపాడి, జీవజాతిని పరిరక్షించుకుందాం

**-డాక్టర్ కె వేణుగోపాల్, సెట్కూరు సీఈవో**

కర్నూలు నంది పత్రిక బ్యూరో...... 'ప్రపంచ ధరిత్రి దినోత్సవం' సందర్భంగా షెడ్యూల్ తెగల బాలికల గురుకుల పాఠశాల కర్నూలు నందు జిల్లా యువజన సంక్షేమ శాఖ సెట్కూరు మరియు జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ 1970 నుంచి ప్రారంభమైన ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా 190 కంటే ఎక్కువ దేశాల్లో ఏప్రిల్ 22న జరుపుకుంటున్నాయని,భూగోళంపై మానవ ప్రభావాన్ని తెలియజేయడం, అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది 'మన శక్తి, మన గ్రహం" అనే నినాదంతో ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. మనిషి ఎంత ఎత్తుకు ఎదిగినా దీనికి ఆధారం భూమి. గాలి, నీరు, నింగి, నిప్పు, నేల అనే పంచభూతాల వల్లే మానవ మనుగడ సాధ్యమవుతుందని,వీటిలో ఏ ఒక్కటి లోపించినా జీవనం అస్తవ్యస్తమవుతుందన్నారు. అంతులేని ఆధిపత్య దాహం వల్ల భూగోళంపై హరితదనం తగ్గిపోవడం, కొన్ని రకాల జీవరాశులు నశించిపోవడం వల్ల భూతాపం పెరుగుతూ వస్తోంది. నానాటికీ పెరుగుతున్న భూతాపంతో ప్రకృతి సమతౌల్యత దెబ్బతిని జీవరాశి మనుగడకు ముప్పు ఏర్పడుతోందన్నారు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి మరియు పర్యావరణాన్ని రక్షించడానికి పునరుత్పాదక ఇంధనం వైపు ప్రపంచం మారాల్సిన అవసరాన్ని వివరించారు. పర్యావరణ మార్పు కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి దైనందిన జీవితంలో తీసుకునే చర్యల ద్వారానే సాధ్యమవుతుందని తెలియచేశారు. చెట్లు నాటడం, నీరు మరియు ఇంధనాన్ని పొదుపు చేయడం, అలాగే రీసైక్లింగ్ పద్ధతులను పాటించడం ద్వారా మన గ్రహాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిషోర్ రెడ్డి మాట్లాడుతూ పరిశ్రమలు, వాహనాలు తదితరాల నుంచి వెలువడుతోన్న క్లోరోఫోరో కార్బన్‌లు భూగ్రహాన్ని మరింత వేడెక్కిస్తూ పలు కాలుష్యాలకు కారణమవుతున్నాయన్నారు . బయటకు వెళ్లే సమయంలో వాహనాలు కాకుండా నడిచి వెళ్ళడం లేదా సైకిల్‌ను ఎంచుకోవడం. దూర ప్రాంతాలకు వెళ్లటేప్పుడు స్వంత వాహనాలు కాకుండా ప్రజా రవాణను ఆశ్రయించడం వల్ల కార్బన ఉద్గారాల ప్రభావాన్ని తగ్గించవచ్చు అన్నారు. ప్రిన్సిపాల్ అరుణ మాట్లాడుతూ వృక్షాలను విచక్షణారహితంగా నరికివేస్తున్నందున అడవులు అంతరించిపోతున్నాయని, సరైన వర్షాలు లేక కరువుకాటకాలు సంభవిస్తున్నాయి. దీంతో జల వనరులు నానాటికీ తీసుకట్టుగా మారుతున్నాయి. తత్ఫలితంగా భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయన్నారు. పర్యావరణ అనుకూల ఉత్పత్తులను ఉపయోగించాలి. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలి అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన, మరియు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. విజేతలకు సర్టిఫికెట్, మెమెంటో మరియు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమం లో సెట్కూరు సిబ్బంది నిదీస్ , శ్రీనివాసా సింగ్, కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయ సిబ్బంది మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.






# మలేరియా నివారణ మన చేతుల్లోనే ఉంది..

**డాక్టర్ సింధియా శుభప్రద విభాగాధిపతి, కమ్యూనిటీ మెడిసిన్ & వైస్ ప్రిన్సిపల్, కేఎంసి.**

కర్నూలు నంది పత్రిక బ్యూరో....మలేరియా నివారణ మన చేతుల్లోనే ఉందని ప్రతి ఒక్కరు వ్యాధిపై అవగాహన పెంచుకొని దోమకాటుకు గురికాకుండా కాపాడుకుంటే ఐదు రకాలైన వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చునని కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి & కర్నూల్ మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ డా. సింధియా శుభప్రద అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవ కార్యక్రమాలను పురస్కరించుకొని కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఈ కార్యక్రమ నోడల్ ఆఫీసర్ డా. ప్రసన్న రాణి ఆధ్వర్యంలో దిన్నే దేవరపాడు గ్రామంలో గ్రామ ప్రజలకు, స్కూలు విద్యార్థులకు మలేరియా వ్యాధి గురించి దోమల నివారణ గురించి అవగాహన కార్యక్రమం




నిర్వహించడం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమంలో డాక్టర్స్ సింధియా శుభప్రద మాట్లాడుతూ 2026 థీమ్ "మలేరియా అంతానికి నడుం బిగిద్దాం.. ఇప్పుడు మనం చేయగలం, ఇప్పుడు మనం చేయాలి" ను వివరించారు. దోమ కాటుకు గురికాకుండా ఉండడం దోమలను నియంత్రించడం ద్వారా మలేరియా డెంగ్యూ చికెన్ గున్యా మెదడు వాపు వ్యాధి రాకుండా కాపాడుకోవచ్చునని తెలిపారు. దోమల నివారణకు నిల్వ ఉండే నీటిలో అవి గుడ్లు పెడతాయని అవి దోమలుగా అభివృద్ధి చెందక ముందే ఇళ్ళలో నీటి తొట్టి లను ప్రతి శుక్రవారం శుభ్రం చేసి బాగా ఎండిన తర్వాత ఉపయోగించాలని, వీధుల్లో ఉపయోగించిన టెంకాయ చిప్పలు, కొబ్బరి బోండాలు, ఖాళీ సీసాలు,పాత టైర్లు, నీళ్లు నిలువ ఉండే ప్రతి వాటిని నీరు నిలువ లేకుండా చూసుకోవాలని తెలిపారు. అదేవిధంగా వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులు సంప్రదించి చికిత్స ప్రారంభించాలన్నారు. కమ్యూనిటీ మెడిసిన్ దత్తత గ్రామమైన దిన్నదేవరపాడులో ఎఫ్ఎపి కార్యక్రమం కింద మెడికల్ కాలేజీ విద్యార్థులు ఇంటింటికి తిరిగి వ్యాధి గురించి వివరిస్తూ దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విపులంగా వివరించడం జరిగింది. అదేవిధంగా పాఠశాలలో విద్యార్థులకు పెద్ద విద్యార్థులు మలేరియా పై చక్కటి నాటిక వేసి ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ పుష్పలత డాక్టర్ వైష్ణవి, సీనియర్ రెసిడెంట్లు డా. యాస్మిన్, డా. బ్రయాన్, లెక్చరర్ సురేష్ కుమార్, పీజీ వైద్యులు, డా. సభా బేగం,డా. పూజ,డా. శ్రీలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ షణ్ముఖుడు, సూపర్వైజర్లు ప్రభాకర్ రెడ్డి, సాయిరాం, మాధవ రాజు, ఏ.ఎన్.ఏం లు నాగేశ్వరమ్మ సుభాషిని , యూజీ విద్యార్థులు పాల్గొన్నారు.

# నంద్యాల లో స్విమ్మింగ్ పూల్ నిర్మిస్తాం.





## స్విమ్మింగ్ విజేతల అభినందన సభలో ఎంపీ బైరెడ్డి శబరి

నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 22 ( నంది పత్రిక )నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో ఒక అత్యాధునిక స్విమ్మింగ్ పూల్ మంజూరు చేయిస్తామని తద్వారా జిల్లా నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి స్విమ్మర్లను తయారు చేస్తామని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు. జగ్గయ్యపేటలో జరిగిన రెండు తెలుగు రాష్ట్రాల స్విమ్మింగ్ ఛాంపియన్షిప్ లో విశేష ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన కాశీపురం ప్రభాకర్ రెడ్డి, వి మధుసూదన్ రెడ్డిల అభినందన సభకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నంద్యాల శ్రీ రామకృష్ణా పి జి కళాశాలలో డా. జి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన సభకు ఎంపీ శబరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ నేను చిన్నప్పటి నుంచి స్విమ్మర్ నే.

జాతీయ స్థాయి పోటీల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు ప్రాతినిధ్యం వహించాను, స్విమ్మింగ్ చేయడం వల్లనే నేను ఆరోగ్యంగా ఉన్నాను. మీ పిల్లలకు ఈత నేర్పించడం మీరిచ్చే గొప్ప బహుమతి.

**స్విమ్మింగ్ లో రాణిస్తే స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలు సాధించ వచ్చు.** ఆరు పదుల వయసులో ప్రభాకర్ రెడ్డి ఇంత ప్రతిభ చూపడం అద్భుతం..స్విమ్మింగ్ విజేతలను సన్మానించడం నాకు దక్కిన గౌరవం అన్నారు.నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో ఒక ప్రొఫెషనల్ స్విమ్మింగ్ పూల్ మంజూరు చేయిస్తాం..నంద్యాల నుంచి స్విమ్మింగ్ లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేద్దాం. మా నాయకుడు చంద్రబాబు నాయుడు క్రీడలకు అపారమైన ప్రోత్సాహం ఇస్తున్నారు. శ్రీ రామకృష్ణ విద్యా సంస్థల అధినేత డా రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ స్విమ్మింగ్ మీద మక్కువతో తన ఇంట్లోనే ఒక స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేశామన్నారు. రోజూ స్విమ్మింగ్ చేస్తే మీ ఆరోగ్యం మీ గుప్పిట్లో ఉన్నట్లే అన్నారు. కాశీపురం ప్రభాకర్ రెడ్డి ఒక ప్రతిభా వంతమైన రచయిత గా తెలుసు అనీ, అయితే ఈత లో ఇంత గొప్ప ప్రవీణుడని తెలియదన్నారు.

ఈ కార్యక్రమంలో మారంరెడ్డి జనార్దన్ రెడ్డి, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ నరహరి విశ్వనాథ రెడ్డి, డా రాకేష్ రెడ్డి తదితరులు ప్రసంగించారు.

# తల్లిదండ్రులూ! పిల్లలు జాగ్రత్త!



బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 22: తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని బండి ఆత్మకూరు మండల విద్యాశాఖ అధికారులు ఆర్ యశోద, మోహన్ రెడ్డి లు పేర్కొన్నారు. బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ బండి ఆత్మకూరు మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రవేట్ పాఠశాలలకు ఏప్రిల్ 24 నుండి జూన్ 11వ తేదీ వరకు ప్రభుత్వ అధికారిక విద్యా క్యాలెండర్ను అనుసరించి వేసవి సెలవులను ప్రకటించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తల్లిదండ్రులకు విద్యాశాఖ అధికారులు పలు సూచనలు చేశారు. వేసవి కావడం వల్ల ఎండలు తీవ్రంగా ఉంటాయి కాబట్టి ఉదయం 11 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పిల్లలు బయటికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. చిన్నపిల్లలను ఒంటరిగా బయటకు పంపకుండా తల్లిదండ్రులు ప్రత్యేకంగా శ్రద్ధ వహించాలన్నారు. పెద్దల పర్యవేక్షణ లేకుండా పిల్లలు బావులు చెరువులు కాలువలు వంటి నీటి వనరుల వద్దకు ఈత కొట్టడానికి వెళ్లి ప్రమాదాలు కొని తెచ్చుకోకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు. పిల్లలకు తరచూ తగినంత నీరు మజ్జిగ పన్న రసాలు ఇస్తూ డిహైడ్రేషన్ నివారించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులు సెలవుల సమయంలో ఇంటి వద్దే సురక్షితంగా ఉండి పుస్తకాలు చదవడం, చేతిరాత మెరుగుపరచుకోవడం, సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి అలవాట్లను పెంపొందించుకోవాలని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై నిరంతరం పర్యవేక్షణ వహించి వారి ఆరోగ్యం భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని మండల విద్యాధికారులు విజ్ఞప్తి చేశారు.

## పారదర్శకంగా బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియ చేపట్టిన ... కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్

### 133 మంది పోలీసులకు బదిలీలు.



కర్నూలు నంది పత్రిక బ్యూరో....... సాధారణ బదిలీల్లో భాగంగా బుధవారం కర్నూలు జిల్లాలోని పోలీసు స్టేషన్ లలో ఒకే చోట 5 ఏళ్ళు సర్వీసు పూర్తి చేసుకున్న పోలీసు సిబ్బందికి బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టామని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జరిగిన బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియ కు మొత్తం 133 మంది హాజరయ్యారు.ఇందులో 15 మంది ఎఎస్సైలు, 25 మంది హెడ్ కానిస్టేబుల్స్ , 93 మంది కానిస్టేబుల్స్ ఉన్నారు. ఈ సందర్భంగా కర్నూలు ఎస్పీ గారు పోలీసు సిబ్బందితో మాట్లాడారు. పలు సూచనలు చేశారు. ఒకే పోలీసుస్టేషన్ లో 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పోలీసులకు నిబంధనల ప్రకారం పారదర్శకంగా బదిలీల ప్రక్రియ చేపట్టామన్నారు. గతంలో పని చేసిన పోలీసుస్టేషన్ లు కాకుండా , తమ స్వంత మండలం, నియోజకవర్గం మినహాయించి , ఇతర పోలీసు స్టేషన్ లు ఎంపిక చేసుకోవాలని తెలిపారు. ఖాళీల ఆధారంగా ఉన్న పోలీసు స్టేషన్ ల ను ఎంచుకోవాలని సూచించారు. విధుల పట్ల అలసత్వం వహించకుండా సంతృప్తికర బదిలీలతో మరిశీత భాద్యతగా పని చేయాలన్నారు. పోలీసు సిబ్బందికి కోరుకున్న చోటుకే బదిలీలు జరగడంతో బదిలీల పట్ల పోలీసు సిబ్బంది అందరూ ఆనందం వ్యక్తం చేశారు. పోలీసు సిబ్బందిని కోరుకున్న ప్రాంతాలకు బదిలీ చేయడంతో జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు నాగరాజు , జిల్లా ఎస్పీ కి పోలీసు సిబ్బంది తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా , డిపిఓ ఎఓ విజయలక్ష్మీ , డిపిఓ సిబ్బంది ఉన్నారు.

# మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ గుట్టు తేల్చిన పోలీసులు...

**గతంలో ఇప్పుడు అదే సీనియర్ విద్యార్థుల ర్యాగింగ్ పేరుతో ఎన్ఎంసికి ఫిర్యాదులు..**
**మెడికల్ కాలేజీలో ఎటువంటి ర్యాగింగ్ జరగలేదు గత ఫిర్యాదు గానీ ఇప్పటి ఫిర్యాదు విషయం లో కానీ...**
**అడిషనల్ డీఎంఈ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కే చిట్టి నరసమ్మ...**




కర్నూలు నంది పత్రిక బ్యూరో.... సీనియర్ విద్యార్థుల అంతర్గత సమస్యలతోనే ర్యాగింగ్ పేరుతో ఫిర్యాదు ...కాలేజీలో ఎటువంటి ర్యాగింగ్ జరగలేదని విచారణలో తేలింది... టూ టౌన్ సి.ఐ ... శ్రీధర్...... కర్నూలు మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ పేరుతో రేగిన కలకలం ఎండ్ కార్డు పడింది.. ర్యాగింగ్ పేరుతో వచ్చిన మెయిల్స్ లో సివియారిటీ ఉండటంతో ఎంటువంటి ఇబ్బంది పడకుండా నేరుగా తనవద్దకు వచ్చి కలవాలని రిప్లై మెయిల్ ఇవ్వగా స్పందించక పోవడం తన ఇంటికి అయినా తీసుకువెళతానని భయం అక్కర్లేదని కూడా బరోసా ఇస్తూ చెప్పినప్పటికీ ఎటువంటి రిప్లై రాకపోవడం తో ప్రిన్సిపల్ ఎస్పీ కి విషయం తెలపటం తో దీంతో రంగంలో దిగిన పోలీసులు ర్యాగింగ్ మెయిల్ ఆధారంగా విచారణ చేసి ర్యాగింగ్ గుట్టు ను తేల్చడం జరిగింది. గతంలో కూడా ర్యాగింగ్ పేరుతో ఇదే మెయిల్ నుంచి మెయిల్స్ వెళ్ళాయని తేలడం తో సదరు విద్యార్థులను నేరుగా ర్యాగింగ్ కమిటీ తో కలిసి విచారణ చేయగా మొదట ఒప్పుకోకపోవడంతో సాంకేతిక ఆధారాలన్ని( ఫోన్ ఐడి, మెయిల్ లాగిన్స్ ) బయట పెట్టడంతో అప్పుడు తామే చేసామని ఒప్పుకోవడం జరిగింది.. ఈ విషయంపై బుధవారం ప్రిన్సిపల్ ఛాంబర్ లో జరిగిన ప్రెస్ మీట్ లో ప్రిన్సిపల్ డా.చిట్టి నరసమ్మ మాట్లాడుతూ మెడికల్ కాలేజీలో ఎటువంటి ర్యాగింగ్ జరగలేదని తల్లిదండ్రులు ఎవరు భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు సెపరేట్ గా వసతి ఉంటుందని ఎటువంటి భయం అక్కర్లేదని గతంలో కూడా ఇదే విషయం చెప్పామని పోలీసుల విచారణలో క్లియర్ గా ర్యాగింగ్ అంశము ఫేక్ అని తేలిందని అది సీనియర్ విద్యార్థులలో కొందరి విద్యార్థుల అంతర్గత సమస్యతో ఫిర్యాదు చేశారని తేలిందని తెలిపారు.. ఈ అంశం పై చర్యల విషయం పై కమిటీ ల తో మాట్లాడి నిబంధనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇటువంటి చర్యలు మరల ఎవరైనా చేపడితే ఈసారి తీవ్రమైన చర్యలు తీసుకుంటామని ఇది మంచి పద్ధతి కాదని చదువుకోవడానికి వచ్చిన విద్యార్థులు తమ చదువుపై దృష్టికి కేంద్రీకరించాలని విద్యార్థులను హెచ్చరించారు. అన్నీ స్థాయిల్లో హాస్టల్లో, కాలేజీలో కమిటీలు ఏర్పాటు చేశామని చిన్న సమస్య కూడా నేరుగా ఫిర్యాదు చేయొచ్చని వెంటనే చర్యలు తీసుకుంటామనీ అందువల్లే ఎటువంటి ర్యాగింగ్ జరగడం లేదని తెలిపారు. టూ టౌన్ సిఐ శ్రీధర్ మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు ర్యాగింగ్ మెయిల్స్ పై పూర్తి సాంకేతిక ఆధారాలు సేకరించామని ఇదే మెయిల్ నుంచి ఒకే మెయిల్ నుంచి గతంలో కూడా ఫిర్యాదులు వెళ్లాయని ఆ మెయిల్ సీనియర్ విద్యార్థులదని తేలిందనీ చివరికి వారు కూడా అంతర్గత సమస్యతో ఒత్తిడితో చేశామని ఇంకొకసారి ఇలాంటి తప్పు జరగదని ఒప్పుకోవడం జరిగిందని తెలిపారు. విద్యార్థుల పై చర్యలకు సంబంధించి కాలేజీ కమిటీలే చర్యలు తీసుకోవచ్చు అన్నారు. అయితే ప్రిన్సిపల్ సదరు విద్యార్థులని హాస్టల్ నుంచి బయటికి పంపామని వారికి హాస్టల్లో అవకాశం లేదని ఈమెయిల్ విషయంలో మరేవరి పాత్ర ఉన్నట్లు తెలిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ ప్రెస్ మీట్ లో వైస్ ప్రిన్సిపల్ లో డాక్టర్ శ్రీరాములు డాక్టర్స్ సింధియా శుభప్రద, యాంటీ ర్యాగింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ . రామ కృష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో జాగ్రత్తలు పాటిద్దాం...

# ఆరోగ్యం కాపా డుకుందాం

## రాయలసీమ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్ట్ లకు టోపీలు పంపిణి - సేట్కూర్ సీఈఓ వేణుగోపాల్

కర్నూలు నంది పత్రిక బ్యూరో..... కర్నూలు నగరం,సమాచార శాఖ భవన్ ప్రాంగ ణంలో బుధవారం రాయలసీమ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కే.శ్రీనివాసులు ఆధ్వ ర్యంలో వేసవిలో జాగ్రత్తలు పాటిద్దాం...ఆరోగ్యం కాపాడుకుందాం అనే నినాదంతో జర్నలిస్ట్ లకు టోపీలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు.కార్యక్ర మానికి సమాచార శాఖ డిడి కె.జయమ్మ,సెట్కు రు సీఈఓ డాక్టర్ కె.వేణుగోపాల్,ఏపీజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కె.హరినాథ్ రెడ్డి,టి.రామ కృష్ణ,మెడిక వర్ హాస్పి టల్ సిబ్బంది జనరల్ మెడిసిన్ డాక్టర్ సరయు రెడ్డి,జి.ఎం.డాక్టర్ మ హేశ్వర్ రెడ్డి,ఎజిఎం ఎస్.ఖాదర్ బాషా హాజర య్యారు.అనంతరం వారి చేతుల మీదుగా జర్న లిస్ట్ లకు టోపీలు అందచేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిక్షణం సమాజంలో జరి గే విశేషాలను సే కరించి,వార్తలుగా ప్రచురణ చే స్తూ ప్రజలను చైత న్యం చేయడంలో జర్నలిస్ట్ ల పాత్ర ప్రధమంగా ఉందన్నారు.వార్తల సేకరణలో జర్నలిస్ట్ తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటిం చాలని సూచించారు.ఇలాంటి జర్నలిస్ట్ లను వే సవి తాపం నుండి కాపాడేందుకు తమ తృణసా యంగా రాయల సీ మ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసి యేషన్ అధ్యక్షులు కె.శ్రీననువాసులు టోపీలు పం పిణి చేయడం అభి నందనీయం అని కొనియా డారు.ఈ కార్యక్రమంలో రాయలసీమ జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేష న్ నాయకులు భూపాల్,జి ల్లా అధ్యక్షులు,విచ క్షణ దినపత్రిక ఎడిటర్ ర ఘు,రాములు దినపత్రిక ఎడిటర్ చంద్రశేఖర్,జ ర్నలిస్ట్ లు పాల్గొన్నారు.

## సిరివెళ్ల మండల కేంద్రంలో గల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఎస్సి కాలనీ లో 5వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.



సిరివెళ్ల (నంది పత్రిక) సిరివెళ్ల మండలంలోని సిరివెళ్ల టౌన్ లో ఎస్సీ కాలనీ లోగల ఆదర్శ ప్రాథమికపాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొని,కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు తేజోవతమ్మ గారు అధ్యక్షత వహించారు. ఉపాధ్యాయులు మహమ్మద్ హుస్సేన్, వెంకట ప్రసాద్, వెంకట సుబ్బమ్మ, రవి కుమార్ గార్లు హాజరయ్యారు.కార్యక్రమం ప్రారంభంలో విద్యార్థులు స్వాగత గీతాన్ని ఆలపించి అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆశీర్వచనాలు అందిస్తూ, భవిష్యత్తులో ఉన్నత విద్యాభ్యాసంలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.విద్యార్థులు తమ పాఠశాల అనుభవాలను పంచుకుంటూ, గురువుల పట్ల కృతజ్ఞతాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. చివరగా విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసి కార్యక్రమాన్ని ముగించారు.

## మేకల వారి స్వగృహం నందు వధువు వరుణ్ణి ఆశీర్వదించిన అఖిలభారతరజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం రజక



సిరివెళ్ల (నంది పత్రిక). మేకలఆంజనేయులు సుబ్బలక్ష్మి గార్ల ఏకైక పుత్రుడు అజయ్ మరియు చాకలి అంజన్నప్ప తిమ్మక్క గార్ల ఏకైక పుత్రిక కుమారి వివాహ వేడుక సందర్భంగా మేకల వారి ఆహ్వానం మేరకు రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం రజక వివాహానికిహాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి నిండు నూరేళ్లు అష్ట ఐశ్వర్యాలతో పిల్లాపాపలతో సుఖ సంతోషాలతో మెలగాలని ఆకాంక్షించారు. తధానంతరం వివాహానికి హాజరైనటువంటి బంధుమిత్రులకు శ్రేయోభిలాషులకు ఆతీతులకు వివిధ రకాల వంటకాలతో కనువిందు చేశారు.

# భూమాతను కాపాడుదాం భావితరాలకు అందిద్దాం ...



మహానంది ఏప్రిల్ 22 (నంది పత్రిక):- భూమాతను కాపాడుదాం భావితరాలకు అందిద్దాం అని జిల్లా నేషనల్ గ్రీన్ కోర్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవంను మహానంది మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ మనం ఉంటున్న భూమి మీద వాతావరణం గురించి తెలుసుకోవడం స్వచ్ఛమైన వాతావరణము అందించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. మనిషి ఎంత ఇచ్చేదిగిన భూమి ఆధారము ఈ భూమి మీద నివసిస్తున్న మనసుల అంతులేని ఆదిపత్య దాహమే భూమిని కాలుష్యానికి చిరునామగా మార్చడం కటోర సత్యం అన్నారు.మితిమీరిన సహజ వనరుల వినియోగం విచక్షణారహితంగా ప్లాస్టిక్ వినియోగం సహజ నిక్షేపాల దోపిడి వలన పర్యావరణం దెబ్బతిని పుడిమి తల్లి నేడు తిరిగి సంక్షోభాన్ని ఎదుర్కొంటుందన్నారు.ఈ భూతాపములో వాతావరణంలో విపరీత మార్పులు సంభవిస్తూ వరదలు కరువు వర్షాభావ పరిస్థితులు సంభవిస్తూ జీవవైవిద్యం దెబ్బతింటుందని విద్యార్థులకు వివరించారు. మండల విద్యాశాఖ అధికారి 2 విజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తయారుచేసిన సీడ్ బాల్స్ ను చూసి విద్యార్థులను అభినందించారు. ప్రతి విద్యార్థి కూడా పర్యావరణం పట్ల అప్రమత్తంగా ఉంటూ విరివిరిగా మొక్కలు నాటాలన్నారు. నీరు,గాలి,భూమి కాలుష్యం కాకుండా ప్రతి ఒక్క విద్యార్థి అవగాహన చేసు కొని సమాజంలో ఉన్న ప్రతి వ్యక్తికి తెలియచేయాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం మధుసూదన్, నాగరాజు, హనుమంతు, సుధాకర్, సీఆర్పి తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు



## ఆత్మకూర్ మున్సిపాలిటీ కమిషనర్ ా. బేబీ గారిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన సింగల్ విండో చైర్మన్ ఎ. షహబుదీన్ .



ఈరోజు ఆత్మకూర్ మున్సిపాలిటీ కమిషనర్ గా నూతన బాధ్యతలు స్వీకరించిన ా. బేబీ గారిని వారి కార్యాలయంలో ఆత్మకూర్ పట్టణ టిడిపి పార్టీ అధ్యక్షులు వేణుగోపాల్ గారితో కలిసి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఆత్మకూర్ సింగిల్ విండో చైర్మన్ ఎ. షహబుద్దిన్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మకూర్ పట్టణానికి అభివృద్ధి పథం లోకి తీసుకుపోవాలని, స్థానిక శాసన సభ్యులు శ్రీ బుడ్డా రాజశేఖరరెడ్డి గారి సహకారంతో ముందుకు సాగాలని, వారికి పట్టణ అభివృద్ధి విషయంలో కావలసిన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. వీరి వెంట ఏ ఈ ఓబులేసు, తెలుగుదేశం పార్టీ నాయకులు రామ్మూర్తి, అన్సర్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు

# అనుమతులు పొందిన జలధార - జలహారతి పనులు వెంటనే ప్రారంభించాలి.

## మిగిలిన పనులకు తక్షణ అనుమతులు పొందాలి.
## అరికెర రెసిడెన్షియల్ స్కూల్ సంఘటన పై కలెక్టర్ సీరియస్

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** జలధార జలహారతి కార్యక్రమం కింద అనుమతులు పొందిన అన్ని పనులను ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ నుండి మండల స్థాయి అధికారులు, ఇంజనీరింగ్ విభాగ అధికారులు, ఏపీఓలతో ప్రత్యక్షంగా మరియు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..., జలధార జలహారతి కార్యక్రమం పరిధిలో ఇప్పటికే అనుమతులు పొందిన పనులు అయిన కొత్త ఫారం పాండ్లు (ఖీుతీఎ్రాశీఅఎం), ఫీడర్ ఛానెల్ డి-సిల్టింగ్, చెరువుల పూడిక తీత, పెర్కోలేషన్ ట్యాంకుల పూడిక తీత వంటి పనులను తక్షణమే ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఇంకా అనుమతులు పొందని పనుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించకుండా, ఏపీడబ్ల్యూఆర్ఐఎంఎస్ (ఞ్రాఔ=×మీా) పోర్టల్లో పూర్తి స్థాయిలో వెరిఫికేషన్ నిర్వహించి, పని పేరు, లొకేషన్, పనుల స్థానం, అంచనా వ్యయం, ఎన్ఆర్‌జీఎస్ కింద ఖర్చు, జలధార కింద ఖర్చు వంటి అన్ని వివరాలను ఖచ్చితంగా నమోదు చేసి, ఈరోజే రాత్రి లోపు జిల్లా కలెక్టర్ అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఏపీఓలు, ఏఈలు మండల స్థాయి ప్రజాప్రతినిధుల తీర్మానాలతో పాటు సరైన అంచనాలు (జుర్అఎ్ఖవం) సిద్ధం చేసి సమర్పించాలని స్పష్టం చేశారు. పనుల ప్రణాళికలో పారదర్శకతతో పాటు సమయపాలన పాటించాలన్నారు. అలాగే జిల్లా డి.డబ్ల్యూ.ఎం.ఏ వద్ద అందుబాటులో ఉన్న సుమారు 10 లక్షల మొక్కలను విస్తృతంగా నాటాలని, జలధార పనులను పచ్చదనం పెంపుతో అనుసంధానం చేసి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని కలెక్టర్ సూచించారు. ఈ చర్యల ద్వారా భూగర్భ జలాల నిల్వలు పెరగడంతో పాటు, వాతావరణ సమతుల్యతకు తోడ్పడుతుందని పేర్కొన్నారు.ఎన్ఆర్‌జీఎస్ పనులకు హాజరయ్యే కార్మికులతో జనాభా లెక్కల సేకరణలో భాగంగా సెల్ఫ్ ఎనుమరేషన్ (స్వీయ గణన ) నిర్వహించాలని ఆదేశించారు. దీనివల్ల ఖచ్చితమైన జనాభా డేటా అందుబాటులోకి వస్తుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు మరింత సమర్థవంతంగా జరుగుతుందని తెలిపారు.ఆలూరు మండలం అరికెర సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్ లో జరిగిన సంఘటన పై కలెక్టర్ సీరియస్ అయ్యారు. విద్యార్థులు క్రమశిక్షణ తో ఉండాలని కలెక్టర్ రెసిడెన్షియల్ స్కూల్ అధికారులను ఆదేశించారు..సిబ్బంది నిర్లక్ష్యం, అనుచిత ప్రవర్తన పై చర్యలు తీసుకున్నామని, హాస్టళ్లలో ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.. హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్ళలో ఎలాంటి ఫిర్యాదులు రాకూడదని, తహసీల్దారులు, ఎంపీడీవోలు మండలాల్లో ఉన్న వసతి గృహాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి విద్యార్థులతో ఏకాంతంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో ఎస్ఈ ఇరిగేషన్ బాలచంద్ర రెడ్డి, జెడ్పీ సీఈఓ రమణా రెడ్డి, డి.డబ్ల్యూ.ఎం.ఏ పీడీ నరసింహ రెడ్డి, జిల్లా ఎంపిడీఓలు, ఏఈలు, ఏపీఓలు తదితరులు పాల్గొన్నారు.



# విత్తనోత్పత్తిలో మెలకువలు పాటించాలి



**మహానంది,ఏప్రిల్ 22 (నంది పత్రిక):-** రైతులు సాగుచేసే వివిధ పంటల్లో విత్తనోత్పత్తికి సంబంధించి మెలకువలు పాటించాలని శాస్త్రవేత్తలు డాక్టర్ రవిప్రకాశ్ రెడ్డి,డాక్టర్ మోహన్ విష్ణువర్ధన్, డాక్టర్ అరుణ్ కుమార్ తెలిపారు.బుధవారం మహానంది మండలం మసీదుపురం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మహానంది ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, నంద్యాల అఖిలభారత విత్తన పరిశోధన, సమన్వయ పథకం క్రింద విత్తనోత్పత్తిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పంటల సాగులో విత్తనాల ఎంపిక కీలకమన్నారు. వరి, మినుములో మేలైన విత్తన రకాల విత్తనోత్పత్తి గురించి వివరిస్తూ. రకాల ఎంపిక, కేలీల ఏరవేత ,జన్యు, బాహ్య స్వచ్ఛతల గురించి వివరించారు.వరి ఇతర పంటలలో ఎరువుల యాజమాన్యం గురించి తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అధికారి భారతి, రైతులు పాల్గొన్నారు.

# భూ రీ సర్వే పక్కాగా నిర్వహించాలి

### - తహసిల్దార్ ఉమారాణి



**కొత్తపల్లి - నంది పత్రిక:** రైతులకు చెందిన భూములకు రెవెన్యూ సిబ్బంది భూ రీ సర్వే ఎటువంటి తప్పులు జరగకుండా పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. బుధవారం మండల పరిధిలోని గోకవరం గ్రామ పొలాల్లో ఏపీ రీసర్వే ప్రాజెక్టో భాగంగా భూ రీసర్వే కార్యక్రమంలో భాగంగా గ్రౌండ్ ట్రూథింగ్ ప్రక్రియకు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు వారి పొలాల్లో సర్వే జరిగేటప్పుడు దగ్గరుండి కొలతలు వేయించుకొని తప్పులు జరగకుండా చూసుకోవాలని చెప్పారు. సిబ్బందికూడా రైతులకు సమాచారం ఇచ్చి తర్వాతా పొలాల్లో రీ సర్వే చేయాలని చెప్పారు. కార్యక్రమంలో రీసర్వే డీప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, మండల సర్వేయర్ రాజశేఖర్, వీఆర్వో శ్రీనివాసులు, రైతులు ఉన్నారు.

# ఘనంగా లెనిన్ 156వ జయంతి




**నంద్యాల ప్రతినిధి. ఏప్రిల్ 22 . (నంది పత్రిక ):**లెనిన్ 156వ జయంతిని ఘనంగా నిర్వహించిన సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ మార్క్సిస్ట్ మహోపాధ్యాయుడు కామ్రేడ్ లెనిన్ 156 వ జయంతిని మరియు సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ 57వ ఆవిర్భావ దినోత్సవం బుధవారం నిర్వహించడం జరిగింది.మొదట కామ్రేడ్ లెనిన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది.అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ నంద్యాల డివిజన్ కార్యదర్శి ఎం శంకర్ పిడిఎస్యు నంద్యాల జిల్లా కార్యదర్శి ఏ రాంబాబు మాట్లాడుతూ రష్యాలోని జార్ చక్రవర్తుల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించి బోల్షివిక్ విప్లవాన్ని ఘనంగా జయప్రదం చేసిన నాయకుడు కామ్రేడ్ లేనినని పేర్కొన్నారు ప్రపంచంలో మొట్టమొదటి సోషలిస్ట్ దేశంగా రష్యా ఆవిర్భవించిందని పేర్కొన్నారు.ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ దేశాల నేతలకు వణుకు పుట్టిందని ప్రపంచవ్యాప్తంగా కార్మిక వర్గానికి నూతన ఉత్తేజాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు అలాగే సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ 57 సంవత్సరాలుగా దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవము కొరకు ప్రతిఘటన పోరాటాల మావో ఆలోచన విధానాలతో పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు.దేశంలో ఆదివాసులు గిరిజనులు అట్టడుగు వర్గాల హక్కుల కొరకు అనేక పోరాటాలు నిర్వహించిందని తెలిపారు.దేశంలో భూస్వామ్య పెత్తందారి పెట్టుబడిదారి వ్యవస్థల నిర్మూలన కొరకు సమసమాజ స్థాపన కొరకు అలుపెరుగని పోరాటాలు నిర్వహించిందని ఆయన తెలిపారు లెనిన్ పోరాట స్ఫూర్తితో దేశంలోని బిజెపి మతోన్మాద నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా రైతు కార్మిక ప్రజావ్యతిరేక మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రతిఘటన పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్యు నంద్యాల జిల్లా కార్యదర్శి ఏ రాంబాబు భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా కోశాధికారి ఎస్ చౌడప్ప పిడిఎస్యు నంద్యాల డివిజన్ నాయకులు వెంకటేశ్వర్లు శేషు చంద్రశేఖర్ శ్రీనివాసులు రమేష్ నారాయణ సుబ్బరాయుడు రామకృష్ణ రామసుబ్బయ్య ఆనంద్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ దిగ్గజ నేత నాదెండ్ల భాస్కరరావు మృతి తీరని లోటు

### ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఏప్రిల్ 22 నంది పత్రిక** మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు మృతిపై ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సంతాపం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు మరణవార్త తనను తీవ్రంగా కలచివేసిందన్నారు.ఎన్టీఆర్ వంటి మహానేతలతో కలిసి పనిచేసిన భాస్కరరావురాజకీయ ప్రస్థానం రాష్ట్ర రాజకీయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని ఆమె అన్నారు.ఎమ్మెల్యేగా, ఎంపీగా ఆయన ప్రజలకు అందించిన సేవలను చిరస్మరణీయమన్నారు. భాస్కరరావు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ , వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ తెలిపారు.

# ప్రధాని మోడీ పై కాంగ్రెస్ వ్యాఖ్యలను ఖండించిన బద్వేల్ మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ సుప్రజ



**బద్వేల్, ఏప్రిల్ 22 (నంది పత్రిక ):**ప్రపంచ ప్రజల అభిమానాలను చూరగొన్న ప్రధాని మోడీపై కాంగ్రెస్ నాయకులు చేసే వ్యాఖ్యలు సంస్కారహీనంగా ఉన్నాయని సుప్రజ విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రధానిని ఇష్టమొచ్చిన రీతిలో దూషించడం కాంగ్రెస్ నాయకుల మనస్తత్వాన్ని తెలియజేస్తుందని అన్నారు. పెద్ద నోట్ల రద్దు, 370 ఆర్టికల్ రద్దు, పౌరసత్వ సవరణ చట్టం, త్రిపుల్ తలాక్ రద్దు, అయోధ్య రామాలయ సమస్య పరిష్కారం ఒంటి దేశ సమస్యల పరిష్కారానికి ఆయన ఒక దిక్సూచి అని అటువంటి రాజనీతిజ్ఞున్ని మల్లికార్జున ఖర్గేను ముందు పెట్టి కాంగ్రెస్ నాయకుల దుర్మార్గపు ఆలోచనలను ఆయన నోటి గుండా చెప్పించడం క్షమించరాని విషయమని, దేశ ప్రజలు దీనిని గమనిస్తున్నారని ఈ సందర్భంగా ఆమె అన్నారు. ప్రధానిపై విమర్శలు చేసే సందర్భంలో హుందాతనాన్ని ప్రదర్శించాలని ఆమె సలహా ఇచ్చారు.

# మార్క్సిస్టు మహోపాధ్యాయులు కామ్రేడ్ లెనిన్ 156 వ జయంతి సందర్భంగా నివాళి సిపిఐ




**కర్నూలు ప్రతినిధి నందిపత్రిక** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో కామ్రేడ్ లెనిన్ 156 జయంతి వేడుకలు స్థానిక సిఆర్ భవన్ నందు ఘనంగా నిర్వహించారు నిర్వహించారు ఈ కార్యక్రమానికి సిపిఐ నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్ మునెప్ప, నక్కి లెనిన్ బాబు లు ముందుగా లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కామ్రేడ్ లెనిన్ 156 సంవత్సరాల క్రితం, 1870, ఏప్రిల్ 22న రష్యాలోని సింబిర్కో లెనిన్ జన్మించారు అని ఎన్ని తరాలు మారినా, మరెన్ని వక్ర భాష్యాలు, సిద్ధాంతాలు ఉద్భవించినా ప్రపంచగమనాన్ని మార్చిన వ్యక్తులను ఎవ్వరూ విస్మరించలేరు అన్నారు. మానవజాతి మనుగడ కొనసాగినంత వరకూ, దోపిడీ, పీడనలు తొలగిపోయి, ఎటువంటి వివక్షకూ తావులేని సమసమాజం ఆవిష్కృతం అయ్యేవరకు లెనిన్ అనే మూడక్షరాలు యావత్ సమాజాన్ని ప్రభావితం చేస్తూనే ఉంటాయి అన్నారు. నేడు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను పథకాల పేరుతో మభ్యపెడుతున్నాయని అన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను, గిరిజనులను అడవి నుండి గెంటి వేయడం దారుణమని తెలిపారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని విస్మరించి,మనువాదా భావజాలాన్ని చాప కింద నీరులా అమలు చేయడానికి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు.దున్నేవానికే భూమి దక్కాలని నూతనప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలని మార్క్సిజం లేనినిజం వర్ధిల్లాలి అని వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు సిపిఐ నగర సహాయ కార్యదర్శులు సి మహేష్ డి శ్రీనివాసరావు జి చంద్రశేఖర్ నగర కార్యవర్గ సభ్యులు నాగరాజు, రామచంద్ర ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు బి నాగరాజు, మహిళా సమైక్య నాయకురాలు మునెమ్మ నగరనాయకులు చందు, హుసేన్, రంగస్వామిపాల్గొన్నారు

# “పెద్దపాడు, దామోదరం సంజీవయ్య బాల సదన్ హాస్టల్ ను తనిఖీ చేసిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి



**కర్నూలు నంది పత్రిక బ్యూరో.....**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి బుధవారం పెద్దపాడు నందు గల దామోదరం సంజీవయ్య బాల సదన్ హాస్టల్ ను తనిఖీ చేశారు. బాల సదన్ లోని అపరిశుభ్ర పరిస్థితులను చూసి అక్కడ సిబ్బందిని బాలసదన్ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. అలాగే పిల్లలని అడిగి వారికందుతున్న భోజన వసతి సదుపాయాల గురించి విచారించగా పిల్లలు వారికి నాణ్యమైన భోజనం పెట్టడం లేదని గుడ్లు పిల్లలందరికి పెట్టడం లేదని జడ్జి కి విన్నవించారు. జడ్జిగారు అక్కడ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసి పిల్లలకు సరైన భోజనం మరియు అందరికీ గుడ్లు కచ్చితంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. బాలసదన్ లో తగినంత సిబ్బంది ఉన్నా కూడా ఇలా పిల్లల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.కార్యాలయాలకు సంబందించిన రిజిస్టర్ లను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు . ఏవైనా లోపాలు ఉంటే వాటి మీద అవసరమైన చర్యలు తీసుకోవడానికి సంబంధిత ఉన్నత అధికారుల దృష్టికి తీసుకొనివేళతాము అని తెలియ జేశారు.ఈ కార్యక్రమంలో ఆయా సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ధరిత్రిని కాపాడుకోవడం మన అందరి బాధ్యత:ప్రిన్సిపాల్

### ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ధరిత్రి దినోత్సవం




**బనగానపల్లె, ఏప్రిల్ 22 :నందిపత్రిక** ఈ భూమి పట్ల ప్రతి ఒక్కరం భాద్యత కలిగి ధరిత్రి కాపాడుకోవాలని ప్రిన్సిపాల్ లలిత అన్నారు. బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ధరిత్రి దినోత్సవాన్ని (ఎర్త్ డే - 2026) బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని వృక్షశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. లలిత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రపంచానికి అవసరమైన సహజ వనరులను కాపాడడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని ఆమె తెలిపారు.విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో సైనికుల్లా పనిచేయాలని ఆమె సూచించారు.అనంతరం వృక్ష శాస్త్రం అధ్యాపకురాలు డా. జె. వసుంధర పర్యవేక్షణలో విద్యార్థులు కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమం లో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాధ్యతలు స్వీకరించిన నూతన కమిషనర్ చల్లా ఓబులేసు

**కర్నూలు ప్రతినిధి నందిపత్రిక** నగరపాలక సంస్థ నూతన కమిషనర్ చల్లా ఓబులేసు బాధ్యతలు స్వీకరించారు. బుధవారం రాత్రి వెంకటరమణ కాలనీలోని నగరపాలక కార్యాలయంలో దస్త్రాలపై ఆయన సంతకాలు చేశారు. అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టర్లు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరి సహకారంతో నగరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం విభాగాధిపతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, విభాగాధిపతులు, పాల్గొన్నారు.



# అన్నా క్యాంటీన్లను పరిశుభ్రంగా నిర్వహించాలి.

### ఇంచార్జి కమిషనర్ శారదా దేవి .

**తిరుపతి బ్యూరో చీఫ్ ఏప్రిల్ 22నంది పత్రిక** నగరంలోని అన్నా క్యాంటీన్లను పరిశుభ్రంగా నిర్వహించాలని నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదా దేవి సిబ్బందిని ఆదేశించారు. నగరంలోని స్విమ్స్ కూడలి వద్ద ఉన్న అన్నా క్యాంటీన్ ను బుధవారం మధ్యాహ్నం ఇంచార్జి కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనం తింటున్న వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంచార్జి కమిషనర్ మాట్లాడుతూ అన్నా కాంటీన్లను పరిశుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. ఒక్కొక్కరికి ఒక్క టోకెన్ మాత్రమే ఇవ్వాలని సూచించారు. అన్నం వృధా చేయకుండా తగినంత తీసుకోవాలని తెలిపారు. స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని తెలిపారు. ప్రజల నుండి ఎటువంటి పిర్యాదులు అందకుండా జాగ్రత్తగా శుభ్రమైన ఆహార పదార్థాలు అందించాలని తెలిపారు. అన్నా కాంటీన్లలో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా మా దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.



# గ్రామాలలో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణ లో లోపాలు ఉండకూడదు

## విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు

## బాల్య వివాహాలు అరికట్టడంలో గ్రామస్థాయి అధికారులు కీలక పాత్ర పోషించాలి

## జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.



**కర్నూలు, నంది పత్రిక బ్యూరో....**గ్రామాలలో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణ మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఎంపిడిఓ లను, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులతో పారిశుధ్యం, త్రాగునీరు, బాల్యవివాహాల నివారణ అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలను సక్రమంగా నిర్వహించడం పంచాయతీ కార్యదర్శుల ప్రాథమిక బాధ్యత అన్నారు. తన పర్యటనలో భాగంగా మండలాలు, గ్రామాలను సందర్శించినప్పుడు దాదాపు అన్ని చోట్లా చెత్త పేరుకుపోయి ఉండటాన్ని గమనించానన్నారు. ఇటీవల పత్తికొండ మండలం కొత్తపల్లి గ్రామంలో పర్యటించే సమయంలో పారిశుధ్యం లోపాన్ని గమనించడం జరిగిందన్నారు. తుగ్గలి, మద్దికెర, చిప్పగిరి, హొళగుంద, కోసిగి తదితర మండలాల్లో పారిశుధ్యం లోపాలు అధికంగా ఉన్నాయని, వాటిని మెరుగుపరిచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి ంఙజూాఙ షెడ్ ల వద్దకు తీసుకొని వెళ్లాలన్నారు. ఇన్ని సార్లు చెప్పిన తర్వాత కూడా పారిశుధ్యం పనులలో మార్పు రాకపోతే చర్యలు చాలా కఠినంగా ఉంటాయన్నారు. ఒక గ్రామం అభివృద్ధి, అందం ప్రధానంగా పారిశుధ్యంపై ఆధారపడి ఉంటుందన్నారు. బస్ స్టాండ్, రైల్వే స్టేషన్, శానిటేషన్, బ్యూటిఫికేషన్ వంటి అంశాలు గ్రామ ప్రతిష్టను ప్రతిబింబిస్తాయన్నారు. పారిశుధ్య పనుల కోసం ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పించినప్పటికీ కేవలం పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణ లోపం కారణంగా సమస్యలు వస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. శానిటేషన్ అత్యంత ప్రాముఖ్యం అని, ఎక్కడా చెత్త కనిపించకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. మేజర్ పంచాయతీల్లో చెత్త వేయరాదు అని సూచనలు ఉన్నా, అవి పట్టించుకోకుండా చెత్త వేస్తున్న ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ డిపిఓ ను ఆదేశించారు.త్రాగు నీరు కు సంబంధించి జిల్లాలో ఉన్న 35 ఎస్ఎస్ ట్యాంకులను నింపడం జరుగుతోందన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు తుంగభద్ర ఎల్ఎల్‌సి (ంబఅస్త్రుఎష్త్రుంతీు ూాజ) కాలువ ద్వారా నీటి విడుదల ఉండడం వల్ల, నీళ్లను పంప్ చేస్తున్నామన్నారు.. ఇప్పటికీ 70%, 60%, కొన్ని 90% వరకు కూడా నిండాయన్నారు. ఏప్రిల్ లో నింపిన నీరు జూలై సగం వరకువాడుకోగలమని, నీరు సమృద్ధిగా ఉన్నప్పటికీ వార్తాపత్రికల్లో ప్రతికూల వార్తలు వస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ఎక్కడైనా పైప్ లైన్ సమస్యలు ఉంటే వాటిని ముందుగానే గుర్తించి తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు..త్రాగునీటి వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ, ప్రజలకు సమానంగా పంపిణీ చేయడంలో లైన్‌మెన్, వాటర్ మెన్ విఫలమవుతున్నారని, నీరు అందరికీ సమానంగా పంపిణీ చేయాలన్నారన్నారు. ఏ మండలాల్లో నీటి సమస్యలపై ప్రతికూల వార్తలు వస్తున్నాయో, ఆయా మండలాల అధికారులు వివరణ ఇవ్వాలన్నారు. పన్నుల ద్వారా వసూలు చేసిన మొత్తాన్ని కొంచెం వీధి దీపాలకు ఖర్చు చేయాలన్నారు. కనీసం అవసరమైన చోట రెండు దీపాలైనా ఏర్పాటు చేయాలని, ఏ ప్రాంతాన్ని చీకటిలో ఉంచకూడదన్నారు. త్రాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాల విషయంలో మెరుగైన పనితీరు కనబరచాలని, అలాగే బాల్య వివాహాలను అరికట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇంత చెప్పిన తర్వాత కూడా ఎవరైనా బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తే, వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి నెల మొదటి వారంలో డ్రైన్స్ అన్నిశుభ్రం చేయించాలన్నారు. వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు, అంటే మే నెలాఖరు కల్లా అన్ని పైప్‌లైన్ రిపేర్లు, ట్యాంకుల క్లీనింగ్ పూర్తి చేయాలన్నారు. ఎక్కడైనా డ్రైనేజీలో వాటర్ పైప్‌లైన్లు ఉంటే చెక్ చేసి తీసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కలుషిత నీటికి సంబంధించి ఏదైనా ఒక్క కేసు నమోదైనా మీరే బాధ్యులని కలెక్టర్ హెచ్చరించారు. మంత్రాలయం మండలం రచ్చమర్రి గ్రామంలో పర్యటిస్తున్న సమయంలో బాల్య వివాహాన్ని ఆపడం జరిగిందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహం జరిగితే పంచాయతీ సెక్రెటరీ, వీఆర్వో, అంగన్‌వాడీ సిబ్బందిని బాధ్యులని తెలిపారు. బాల్య వివాహాలు నిర్మూలనకు ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలన్నారు. గత ఏడాది మన జిల్లాలో 83 బాల్య వివాహాలను అరికట్టామన్నారు. ఈ మూడు నెలల్లో కూడా మరో 40 కి పైగా బాల్య వివాహాలను ఆపగలిగామన్నారు. చదువు మధ్యలో ఆపేసిన పిల్లలందరినీ గుర్తించి, వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రస్తుతం 9, 10 తరగతుల అడ్మిషన్లు జరుగుతున్నాయి కాబట్టి వారిని మెయిన్ స్ట్రీమ్ లోకి తీసుకురావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.సమావేశంలో డిపిఓ భాస్కర్, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# కోయిలకుంట్ల గాంధీ సెంటర్లో చలివేంద్రం



**కోవెలకుంట్ల ఏప్రిల్ 22నందిపత్రిక** కామ్రేడ్ జీవి కొండారెడ్డి గారి స్మారక గ్రంథాలయం వద్ద ప్రజల దాహార్తి తీర్చుకొనుటకు ,,ఎండలు విపరీతంగా మండిపోతున్నందున కొంతమేరకైనా ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉంటుందని కామ్రేడ్ జీవి కొండారెడ్డి గ్రంధాలయ ట్రస్టు ,మరియు, కోవెలకుంట్ల తాలూకా యువ సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి యువసమాఖ్య సభ్యులు,, గ్రంధాలయ పాఠకులు ,,కామ్రేడ్ జీవి కొండారెడ్డి గారి అభిమానులు పాల్గొన్నారు.

# నిరంతర పూజనీయుడు గురువు: ఎంఈవో



**మహానంది ఏప్రిల్ 22 (నంది పత్రిక ):-** నిరంతర పూజనీయుడు గురువు అని మండల విద్యాశాఖ అధికారులు రామసుబ్బయ్య, విజయ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం మహానంది మండలం తిమ్మాపురంలోని ఎంపీపీ స్కూల్లో పనిచేసిన ప్రధానోపాధ్యాయుడు మద్దిలేటి పదవి విరమణ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవోలు మాట్లాడుతూ.. ప్రధానోపాధ్యాయుడు మద్దిలేటి అందించిన సేవలు గుర్తుండి పోతాయన్నారు.వారి శేష జీవితం మంచి ఆరోగ్యంతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మణరావు,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ రెడ్డి,మండల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బ సోకి ఉపాధి కూలి మృతి.



**రుద్రవరం ప్రతినిధి ఏప్రిల్ 22 (నంది పత్రిక):** మండలంలోని కోటకొండ గ్రామంలో వడదెబ్బ సోకి కుమ్మరి పెద్ద మద్దయ్య అనే ఉపాధి కూలీ ( 73) మృతి చెందినట్టు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు వివరాల మేరకు గ్రామ సమీపంలో ఉన్న పంట పొలాలలో ఉపాధి పని చేస్తూ ఉండగా ఎండ వేడిమి కారణంగా వాంతి చేసుకొని అస్వస్థకు గురి అయ్యాడు అన్నారు. దీంతో అతన్ని తోటి ఉపాధి కూలీలు ఇంటికి తీసుకుని వస్తుండగా మార్గమధ్యలోని మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఉపాధి పని ప్రదేశంలో ఉపాధి అధికారులు ఎండ బారి నుండి ఉపశమనం కోసం ఏర్పాటు చేయాల్సిన నీడ, త్రాగునీరు వసతి కల్పించకపోవడంతో ఉపాధి కూలీలు తరచూ వడదెబ్బకు గురవుతున్నారు. ఉపాధి పనులు గంటల తరబడి ఎండలోని చేస్తూ ఉండడంతో వడదెబ్బ బారిన పడుతున్నారని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఉపాధి పని ప్రదేశంలో నీడ త్రాగునీరు వసతి కల్పించాలని అలాగే మెడికల్ కి ట్లు అందుబాటులో ఉంచాలని కూలీలు కోరుతున్నారు.

# తగ్గిన వేలంపాట ఆదాయం



**కొత్తపల్లి - నంది పత్రిక:** మండల కేంద్రంలో వెలసిన శ్రీ పార్వతీ సమేత తాండవ మల్లేశ్వరస్వామి, శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాకు చెందిన భూమల బహిరంగ వేలంపాటను ఆలయ ఈఓ కార్తీక్, ఏఎస్పీ రామ్నాయక్ల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కాగా గత ఏడాది కన్నా ఈ ఏడాది బహిరంగా వేలంపాటలో రూ.40 వేలు తగ్గింది. రెండు ఆలయాలకు చెందిన మొత్తం పొలం 58 ఎకరాలు కౌలు వేల పాట గత సంవత్సరం రూ. 6లక్షల 76 వేలు రాగా ఈ ఏడాది రూ.6 లక్షల 36 వేల రూపాయలు వేలంపాట పాడడం జరిగింది. దీంతో 40 వేలు ఆదాయం తగ్గినట్లు ఈఓ వెల్లడించారు.

# బాల్యవివాహాల నిరోధక చట్టం పై కళాజాత ద్వారా అవగాహన.



**రుద్రవరం ప్రతినిధి ఏప్రిల్ 22 (నంది పత్రిక):** బాలవివాహాలు విరోధక చట్టంపై ప్రజలకు కళాజాత ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం మండల కేంద్రం రుద్రవరం లోని అమ్మవారు శాల నాలుగు రోడ్డు కూడలిలో ఆళ్లగడ్డ ఐసిడిఎస్ ,సిడిపిఓ తేజేశ్వరి ఆధ్వర్యంలో కళాజాత ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు పాటలు, నాటికల ద్వారా బాల్య వివాహాలు చేయడం వల్ల వచ్చే అనర్థాలు, సరైన వయసులో వివాహాలు చేయడం వల్ల కలిగే లాభాలు గురించి కళాకారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్, సూపర్వైజర్ రసీదా బేగం, గ్రామ పెద్దలు లింగం వెంకట రంగనాయకులు శెట్టి, అల్లడి చంద్రశేఖర్ పలువురు గ్రామ పెద్దలు అంగనవాడి కార్యకర్తలు ఆయాలు గ్రామ ప్రజలు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# భారీ ఈదురు గాలులకు నేల వాలిన అరటి చెట్లు

## సుమారు 100 ఎకరాల్లో పైగా అరటి పంట నష్టం



**మహానంది ఏప్రిల్ 22 (నంది పత్రిక):-** మహానంది మండలంలోని పలు గ్రామాలలో భారీ ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. భారీ ఈదురుగాలులకు పలుచోట్ల అరటి చెట్లు నేలవాలాయి.తిమ్మాపురం, బుక్కాపురం,కృష్ణనంది, గోపవరం, గాజులపల్లె పరిసరాల్లో రైతులు సాగు చేస్తున్న అరటి తోటల్లో చెట్లు నేలకు విరిగి పడటంతో అరటి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సుమారు 100 ఎకరాల్లో అరటి చెట్లు పడిపోయినట్లు బాధిత రైతులు తెలిపారు. ఏటా నష్టం ... ఎన్నాళ్లో ఈ కష్టం అంటూ రైతులు కంటతడి పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది.అకాల వర్షానికి అరటిపంటతో పాటు కోతకు వచ్చిన మొక్కజొన్న,వరి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# 111 మందికి సీఎం సహాయనిధి చెక్కుల పంపిణి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి

చెక్కలను పంపిణి చేస్తున్న ఎమ్మెల్యే

స్మార్ట్ ఫోన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే



**వెలుగోడు, ఏప్రిల్ 22 (నంది పత్రిక):** పేద ప్రజలకు సీఎం సహాయ నిధి ఒక వరమని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. ఆదివారం వేల్పనూరు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మహానంది, బండిఆత్మకూరు, వెలుగోడు, ఆత్మకూరు మండలాలకు చెందిన 111 మంది లబ్ధిదారులకు రూ.64 లక్షల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్టీలకు అతీతంగా సహాయం కోరిన ప్రతి ఒక్కరికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తామని తెలిపారు. గతంలో కూడా రికార్డు స్థాయిలో ఈ నిధులు ప్రజలకు అందించామని, ప్రస్తుతం కూడా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదల వైద్య చికిత్సల కోసం లక్షల రూపాయల సహాయం అందించారని పేర్కొన్నారు.

**5జి స్మార్ట్ ఫోన్ల పంపిణి:** వేల్పనూరు గ్రామంలో గ్రామ పేదరిక నిర్మూలన సంస్థ (వెలుగు) ఆధ్వర్యంలో గ్రామ సంఘాల కార్యకర్తలకు 5జి స్మార్ట్ ఫోన్లను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పంపిణీ చేశారు. గ్రామ స్థాయిలో సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు, డిజిటల్ కమ్యూనికేషన్‌ను బలోపేతం చేయడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం సహకార సంఘాల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు కృషి, ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలన్నదే ప్రభుత్వ సంకల్పమని అన్నారు.ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఏ, వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు, వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాలకు చెందిన వి.ఓ.ఏలు, సిబ్బంది ఉన్నారు. అనంతరం ఆత్మకూరు, వెలుగోడు సిబ్బంది, వి.ఓ. ఏలకు 2026-27 సంవత్సరానికి సంబంధించిన హెచ్ఎల్‌పి, ఎంసిపి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. తదనంతరం వెలుగోడు మండలం స్త్రీశక్తి భవనంలో జెండర్ రిసోర్స్ సెంటర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి. మండల పరిధిలో జెండర్‌కు సంబంధించిన సమస్యలు ఉంటే ఈ కేంద్రం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ఎంఎస్ ఓపి మండల జెండర్ కమిటీ సభ్యులు, సిబ్బంది, వి.ఓ.ఏలు. హాజరు కావడం జరిగింది.

# జిల్లా లో పరిశ్రమల స్థాపనను వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి



**కర్నూలు, నంది పత్రిక బ్యూరో....**జిల్లా లో పరిశ్రమల స్థాపనను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఎంఓయూలు మీాఖం అయిన మరియు అనుమతి పొందిన (ఘఅష్ఱశీఅవ్రం) ప్రాజెక్టులపై కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలులో ఉన్న వివిధ ప్రాజెక్టుల పురోగతిని కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. ప్రాజెక్టుల వేగవంతమైన అమలు, భూసేకరణ, అవసరమైన అనుమతులు, అలాగే ఇతర సమస్యలపై విస్తృతంగా చర్చించారు. జిల్లాలో 38 పరిశ్రమల ఏర్పాటుకు ఎంవోయూ లు అయ్యాయని, వీటిలో ఇంకా మొదలు పెట్టని పరిశ్రమలను త్వరితగతిన మొదలు పెట్టాలని, అలాగే మొదలు పెట్టిన పరిశ్రమలను వేగంగా పూర్తి చేయాలని, పూర్తి అయిన పరిశ్రమలను త్వరితగతిన ప్రారంభించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అన్ని పరిశ్రమలను నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలని కలెక్టర్ గారు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ అశోక్ కుమార్, ఞూ××జ జోనల్ మేనేజర్ మధు సూదన్ రెడ్డి,చీ=జుఙజూఞా ఙవజవశ్రీశీజూఎవత్ శీటటఱఎవతీ వీరేంద్ర పాల్గొ న్నారు.

# దివ్యాంగుల సమస్యల పైన ఎంపీ బైరెడ్డి శబరి కి వినతి పత్రం అందజేత

**నంద్యాల ప్రతినిధి. ఏప్రిల్ 22 . (నంది పత్రిక ):**దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ ఆధ్వర్యంలో స్థానిక బొమ్మల సత్రంలో ఉన్న ఎంపీ కార్యాలయంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కి వినతిపత్రం అందించడం జరిగినది.ఈ సందర్భంగా డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ వ్యవస్థాపక అధ్యక్షులు డిపి మస్తాన్ వలి మాట్లాడుతూ దివ్యాంగులకు గత సంవత్సరంలో జూన్ 26 తేదీన టౌన్ హాల్లో అలింకో సంస్థ వారు దివ్యాంగులకు కావలసిన సహాయ పరికరాల ఎంపిక శిబిరం నిర్వహించడం జరిగిందని, గత సంవత్సరం అక్టోబర్ నెలలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని వృద్ధులకు వీల్ చైర్స్, చేతి కర్రలు, వాకర్స్,బెల్టులు ఇవ్వడం జరిగిందని దివ్యాంగులకు ఇంతవరకు కూడా బ్యాటరీ ట్రై సైకిల్స్ ఇవ్వలేదని దివ్యాంగులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తొందరగా బ్యాటరీ ట్రై సైకిల్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. అలాగే ఆన్లైన్లో అప్లై చేసుకున్న దివ్యాంగులకు ప్రభుత్వం ఇస్తున్న మూడు చక్రాల స్కూటర్లు త్వరగా ఇప్పించాలని, తదితర దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు స్పందించిన డాక్టర్ బైరెడ్డి శబరి దివ్యాంగుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్ సభ్యులు నబి రసూల్, పాణ్యం మండల వికలాంగుల అధ్యక్షులు రవీంద్ర నాయక్, రవికుమార్, అబ్దుల్లా, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.



# డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి అందరూ భాగస్వాములు కావాలి





**యువతను మాదకద్రవ్యాల నుంచి కాపాడటం ప్రధాన లక్ష్యం**

**డ్రగ్స్ సరఫరాదారులపై కఠిన చర్యలు తప్పవు**

**పాఠశాలలు, కళాశాలల్లో డ్రగ్స్‌పై విస్తృత అవగాహన కార్యక్రమాలు**

**డ్రగ్స్ అలవాటు జీవితం పతన దిశగా నడిపిస్తుంది**

**యువత కష్టపడి చదివి సమాజానికి ఆదర్శంగా నిలవాలి**

**డ్రగ్స్ ఫిర్యాదులకు 1902, 1972 టోల్ ఫ్రీ నంబర్లు**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల బ్యూరో, ఏప్రిల్ 22(నంది పత్రిక):–** ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో మాదక ద్రవ్యాల నియంత్రణపై నిర్వహించిన సమావేశంలో, జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. యువత మాదకద్రవ్యాలకు బానిసలుగా మారకుండా కాపాడటం అత్యంత అవసరమన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు మరియు సామాజిక దుష్ప్రభావాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. డ్రగ్స్ సరఫరా, విక్రయాల్లో పాల్గొనే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లల ప్రవర్తనలో మార్పులను గమనిస్తూ, వారు చెడు అలవాట్లకు లోనుకాకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమాజం మొత్తం కలిసి పనిచేసినప్పుడే డ్రగ్స్ సమస్యను నిర్మూలించగలమని ఆమె స్పష్టం చేశారు.

**డ్రగ్స్ ప్రభావం – హెచ్చరిక** డ్రగ్స్ అలవాటు వ్యక్తిని క్రమంగా పతన దిశగా నడిపిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. తాత్కాలిక ఆనందం కోసం ప్రారంభమయ్యే ఈ అలవాటు, ఆర్థిక మరియు నైతిక విలువలను దెబ్బతీస్తుందన్నారు. స్నేహితుల ప్రభావంతో మరింత మందిని ఈ దుష్ప్రవర్తనలోకి లాగడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

**కుటుంబాలపై ప్రభావం** డ్రగ్స్‌కు బానిసైన వారివల్ల కుటుంబాలు తీవ్రంగా దెబ్బతింటాయని కలెక్టర్ తెలిపారు. తల్లిదండ్రులు మానసికంగా కుంగిపోతూ, చివరకు పిల్లలను పునరావాస కేంద్రాలకు తరలించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.

**యువతకు సందేశం** విద్యార్థులు కష్టపడి చదివి, తల్లిదండ్రులు మరియు గురువులకు గర్వకారణంగా నిలవాలని సూచించారు. సమాజానికి ఉపయోగపడే విధంగా జీవిస్తూ, దేశ అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

**ఫిర్యాదు & సహాయం**డ్రగ్స్ వినియోగం లేదా విక్రయాలపై సమాచారం ఉన్నవారు వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. ఇందుకోసం 1902 మరియు టోల్ ఫ్రీ నంబర్ 1972 అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు.

**ఆరోగ్యంపై దుష్ప్రభావాలు** డ్రగ్స్ వాడకం వల్ల మెదడు, గుండె, కాలేయం, కిడ్నీలు తీవ్రంగా దెబ్బతింటాయని తెలిపారు. నాడీ వ్యవస్థకు నష్టం కలగడంతో పాటు రక్తపోటు పెరగడం, దంత సమస్యలు వంటి అనారోగ్యాలు తలెత్తుతాయని వివరించారు.

**జాగ్రత్తలు** యువత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోవాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ మాట్లాడుతూ, డ్రగ్స్ సమస్య సమాజం మొత్తం బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. ఎక్కడైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మద్యం, ధూమపానం, అధిక మొబైల్ వినియోగం వంటి వ్యసనాలనూ నివారించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యాసంస్థలు తమ పరిధిలో ఇలాంటి కార్యకలాపాలను గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాల్సిందిగా కోరారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని, ఈ అవగాహన సందేశాన్ని సమాజంలో విస్తృతంగా వ్యాప్తి చేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు. అంతకుముందు ఎలీట్ ఆంటీ –నారకోటిస్ గ్రూప్ ఫర్ లా ఎన్ఫోరసెమెంట్ (ఈగల్ ) బృందం ఆధ్వర్యంలో డ్రగ్స్ నియంత్రణపై అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ప్రభుత్వ సర్వజన వైద్యశాల నుండి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలు వరకు నిర్వహించబడింది. ఈ ర్యాలీలో కలెక్టర్, ఎస్పీలతో పాటు నంద్యాల సబ్‌డివిజన్ ఏఎస్పీ ఎం. జావళి ఆల్ఫోన్స్, ఈగల్ బృందం ప్రతినిధులు పాల్గొన్నారు.

## మహానంది క్షేత్రంలో నేడు గంగా పుష్కరోత్సవం



**మహానంది ఏప్రిల్ 22 (నంది పత్రిక):–** మహానంది క్షేత్రంలో నేడు వైశాఖ శుద్ధ సప్తమి సందర్భంగా గంగా పుష్కరోత్సవం నిర్వహిస్తున్నట్లు వేద పండితులు రవిశంకర్ అవధాని తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈవో శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.గంగాదేవి మహానంది క్షేత్రంలోని నంది తీర్థంలోకి(రుద్రగుండంలో) స్వయంగా వచ్చి స్నానం చేసే రోజు కావడంతో ఉదయం 6–00గంటలకు రాజగోపురం వద్ద గంగాదేవి ఉత్సవమూర్తికి ఉపచార పూజలు చేయడం జరుగుతుందన్నారు.అనంతరం గంగాదేవిని వేదమంత్రాలు, మంగళవాయిద్యాలతో స్వాగతం పలికి లోపలి కోనేరుకి తీసుకుని వెళ్ళి అక్కడ విశేష అభిషేకాలు అలంకార హారతులు నిర్వహించడం జరుగుతుందన్నారు.తదుపరి గంగా సంకల్పం చేసి గంగాదేవిని స్నానం చేయించడం జరుగుతుందన్నారు.అనంతరం భక్తులందరూ స్నానం చేయుటకు అనుమతించడం జరుగుతుందని తెలిపారు.12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే గంగానదిలో పుష్కర స్నానం చేసిన ఫలం దక్కుతుందన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సంకల్పస్నానం చేసి తరించగలరని కోరారు.

## పోషణ పక్షోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి

**పిల్లల భవిష్యత్తుకు ఉమ్మడి కుటుంబాలే బలమైన పునాది**

**మొదటి 1000 రోజులు అత్యంత కీలకం - తల్లిదండ్రులకు అవగాహన అవసరం**

**ఫోన్లు, టీవీల అతివాడకం పిల్లల అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం**

**కథల ద్వారా పిల్లల్లో నైతిక విలువల పెంపకం అవసరం**

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, ఏప్రిల్ 22(నంది పత్రిక):–** పోషణ పక్షోత్సవాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రజల్లో ఆరోగ్యం మరియు పోషకాహారంపై విస్తృతమైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. బుధవారం నంద్యాల పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వెనుకనున్న నివర్తి భవన్‌లో నిర్వహించిన పోషణ పక్షోత్సవాల కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, సమాజంలో మారుతున్న కుటుంబ వ్యవస్థ, పిల్లల పెంపక విధానాలు మరియు ఆధునిక జీవనశైలితో ఏర్పడుతున్న సమస్యలపై పోషణ పక్షోత్సవాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. గతంలో పెద్ద సంఖ్యలో ఉన్న ఉమ్మడి కుటుంబాలు ప్రస్తుతం తగ్గిపోవడం, వాటి స్థానంలో చిన్న కుటుంబాలు (న్యూక్లియర్ ఫ్యామిలీస్) పెరగడం వల్ల పిల్లల సంరక్షణలో లోటుపాట్లు ఏర్పడుతున్నాయని తెలిపారు. తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగస్తులు కావడం వల్ల పిల్లలను డే కేర్ కేంద్రాలు లేదా ఇతరుల వద్ద ఉంచాల్సిన పరిస్థితులు వస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. పిల్లల అభివృద్ధిలో తొలి 1000 రోజులు అత్యంత కీలకమని స్పష్టం చేస్తూ, గర్భధారణ దశ నుంచి పుట్టిన తరువాత రెండున్నర సంవత్సరాల వరకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దశలో తల్లి పాలివ్వడం, ప్రేమతో పెంచడం, పాటలు పాడడం వంటి చర్యలు పిల్లల మానసిక మరియు నరాల అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని వివరించారు. అదేవిధంగా, చిన్నపిల్లలకు ఫోన్లు, టీవీలు అధికంగా ఇవ్వడం వల్ల కంటి సమస్యలు, మాట్లాడే లోపాలు, సామాజిక దూరం, హైపర్ యాక్టివిటీ వంటి సమస్యలు తలెత్తుతున్నాయని హెచ్చరించారు. పిల్లలతో ప్రత్యక్షంగా గడపడం, వారితో సంభాషించడం అత్యంత అవసరమని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లలలో మంచి విలువలు పెంపొందించేందుకు కథల ద్వారా బోధన ఎంతో ఉపయోగకరమని పేర్కొంటూ, “సిండ్రెల్లా” కథను ఉదాహరణగా వివరించారు. ఈ కథ ద్వారా దయ, సహనం, మంచితనం వంటి గుణాలను పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా చేయవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా పిల్లల పెంపకంలో తాతయ్యలు, అమ్మమ్మల పాత్ర అత్యంత ముఖ్యమని గుర్తుచేస్తూ, కుటుంబ సభ్యులందరూ కలిసి పిల్లల భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అలాగే, తల్లిదండ్రులు సరైన ఆహారపు అలవాట్లు, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన, విలువలతో కూడిన భవిష్యత్ తరాన్ని తీర్చిదిద్దేందుకు కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.



## రైతు కుటుంబంలో జన్మించి...తెలంగాణా బెటాలియన్ డి. ఐ.జి.గా ఎదిగిన వెంకట రమణా రెడ్డి.





### రాయలసీమలోని కొత్తపల్లె గ్రామానికి గర్వకారణం. స్వతంత్రం వచ్చిన తర్వాత రాయలసీమలో మొదటి డి. ఐ.జి .గా వెంకట రమణా రెడ్డి.

**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 22 ( నంది పత్రిక )** రైతు కుటుంబంలో జన్మించి నంద్యాల మండలం కొత్త పల్లె టూ తెలంగాణా బెటాలియన్ డి. ఐ.జి.గా వెంకటరమణా రెడ్డి ఎదిగారు. కొత్తపల్లె ముద్దుబిడ్డకు ఉన్నత పదవి లభించడంతో రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి,గ్రామస్తులు ఆయనకు ఘనంగా సన్మానం చేశారు.గ్రామస్థాయి నుంచి డి. ఐ. జి వరకు ఆయన ప్రస్థానం అద్భుతం అని గ్రామస్తులు కొనియాడారు.తమ గ్రామానికి చెందిన జంగం వెంకటరమణా రెడ్డి డి. ఐ.జి గా ఎన్నిక కావడంతో కొత్తపల్లె గ్రామం పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది,మార్క్ ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి మాట్లాడుతూ మా ఊరి బిడ్డ అత్యుత పదవిలో ఉండడం గ్రామానికి గర్వకారణం అన్నారు.కష్టపడే తత్వమే ఆయనను ఈ స్థాయికి చేరిందన్నారు.కష్టపడితే ఏది లేదని నిరూపించారన్నారు.సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చి తెలంగాణా రాష్ట్రంలో డి. ఐ. జి స్థాయి అత్యున్నత పదవి చేపట్టి గ్రామానికి,రాయలసీమ కు గౌరవాన్ని తీసుకొచ్చారన్నారు. కొత్తపల్లె గ్రామంలో జంగం వెంకటరెడ్డి అంటే తెలియని వారు ఎవరు లేరన్నారు.ఆయన తండ్రిగారి పేరుమీద జంగం వెంకటరెడ్డి గా పిలవబడే ఆయన చిన్నప్పటి నుంచి ఎంతో కష్టపడి చదువుకున్నారన్నారు.ఆయన ఇంటి పక్కనే పెరిగిన నేను ఆయన ఉన్నత స్థానం చేరుకోవడం గర్వకారణం అన్నారు.మా గ్రామంలో ఎంతో మంది లాయర్లు,ఇంజనీర్లు,రాజకీయ పదవులు పొందుతున్నారన్నారు.నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని తమకు నచ్చిన రంగాల్లో విజయం సాధించాలన్నారు.తెలంగాణా బెటాలియన్ డి. ఐ.జి.జంగం వెంకట రమణా రెడ్డి మాట్లాడుతూ కొత్తపల్లె గ్రామంలో రైతు కుటుంబంలో 1965 లో జన్మించానని అన్నారు.గ్రామంలో అయిదవ తరగతి వరకు చదివి నంద్యాలలో ఫాతిమా హైస్కూల్ లో ఆరు నుంచి పదవతరగతి వరకు చదువుకున్నానని అన్నారు.పై చదువులు కడపలో చదువుతూ పోలీస్ సెలెక్షన్ లో అత్యుత్తమ మార్కులతో ఎంపిక అయ్యానన్నారు.1991 లో ఇన్స్పెక్టర్ స్థాయి నుంచి ప్రారంభం అయ్యి డీఎస్పీ,ఎస్పీ పనిచేసాను అన్నారు.దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి భద్రతా విభాగంలో సుమారు మూడు సంవత్సరాలు పనిచేశానని అన్నారు.అంచలంచెలుగా ఎదుగుతూ తెలంగాణ బెటాలియన్ డి. ఐ.జి.స్థాయికి చేరుకున్నారని అన్నారు.పదవులు ఎంత పై స్థాయికి వచ్చిన పుట్టిన గ్రామాన్ని,మరచిపోనని అన్నారు.తెలంగాణా కు వచ్చే ప్రతి ఒక్క సీమా బిడ్డకు చట్టబద్దంగా అవసరమైన సహాయం చేయడానికి ఎప్పుడు సిద్ధంగా ఉంటానని బరోసా ఇచ్చారు.యువత లక్షణాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగితే అనుకున్నది సాధించవచ్చున్నారు.

న్యాయవాది తులసిరెడ్డి పేద ప్రజలకు ఆయన వంతు సహాయ సహకారాలు అందిస్తున్న విషయం అందరికీ తెలుసన్నారు.రాజకీయాల్లో ఎమ్మెల్యే స్థాయి వారు ఏదో ఒకటి ఆశించి పనిచేస్తున్న సమాజంలో ప్రతిఫలం ఆశించకుండా తులసి రెడ్డి పేదలకు సహాయం చేస్తున్నారని అన్నారు.యువత చిన్నప్పుడే తమ లక్ష్యానికి పునాది వేసుకుంటే లక్ష్యం సాధించవచ్చు అన్నారు.నా చిన్న తనంలో మా నాన్న స్నేహితులు మీ అబ్బాయి తప్పని సరిగా పోలీస్ శాఖలో ఉన్నత స్థాయికి ఎదుగుతాడని చెప్పేవారని గుర్తుచేశారు.ఇష్టపడి చిన్న తనం నుంచే చదువుపై మక్కువతో విజయాలు సాధించి ఈ స్థాయికి ఎదిగానన్నారు.మా ఊరి గ్రామస్తులు అందరూ నాకు సన్మానంచేసిన అందరికీ పేరు,పేరు న కృతజ్ఞతలు తెలిపారు.ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన ఉంటే నిజ జీవితంలో ఏదైనా సాధించవచ్చని యువతకు దిశా నిర్దేశం చేశారు.ఈ సన్మాన కార్యక్రమంలో బంగారు వ్యాపారి గౌరీనాథ్,గ్రామస్తులు ఆయనకు శాలువాలు,పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.

## రీసర్వే పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్ రాజకుమారి ఆదేశాలు

**మార్చి 2027 నాటికి పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ పూర్తి లక్ష్యం**

**ఫేజ్1 నుంచి ఫేజ్5 వరకు పనుల్లో ఆలస్యం**

**గ్రౌండ్ ట్రూతెనింగ్ ఖచ్చితత్వంపై కలెక్టర్ దృష్టి**

**భూ సమస్యల పరిష్కారానికి సమగ్ర కార్యాచరణ**

**నంద్యాల బ్యూరో, ఏప్రిల్ 22(నంది పత్రిక):–** జిల్లాలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను నిర్ణీత గడువులోపు సమర్థవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సర్వే శాఖ అధికారులను ఆదేశించారు. రీసర్వేకు సంబంధించిన ఫేజ్1 నుండి ఫేజ్5 వరకు ఉన్న అన్ని దశలను వేగవంతం చేసి, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆమె ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆర్డీఓలు, తహశీల్దార్లు, విఆర్ఓలు, విలేజ్ సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సర్వే ఎడి శ్రీరామ్ మోహన్‌తో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నదని తెలిపారు. భూసంబంధిత వివాదాలు, అడ్డంకులు తక్షణమే పరిష్కరించే విధంగా అన్ని స్థాయిలలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రౌండ్ ట్రూతెనింగ్ ప్రక్రియను అత్యంత ఖచ్చితత్వంతో నిర్వహించాలని, ఫీల్డ్ స్థాయిలో వాస్తవ పరిస్థితులను సరిగ్గా నమోదు చేయడం ద్వారా రైతులకు న్యాయం జరిగేలా చూడాలని ఆమె పేర్కొన్నారు. పనుల ప్రగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, ఎక్కడైనా ఆలస్యం ఉంటే వెంటనే సరిదిద్దే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మార్చి 2027 నాటికి జిల్లాలోని ప్రతి రైతుకు పట్టాదారు పాసు పుస్తకాలు అందజేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం కట్టుబడి ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ లక్ష్య సాధనకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి, నిర్దేశిత కాలపట్టికలో పనులు పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. అనంతరం ఆత్మకూరు డివిజన్‌లోని వెలుగోడు మండలం, డోన్ డివిజన్‌లోని ప్యాపిలి మండలం, బనగానపల్లె డివిజన్‌లోని సంజామల మండలం, నంద్యాల డివిజన్‌లోని ఆళ్లగడ్డ మండలాల్లో రీసర్వే పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ప్రతి మండలంలో పనుల స్థితిగతులను విశ్లేషించి, అవసరమైన సూచనలు జారీ చేశారు. రీసర్వే ప్రక్రియలో నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.




## తెలంగాణలో ఆరుగురు ఐపీఎస్‌లకు డైరెక్టర్ జనరల్ హోదా

తెలంగాణలో ఆరుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు డైరెక్టర్ జనరల్ (డీజీ)గా పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతి పొందినవారిలో అదనపు డీజీలు మహేశ్ భగవత్, స్వాతి లక్రా, వీవీ శ్రీనివాసరావు, చారుసిన్హా, అనిల్ కుమార్, వీసీ సజ్జనార్ ఉన్నారు.మహేశ్ భాగవత్ ప్రస్తుతం లా అండ్ ఆర్డర్ అదనపు డీజీగా ఉండగా, స్వాతి లక్రా స్పెషల్ ప్రొటక్షన్ ఫోర్స్ డీజీగా ఉన్నారు. వీవీ శ్రీనివాసరావు తెలంగాణ పోలీసు నియామక మండలి చైర్మన్‌గా ఉన్నారు. సీఐడీ, మహిళా భద్రతా విభాగం, ఏసీబీ ఏడీజీగా చారు సిన్హా విధులు నిర్వహిస్తున్నారు. అనిల్ కుమార్ గ్రేహౌండ్స్ ఏడీజీగా ఉండగా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ప్రస్తుతం వీసీ సజ్జనార్ ఉన్నారు.

## గ్రామ స్థాయిలో సేవలను అందించడంలో బుక్ కీపర్ల పాత్ర కీలకం

### బుక్ కీపర్లకు 140 మొబైల్ ఫోన్ల పంపిణీ చేసిన టీడీపీ ఇంచార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి



**మంత్రాలయం , ఏప్రిల్ 22,** గ్రామ స్థాయిలో సేవల అందించడంలో బుక్ కీపర్ల పాత్ర కీలకమని మంత్రాలయం టీడీపీ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి అన్నారు. బుధవారం మంత్రాలయం మండలం పరిధిలోని మాధవరం లోని తెదేపా కార్యాలయంలో టీడీపీ యువ నాయకులు ఎన్. రాకేష్ రెడ్డి తో కలిసి నియోజకవర్గంలో ఉన్న బుక్ కీపర్లుకు 140 చరవాణిలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని బుక్ కీపర్లకు డిజిటల్ సేవలను మరింత సమర్థవంతంగా అందించాలనే లక్ష్యంతోనే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ సేవలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. గ్రామ స్థాయిలో సేవల అందజేతలో బుక్ కీపర్ల పాత్ర ఎంతో కీలకమని, ఆధునిక సాంకేతికతను అందుబాటులోకి తీసుకువచ్చి వారి పనితీరును మరింత వేగవంతం చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా ప్రతి విభాగంలో డిజిటల్ వినియోగాన్ని ప్రోత్సహించడంలో తాము ముందుంటామని పేర్కొన్నారు. ఈ చర్యతో గ్రామ స్థాయిలో పరిపాలన మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మారుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, బుక్ కీపర్లు పాల్గొన్నారు.

## పోలీసు శాఖ ప్రతిష్టను పెంచేలా విధులు నిర్వహించండి.....

### హోంగార్డ్స్ సంక్షేమానికి అధిక ప్రాధాన్యత... కమాండెంట్ వీ. మహేష్ కుమార్



**నంద్యాల క్రైం, ఏప్రిల్22(నంది పత్రిక):-** సదరన్ రీజియన్ కమాండెంట్ యం. మహేష్ కుమార్ డి ఎస్పీ , హెచ్ జి లు , కర్నూల్ ప్రసాద్ విసిటింగ్ ప్రోగ్రాం నిమిత్తం నంద్యాల జిల్లా హోంగార్డ్స్ యూనిట్ కు రావడం జరిగింది. కమాండంట్ హోంగార్డ్స్ పారడైస్ ను పరిశీంచడం జరిగింది. తరువాత దర్బార్ లో హోంగార్డ్స్ గురించి మాట్లాడుతూ హోంగార్డ్స్ ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూనే మెరుగైన సేవలు అందించాలన్నారు. పోలీసు వ్యవస్థలో హోంగార్డుల సేవలు అత్యంత కీలకమని, విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటిస్తూ శాఖ ప్రతిష్టను పెంచేలా పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హోంగార్డు కమాండెంట్ హోంగార్డుల నుండి గౌరవ వందనాన్ని స్వీకరించారు. సిబ్బంది పనితీరును తనిఖీ చేశారు. మీరు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజానికి సమర్థవంతంగా సేవ చేయగలరన్నారు. అలాగే రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని, ప్రయాణాల్లో జాగ్రత్తలు వహిస్తూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఇన్సూరెన్స్ వ్యక్తి గత ఇన్స్యూరెన్స్ లు కలిగి ఉండాలని సూచించారు. అనంతరం నిర్వహించిన 'దర్బార్'లో హోంగార్డులు తమ సమస్యలను కమాండెంట్ దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ.. సమస్యలను జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే హోంగార్డ్స్ కు సంబదించిన వెల్ఫేర్ స్కీమ్స్ గురించి తెలియచేయడశీ జరిగింది. ఈ కార్యక్రమం లో హోంగార్డు డిఎస్పీ ప్రసాద్, హోంగార్డ్స్ ఇంచార్జ్ ఆర్ ఐ, విజయ్ నరసింహులు ఆర్ ఎస్సై ఉమామహేశ్వర రెడ్డి హోంగార్డ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## వెటరన్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తా -నంద్యాల యం.పి బైరెడ్డి శబరి



**నంద్యాల ప్రతినిధి. ఏప్రిల్ 22 . (నంది పత్రిక ):**నంద్యాల జిల్లా వెటరన్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తానని నంద్యాల యం.పి,టి.డి.పి జాతీయ ప్రధాన కార్యదర్శి బైరెడ్డి శబరిసీనియర్ జర్నలిస్టులకు హామి ఇచ్చారు. బుధవారం నంద్యాల యం.పి కార్యాలయంలో నంద్యాల జిల్లా జర్నలిస్టు అసోసియేషన్ అఫ్ ఆంధ్రప్రదేష్ (జాఫ్) అధ్యక్షులు బి.డి. విజయకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వెటరన్ జర్నలిస్టులు తమ సమస్యలపై వినితి పత్రం సమర్పించడం జరిగింది.వెటరన్ జర్నలిస్టులకు అక్రిడియేషన్ కార్డులు ఇచ్చారు అయితే కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాలో ఫ్రీసర్వీసెస్ పాసు మాత్రం పెండింగ్లో పెట్టారు. నెల రోజులైన ఈ సమస్యకు పరిష్కారం కల్పించలేదు. దీంతో వెటరన్ జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఈ మేరకు జర్నలిస్టులు తమ దృష్టికి తీసుకొచ్చిన బస్ పాసులు, సీనియర్ జర్నలిస్టులకు రైల్వేలో ప్రయానించేదుకు రాయితీ కల్పించాలని, అలాగే హెల్త్ కార్డులు కూడా మంజూరు చేయాలని, ఇతర రాష్ట్రల్లో మాదిరిగా సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ ఇవ్వాలని పలుడిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించగా ఈ సమస్యలను వున్నాతాధికారులు,పార్లమెంటులో కూడా తనగళం వినిపించి రైల్వే ప్రయాణంలో జర్నలిస్టులకు రాయితీపై చర్చిస్తామని యం.పి బైరెడ్డి శబరి హామిఇచ్చారు. ఈ మేరకు సీనియర్ జర్నలిస్టులు ప్రత్యేక అబినందనలు తెలిపారు.యం.పిని కలిసిన వారిలో సీనియర్ జర్నలిస్టులుశశిశేఖర్ శర్మ, వెలుగొందారెడ్డి, చింతా సుబ్రమణ్యం, సత్యనారాయణ,గుండం గంగాధరరెడ్డి, దూదేకుల జమాల్ బాష, తదితరులు వున్నారు.

## మండల సమావేశానికి అధికారుల డుమ్మా ప్రజాప్రతినిధుల ఆగ్రహం



**వెలుగోడు, ఏప్రిల్ 22 (నంది పత్రిక):**వెలుగోడు మండల సర్వసభ్య సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరు కావడం పై ప్రజాప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లాలం రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుమారు 10 శాఖలకు చెందిన మండల అధికారులు హాజరు కాకపోవడం సభ్యుల్లో అసంతృప్తిని రేకెత్తించింది. "గత నాలుగేళ్లలో ఒక్కసారైనా పూర్తిస్థాయిలో అధికారులు హాజరైన దాఖలాలు లేవు" అంటూ సభ్యులు మండిపడ్డారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కీలకమైన సమావేశాలను అధికారులు నిర్లక్ష్యం చేయడం తగదని హెచ్చరించారు. గైర్హాజరు అయిన అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.సమావేశంలో వ్యవసాయ అధికారిణి స్వాతి మాట్లాడుతూ, సన్న వడ్ల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ, జలజీవన్ మిషన్ పనుల కారణంగా ఏర్పడిన తాత్కాలిక నీటి సమస్యలను ట్యాంకర్ల ద్వారా పరిష్కరిస్తున్నామని, రెండో విడతలో మూడు గ్రామాలకు రూ.7.63 కోట్ల నిధులు మంజూరైనట్లు చెప్పారు. వెలుగోడు సీహెచ్‌సీలో వైద్యుల కొరతపై సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసి, ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. 'వెలుగు శ్రీనిధి' రుణాల చెల్లింపులో ఒక్కరోజు ఆలస్యమైనా రూ.500 జరిమానా విధించడం పై ఎంపీటీసీలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై విచారణ జరపాలని ఎంపీడీవో మధుసూదన రెడ్డి ఆదేశించారు.ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్, ఎంపీడీవో మధుసూదన రెడ్డి, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## భూసార ఆధారిత ఎరువులు వాడండి.




**వెలుగోడు ఏప్రిల్ 22 నంది పత్రిక:** యాగంటి పల్లె కృషి విజ్ఞాన కేంద్రం జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వహణా అకాడమీ ఆధ్వర్యంలో హరిజన ఉప ప్రణాళిక లో భాగంగా వరిలో సమగ్ర పంట యాజమాన్యం పై క్షేత్ర దినోత్సవం సందర్భంగా గుంతకందాల గ్రామం లో బుధవారం కేవీకే భూ విజ్ఞాన శాస్త్రవేత్త, కె వి రమణయ్య అధ్యక్షతన నిర్వహించారు.వారు మాట్లాడుతూ, ప్రస్తుత రసాయన వ్యవసాయం వల్ల పెట్టుబడి పెరగడమే గాక నేల కర్బన శాతం తగ్గి, ఆరోగ్యం దెబ్బతినడం తో పాటు దిగుబడులు తగ్గుతున్నాయని తెలిపారు. కావున భూసారా ఆధారిత ఎరువుల యాజమాన్యం పై ప్రతి రైతు అవగాహన కలిగివుండాలని సూచించారు. క్షేత్ర దినోత్సవాన్ని గాండ్ల సుధాకర్ పొలం లో నిర్వహించి దిగుబడులపై అవగాహన కల్పించారు. ఈ విధానం లో సాగు చేసిన వరి కేవలం ఎకరాకు 6 బస్తాల ఎరువులు వాడి సగటున ఎకరాకు 35 బస్తాలు దిగుబడి రావడం తో పాటు, ఎకరాకు నాలుగు వేల రూపాయలు రషాయనిక ఎరువుల మీద ఖర్చు తగ్గినట్టు గా రైతు లు తెలియచేసారు. ఈ కార్యక్రమం లో కేవీకే శాస్త్రవేత్తలు సుధాకర్, కృష్ణమూర్తి, రవి గౌడ్ మరియు వ్యవసాయ సహాయకులు సనీల్ కుమార్, గుంతకంధాల రైతులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్టాండ్ ను ఆధునికరించండి.



**వెలుగోడు ఏప్రిల్ 22 నంది పత్రిక :** వెలుగోడు ఆర్టీసీ బస్టాండ్ నందు అనేక సమస్యలు ఉన్నాయని , వాటిని పరిష్కరించి బస్టాండును ఆధునికరించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షులు అక్బర్ సాహెబ్ డిపో మేనేజర్ ను కోరారు. వెలుగోడు ఆర్టీసీ బస్టాండ్ ను డిపో మేనేజర్ వినయ్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు బస్టాండ్ నందు మరుగుదొడ్లు , మూత్రశాల లు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని , బస్టాండ్ లో బస్సులు నిలిచే స్థలం లో గుంతలు ఏర్పడి అద్వాన్నంగా ఉందని , సిమెంట్ ప్లాటపం నిర్మించాలని కోరారు. అలాగే ప్రయాణికులు కూర్చున్న స్థలం లో షెడ్ లేక ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఇబ్బందులు పడుతున్నారని , కనీసం త్రాగడానికి నీటి సౌకర్యం కల్పించలేదని అన్నారు. శ్రీ శక్తీ పథకం వల్ల ప్రయాణించే మహిళల సంఖ్య పెరిగింది కానీ రద్దీ కి తగినన్ని బస్సులు లేవని , బస్సుల సంఖ్యను పెంచాలని కోరారు. ఈ సమస్యలపై ఆర్టీసీ డి. ఎం సానుకూలంగా స్పందించి అన్ని నెరవేర్చుటకు ప్రయత్నం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమం లో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## చంద్రబాబు నాయుడుకు నారా లోకేష్ కు సమాధానం చెప్పే దమ్ము వైసిపిలో ఎవరికి ఉంది:: కూడా చైర్మన్ టిడిపి రాష్ట్ర కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** జగన్మోహన్ రెడ్డి పాలనలో జరిగిన అవినీతి అక్రమాలను దుర్మార్గాలను ఇప్పుడిప్పుడే విధ్వంసం నుండి మంచి పరిపాలనను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెమ్మదిగా కోరుకుంటూ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తూ పట్టాలెక్కించిన ఘనత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే చెందుతుందని జీర్ణించుకోలేని వైసిపి నాయకులు చంద్రబాబు నాయుడు పైన నారా లోకేష్ పైన బురదజల్లే ఆలోచనలను విరమించుకోవాలని లేనిపక్షంలో పిచ్చాసుపత్రిలో చేర్పించాల్సి వస్తుందని సోమిశెట్టి వెంకటేశ్వర్లు హెచ్చరించారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం రాష్ట్ర ప్రజల కోసం చంద్రబాబు నాయుడు మరియు నారా లోకేష్ ఎంతో కష్టపడి పని చేస్తు కూటమి ప్రభుత్వంతో కలిసిమెలిసి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ముందుకెళుతూ ఉంటే ప్రజలలో ఆదరణ అభిమానం పొందుతున్నందుకు జీర్ణించుకోలేని జగన్మోహన్ రెడ్డి మరియు వారి అనుచరులు పొంతన లేని సమాధానాలు చెబుతూ కాలయాపన చేస్తున్నారన్నారు ఇలా లేనిపోని ఆరోపణలు చేస్తే ఇప్పుడు వచ్చిన 11 సీట్లలో వచ్చే ఎన్నికలలో కనీసం ఒక సీటు కూడా రాదని హెచ్చరించారు

## రైతు బజార్‌పై జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

### రైతులతో ముఖాముఖిడ ధరలు, వసతులపై వివరాల సేకరణ స్వయంగా కూరగాయల కొనుగోలు చేసిన కలెక్టర్ మార్కెట్‌లో అపరిశుభ్రతపై అసంతృప్తి



**నంద్యాల బ్యూరో, ఏప్రిల్ 22(నంది పత్రిక):-** జిల్లాలో రైతులకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు కల్పించడం, వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు అందుబాటులో ఉంచడం లక్ష్యంగా నిర్దేశించుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మార్కెటింగ్ ఏడి, ఎస్టేట్ అధికారులను ఆదేశించారు. బుధవారం టెక్కె మార్కెట్ యార్డ్‌లోని రైతు బజార్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మార్కెట్‌లోని వివిధ దుకాణాలను పరిశీలించి, అక్కడి శుభ్రత, నిర్వహణ తీరును సమీక్షించారు. రైతులతో నేరుగా ముఖాముఖి మాట్లాడుతూ కూరగాయల ధరలు, అమ్మకాల పరిస్థితి, వారికి అందుతున్న వసతులు, ఎదురవుతున్న ఇబ్బందులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు తెలిపిన సమస్యలను శ్రద్ధగా విని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా, వినియోగదారులతో కూడా మాట్లాడి ధరలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రజల అవసరాలు, రైతుల ప్రయోజనాలను సమన్వయం చేసే విధంగా రైతు బజార్ నిర్వహణ ఉండాలని కలెక్టర్ సూచించారు. తన పర్యటనలో భాగంగా కలెక్టర్ స్వయంగా కూరగాయలు కొనుగోలు చేసి, ధరలు మరియు నాణ్యతను పరిశీలించారు. మార్కెట్ యార్డ్‌లో కొన్ని ప్రాంతాల్లో కనిపించిన అపరిశుభ్రత, షాపుల నిర్వహణలో లోపాలపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ వారం రోజుల్లోగా మార్కెట్‌లోని అన్ని సమస్యలను పరిష్కరించి, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతు బజార్‌లో పారిశుధ్యం, తాగునీటి సదుపాయం, చెత్త నిర్వహణ, సరైన ధరల ప్రదర్శన వంటి అంశాల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులు మరియు వినియోగదారుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. జిల్లాలో రైతు బజార్‌లను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని, ప్రజలు కూడా శుభ్రత పాటించడంలో సహకరించాలని కలెక్టర్ కోరారు.

## విధి నిర్వహణలో ఉత్తమ సేవలే గుర్తింపునిస్తాయి. ఎంఈఓ చిన్న మద్దిలేటి



**జూపాడుబంగ్లా ఏప్రిల్ 22 (నంది పత్రిక )** విధి నిర్వహణలో చేసిన ఉత్తమ సేవలే ప్రజల్లో గుర్తింపునిస్తాయని పలువురు వక్తలు అన్నారు. మండల కేంద్రంలోని జంగాల పేట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా చేస్తున్న వేల్పుల మేరీ సుజాత కుమారి పదవి విరమణ సందర్భంగా పాఠశాలలో బుధవారం సన్మాన సభ నిర్వహించారు. పి ఆర్ టి యు ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సన్మానించారు. ఎంఈఓ చిన్న మద్దిలేటి మాట్లాడుతూ ఉపాధ్యాయినిగా సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ :2 శ్రీనివాసులు, హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు హుస్సేన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# మహిళల భద్రత పై ఏఎస్పి ఎం. జావళి అవగాహన కార్యక్రమం

**నంద్యాల క్రైం, ఏప్రిల్22(నంది పత్రిక):-** నంద్యాల జిల్లా వ్యాప్తంగా మహిళల భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణ మరియు సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్న నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు బుధవారం నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ ఎం జావళి ఆధ్వర్యంలో శాంతిరామ్ ఫార్మసీ కళాశాలలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న నేరాలను అరికట్టడానికి మరియు ప్రజలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడానికి పోలీస్ శాఖ కట్టుబడి ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో మహిళా భద్రత, డ్రగ్స్ మరియు సైబర్ నేరాలు మొదలగు వాటిపై ప్రజలకు అవగాహన కల్పించడం కొరకు సదరు కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో ప్రజలు కింది అంశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నాము.

1. మహిళా భద్రత & ఈవ్ టీజింగ్:

మహిళల మరియు విద్యార్థినుల భద్రత మా ప్రథమ ప్రాధాన్యత. బహిరంగ ప్రదేశాల్లో వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. మహిళా పోలీస్ స్టేషన్ వారి ఆధ్వర్యంలో శక్తి టీం బృందాలను ఏర్పాటు చేసి వేధింపులకు గురైనప్పుడు లేదా ఆపదలో ఉన్నప్పుడు వెంటనే 112 నంబర్ ద్వారా పోలీసు వారి సహాయం పొందవచ్చు. మీ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో భయం లేకుండా ఫిర్యాదు చేయవచ్చు. మీ వివరాలు గోప్యంగా ఉంచబడతాయి.

మాదకద్రవ్యాల (డ్రగ్స్ ) నియంత్రణ:

యువతను నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్ మహమ్మారిని అరికట్టడంలో ప్రజల సహకారం అవసరం.

మీ పరిసరాల్లో ఎవరైనా డ్రగ్స్ విక్రయించినా లేదా వినియోగిస్తున్నా వెంటనే 1972 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వండి. తల్లిదండ్రులు మీ పిల్లల ప్రవర్తనలో అకస్మాత్తుగా వచ్చే మార్పులను గమనించండి. ఏదైనా అనుమానం ఉంటే వెంటనే వారి స్నేహితులతో సమాచారం తీసుకుని సత్ప్రవర్తన కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలి.

3 . సైబర్ క్రైమ్ (సైబర్ క్రైమ్ ): సాంకేతికత పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. అపరిచితులకు మీ వ్యక్తిగత వివరాలు షేర్ చేయరాదు. మరియు బ్యాంకు అధికారులు ఎవరూ ఫోన్ చేసి మీ ఓటీపీ , పిన్ లేదా వ్యక్తిగత వివరాలు అడగరని గుర్తించండి. తెలియని నంబర్ల నుండి వచ్చే సందేహాస్పద లింక్‌లను క్లిక్ చేయవద్దు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయండి లేదా వెబ్‌సైట్‌లో




ఫిర్యాదు చేయండి. లేదా మీ దగ్గరలోని పోలీస్ స్టేషన్లో గాని జిల్లా సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ ని కానీ సంప్రదించి సహాయం పొందవచ్చు. నేర రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. అనుమానిత వ్యక్తులు లేదా సంఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి, బాధ్యతాయుత పౌరులుగా నిలవాలని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో ఏ ఎస్పీ తో పాటు పాణ్యం సర్కిల్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జయరాం, పాణ్యం సబ్ ఇన్స్పెక్టర్ నరేంద్ర కుమార్ రెడ్డి, మహిళ వెల్ఫేర్ బృందాలు పాల్గొన్నారు.

# బాధ్యతలు స్వీకరించిన నూతన కమిషనర్

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** నగరపాలక సంస్థ నూతన కమిషనర్ చల్లా ఓబులేసు బాధ్యతలు స్వీకరించారు. బుధవారం రాత్రి వెంకటరమణ కాలనీలోని నగరపాలక కార్యాలయంలో దస్త్రాలపై ఆయన సంతకాలు చేశారు. అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టర్లు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరి సహకారంతో నగరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం విభాగధిపతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, విభాగాధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిజం ఒక ఫైటర్

## బాలస్వామి కి సన్మాన సభలో వక్తలు



**పోరుమామిళ్ల, ఏప్రిల్ 22 (నంది పత్రిక ):**సమాజంలో జర్నలిజం అనేది అనేక ఒడిదుడుకులు,సవాళ్ళను సమస్యలు,అవినీతిఅక్రమాలపై,దోపిడీలపై నిత్యం చేసేఒకఫైటర్అని, ఏమాత్రం పొరపాటు జరిగిన దాని వెనుక జర్నలిస్టు అనేవ్యక్తి తీవ్రమై న సమస్యలుఎదుర్కొవాల్సివస్తుం దని దళిత సంక్షేమ సంఘం నేత ఉపాధ్యాయులు తిరువీధి జయ రాములు,డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధన సమితి అధ్యక్షుడు సగిలి జాకోబ్,మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా నాయ కులు ఈరిబాలజోజి,మాదిగఉద్యో గుల జిల్లా నాయకులు,జాషువా సాహిత్యవేదికవ్యవస్థాపకులు యంబడి ఈశ్వర్, దళిత నేతలు గుడిమే ఇన్నయ్య,పాపయ్య, ట్రైబల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్యూల్ జోబ్,వైస్ ప్రిన్సిపాల్ చంద్రమౌళి,సింహారా యలు,మాలమహానాడు మండల అధ్యక్షుడు జక్కుల కిరణ్,సిపిఎం వ్యవసాయ కార్మిక సంఘం ఏరి యా కార్యదర్శి వీరయ్య,బాస్ సంస్థ అధ్యక్షుడు యోహాను, లు పేర్కొన్నారు.డాక్టర్ బిఆర్ అంబే ద్కర్ జాతీయ అవార్డు అందుకు న్న సీనియర్ జర్నలిస్టు గుడిమే బాలస్వామికిమాదిగదండోరా,మాదిగఉద్యోగులసమాఖ్య,మాలమహానాడు,దళితసంఘాలు,పాత్రిక యులు,ఉపాధ్యాయులు,పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మా నించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూబాలస్వామిజర్నలిస్టుగా అనేక దినపత్రికలలో,ఎలక్ట్రా నిక్ మీడియా రంగంలోసుదీర్ఘకా లంగా30సంవత్సరాలపాటు ప్రజా సమస్యలపైఎన్ని ఒడిదుడుకులు వచ్చినప్పటికీవెనకడుగు వేయ కుండా తన కళానికి పదును పెట్టి ఎన్నోకథనాలనురాసి,అందరిలో కదలికలుతెచ్చిపరిష్కారంచూపడమేకాకుండా, ప్రజాసమస్యలపై కళంతోనిరంతరం పోరాటంచేస్తూ,మరొకప్రక్కఎరుకల,యానాదుల కుటుంబాలకు అండగానిలిచిఎన్నో సేవలు అందిస్తూ,అభాగ్యులకు నేనున్నానంటూ ఒక భరోసా ఇస్తు న్నారన్నారు.ఇలాంటి వ్యక్తిని అంద రూ గుర్తించుకోవాలని పిలుపుని చ్చారు.తన జీవిత కాలంలో ఎన్నో పదవులు,అవార్డులు అందుకోవా లని కోరారు.కలంపెట్టారంటేఅధికా రులలోఅలజడిరేగాల్సిందేనన్నారు దళిత జాతిలో పుట్టిన ఆణిము త్యం బాలస్వామి ఆయనకువెన్నం టి ఉందామని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలోపీఈటీ అనిల్, ప్రసాద్ రావు, దళితనేతలు,పాల్గొన్నారు.

# జాతీయ రహదారుల నిర్మాణ పనుల తాత్సరంపై కలెక్టర్ ఆగ్రహం



## “ప్రాణాలు పోతున్నాయిడ మీకు పట్టదా?” పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశాలు

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**బీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 22నంది పత్రిక** జిల్లాలో జరుగుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనుల్లో ఆలస్యంపై జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టరేట్‌లోని వశిష్ట సమావేశ మందిరంలో బుధవారం జాతీయ రహదారుల శాఖ, రోడ్లు & భవనాల శాఖ అధికారులు, గుత్తేదారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో కొనసాగుతున్న రహదారి నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, ముఖ్యంగా తణుకు ప్రాంతంలోని సర్వీస్ రోడ్, ఫ్లైఓవర్ నిర్మాణాల్లో జాప్యం జరుగుతుండటంపై సంబంధిత అధికారులను గట్టిగా నిలదీశారు. “రోడ్ల పనులు ఆలస్యమవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి, ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారుడ మీకు పట్టదా?” అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు మందగిస్తున్న ప్రాజెక్టులకు కొత్త గుత్తేదారులను నియమించి వేగవంతం చేయాలి తణుకు సర్వీస్ రోడ్లు, ఫ్లైఓవర్ పనులను అత్యవసరంగా పూర్తి చేయాలన్నారు. ఉండి ఆర్‌ఓబి నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలన్నారు. భారీ వాహనాల రాకపోకల దృష్ట్యా రోడ్ల నాణ్యతను మెరుగుపరచాలన్నారు. జిల్లాలో వ్యాపార కార్యకలాపాల కోసం భారీ వాహనాలు రోజూ రాకపోకలు సాగిస్తున్నాయని, దీంతో రోడ్లపై ఒత్తిడి పెరుగుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆర్‌ఓబి పనులు ఆలస్యం కాకుండా తక్షణమే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. చించినాడ బ్రిడ్జి మరమ్మత్తు పనుల పురోగతిపై కలెక్టర్ ఆరా తీశారు. మే నెలాఖరు నాటికి పనులు పూర్తి చేస్తామని గుత్తేదారు హామీ ఇవ్వగా, ప్రజలు మరియు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మంజూరైన ఆర్ అండ్ బి రహదారుల పనులను కూడా వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఆర్ & బి అధికారి శ్రీనివాసరావు, రాజమండ్రి ఎన్‌హెచ్ పీడీ బి.కృష్ణమూర్తి, ఎన్‌హెచ్-165, ఎన్‌హెచ్-216, ఎన్‌హెచ్-216ఏ అధికారులతో పాటు గుత్తేదారులు, తదితరులు పాల్గొన్నారు..



# పకృతి సాగు పద్ధతి పై విదేశీ విద్యార్థి అధ్యయనం



**చాగలమర్రి ఏప్రిల్22 నంది పత్రిక** రాష్ట్రంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాలపై అధ్యయనం చేసేందుకు ఆక్స్ ఫోర్డ్ యూనివర్సిటీ యూకే విద్యార్థి మోలీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం చాగలమర్రి మండలంలో పర్యటించారు. తక్కువ ఖర్చు ఎక్కువ దిగుబడి, సేంద్రీయ ఎరువులు, విత్తన శుద్ధి , ఘన జీవామృతం, పురుగు నివారణకు కషాయాలు, ద్రావణాలు ఉపయోగించి ఆరోగ్యకరమైన పంటలను పండించే విధానం పై మధ్యాహ్నం చేశారు. విద్యార్థి వెంట పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# వ్యాపార అభివృద్ధికి బ్రాండింగ్, ప్యాకింగ్ అత్యంత కీలకం



### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**బీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 22నంది పత్రిక** వ్యాపార అభివృద్ధికి ఉత్పత్తుల నాణ్యతతో పాటు బ్రాండింగ్, ప్యాకింగ్ కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. సరైన ప్యాకింగ్, ఆకర్షణీయమైన బ్రాండింగ్ ద్వారా ఉత్పత్తి విలువ పెరిగి, మార్కెటింగ్ సులభమవుతుందని అన్నారు. జిల్లా కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ మరియు డిఆర్డిఏ ఆధ్వర్యంలో నిర్వహించిన “ఆహార ఉత్పత్తుల ప్యాకింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్ అవగాహన శిక్షణ” కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన వివిధ ఉత్పత్తులను కలెక్టర్ పరిశీలించి, వాటి తయారీ విధానం, మార్కెటింగ్ అవకాశాలపై వివరాలు తెలుసుకున్నారు. మహిళలు విభిన్న రకాల ఉత్పత్తులు తయారు చేస్తున్నారని అభినందిస్తూ, శిక్షణలో నిపుణులు అందించే సూచనలను అమలు చేసి ఉత్పత్తుల నాణ్యతను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఉత్పత్తులను తయారు చేయడం, మార్కెటింగ్ చేయడం కొంత కష్టమైన ప్రక్రియ అయినప్పటికీ, సరైన మార్గదర్శకాలు, చిన్న చిన్న వ్యాపార మెళుకువల ద్వారా మంచి అభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. ఉత్పత్తి తయారీ ఎంత ముఖ్యమో, ప్యాకింగ్ మరియు బ్రాండింగ్ కూడా అంతే ముఖ్యమని, ఇవే మార్కెటింగ్‌కు మార్గం సుగమం చేస్తాయని స్పష్టం చేశారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో ఇండస్ట్రియల్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక సంఘాల మహిళలు ఈ కేంద్రాన్ని ఉపయోగించుకుని సబ్సిడీలు, వ్యాపార అవకాశాలు, ప్రభుత్వ పథకాలపై అవసరమైన సమాచారాన్ని పరిశ్రమల శాఖ అధికారుల నుండి పొందవచ్చని సూచించారు. అదేవిధంగా ఆహార భద్రత, నాణ్యత ప్రమాణాలు, లైసెన్సింగ్ ప్రక్రియలపై అవగాహన కల్పించేందుకు ప్రతి సోమవారం ఫుడ్ ఇన్స్పెక్టర్, ఉద్యానవన శాఖ సిబ్బంది కూడా హాజరై ఎంఎస్ఎంఈలకు మార్గదర్శకాలు అందించాలని ఆదేశించారు. ఆహార ఉత్పత్తులు తయారు చేసే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా సంబంధిత లైసెన్సులు పొందాలని, ఇందుకు అవసరమైన వివరాలు ఫుడ్ ఇన్స్పెక్టర్ ద్వారా తెలుసుకోవాలని సూచించారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు భవిష్యత్తులో మరిన్ని వర్క్‌షాప్‌లు నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రతి రంగం నుండి కొంతమంది ఉత్పత్తులను ఎంపిక చేసి, వాటిని మార్కెట్‌లో నిలదొక్కుకునేలా బ్రాండింగ్ చేయాలని డిఆర్డిఏ, కృషి విజ్ఞాన కేంద్రం అధికారులకు సూచించారు.కార్యక్రమం ముగింపులో డిఆర్డిఏ విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లకు ( వివో ఏఎస్ ) 20 మండలాల్లో మొత్తం 885 సెల్‌ఫోన్లను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా భీమవరం, వీరవాసరం మండలాలకు చెందిన 94 మంది వివోఏలకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సెల్‌ఫోన్లు అందజేశారు.చేపలు ఎక్కువసేపు తాజాగా ఉండేందుకు ప్రత్యేక కూలింగ్ ప్యాడ్ కలిగిన బాక్స్ కంటైనర్ వినియోగంపై కలెక్టర్ ఆసక్తి వ్యక్తం చేసి వివరాలు తెలుసుకున్నారు. ఈ సాంకేతికతను పేద మత్స్యకారులకు సబ్సిడీపై అందించేందుకు అవకాశాలు పరిశీలించాలని మత్స్యశాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పీడీ ఎస్.ఎస్. వేణుగోపాల్, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ డా.డి.శ్రీనివాస్, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ రీజినల్ డైరెక్టర్ సాయి శ్రీనివాస్, కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ఎన్. మల్లికార్జునరావు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కె.వెంకటరత్నం, ఫుడ్ ఇన్స్పెక్టర్ సుందరరామిరెడ్డి, డిపిఎం ఎస్.కుసుమకుమారి, ఏపీఎం రవికుమార్, డిఆర్డిఏ హెచ్‌ఆర్ టి.మురళీకృష్ణ, గేమ్ ఫౌండేషన్ నిర్వాహకులు కె.సుభాష్, స్వయం సహాయక సంఘాల మహిళలు, విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.



# టిడిపి కార్యకర్త మృతి.. పలువురు సంతాపం..

**చాగలమర్రి ఏప్రిల్ 22 నంది పత్రిక** మండల కేంద్రమైన చాలుమర్రిలోని తెలుగుదేశం పార్టీ కార్యకర్త దేవరకొండ నడిపి వెంకటేశ్వర్లు (65) అనారోగ్య కారణంగా బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నంద్యాల పార్లమెంటు బీసీ సెల్ స్పోక్ పర్సన్ చల్ల నాగరాజు యాదవ్ తదితరులు మృతిచెందిన నరసింహుని మృతదేహానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. ఈయన వెంట ఓబులేసు, పీరయ్య, నరసింహుడు, చిన్న నరసింహులు తదితరులు ఉన్నారు.



# బీజేపీలోకి వెళ్తారని ప్రచారం.. స్పందించిన జీవన్ రెడ్డి

బీఆర్ఎస్ సీనియర్ నేత, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి బీజేపీలోకి చేరతారని కొన్నిరోజులుగా ప్రచారం సాగుతోంది. ఈ ప్రచారంపై జీవన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. తాను బీజేపీలో చేరుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో జోరుగా ప్రచారం సాగుతోందని, ఇందులో ఏమాత్రం వాస్తవం లేదని అన్నారు. తన రాజకీయ ఎదుగుదలను ఓర్చుకోలేక బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి తనపై కుట్ర చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా తనను దెబ్బతీసేందుకు ఇలాంటి ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు కేసీఆర్ వెంటే ఉంటానని అన్నారు. ఆయన నాయకత్వంలో పని చేయడం తనకు గర్వకారణమని అన్నారు. తాను బీజేపీలో చేరే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. కార్యకర్తలు, అభిమానులు ఇలాంటి అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు. తాను ఎప్పటికీ బీఆర్ఎస్ పార్టీలోనే సైనికుడిగా కొనసాగుతానని స్పష్టం చేశారు.



# పారదర్శకం, అంకిత భావం, సేవాధ్రుక్పదంతో వ్యవస్థను బలోపేతం చేయవలసిన భాధ్యత అధికారులదే

**ప్రభుత్వ పథకాలను అమలు చేయుటకు అధికారులకు నాయకత్వపు లక్షణాలు కలిగి ఉండాలి జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి.**

**బీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 22నంది పత్రిక** భీమవరం జిల్లా పంచాయతీ అధికారిగా పనిచేస్తూ జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారిగా పదోన్నతి పొందిన నూకల రామనాథ్ రెడ్డికి బుధవారం వీరవాసరంలోని ప్రైవేట్ కన్వెన్షన్ హాలులో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని ప్రజలకు అందించడంలో ఎంపీడీవోలు, వీఆర్వోల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ మరింత విస్తృతంగా, సమర్థవంతంగా పనిచేయాలంటే అధికారులకు బాధ్యతాయుతమైన నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగి ఏ స్థాయి అధికారంలో ఉన్నప్పటికీ వృత్తిపట్ల నిబద్ధతతో, పరిపాలనదృతతో వ్యవహరించి లక్షసాధనలో ముందుకు సాగాలని అన్నారు. అధికారులకు అప్పగించిన విధులు సక్రమంగా, ప్రణాళిక బద్ధంగా నిర్వహిస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయని అన్నారు. ప్రతి మండలంలో, గ్రామంలో ఉన్న పాఠశాలలను ఎంపీడీవోలు, విఆర్వోలు తనిఖీ చేసి అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం, విద్యార్థుల విద్యాభ్యాసం తదితర అంశాలను పరిశీలిస్తే విద్యా ప్రమాణాలు మరింత మెరుగవుతాయని అన్నారు. ముఖ్య కార్య నిర్వహణాధికారిగా పదోన్నతి పొంది బదిలీపై వెళుతున్న నూకల రామనాథ్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. వీరు జిల్లా పంచాయతీ అధికారిగా వృత్తి ధర్మం, సామాజిక ధర్మం పాటిస్తూ సమర్థవంతమైన సేవలు అందించి, వ్యవస్థను బలోపేతం చేయడంలో తమదైన శైలిని ప్రదర్శించి, అధికారులకు రోల్ మోడల్ గా నిలిచారని అన్నారు. ప్రతి ఉద్యోగి తాము పనిచేస్తున్న వ్యవస్థను బలోపేతం చేసుకోవాల్సిన బాధ్యత ఉందని అన్నారు.



అనంతరం పూలమాలవేసి దుశ్యాలువాతో ఘనంగా సత్కరించారు. అభినందన సభలో సిఇఒ జగదాంబ, ఎంపిడిఓ, డిప్యూటీ ఎంపిడిఓల అసోసియేషన్ తరపున జిల్లాలోని ఎంపిడిఓలు, డిప్యూటీ ఎంపిడిఓలు , డ్వామా పిడి డాక్టర్ సిహెచ్ అప్పారావు, ఇంచార్జి డిపిఒ దోసిరెడ్డి, పంచాయతీ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు..

## ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ భార్గవ రామ దంపతులకు మర్యాదపూర్వకంగా కలిసిన ఏపీపీ



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఏప్రిల్ 22 నంది పత్రిక** ఆళ్లగడ్డ కోర్టుకు నూతన ఏ పి పి గా నియమితులైన న్యాయవాది ఉప్పలపాటి ప్రతాప్ బుధవారం నాడు పట్టణంలోని ఎమ్మెల్యే నివాస కార్యాలయంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ భార్గవ్ రామ్ దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపే సన్మానించారు. ఈ సందర్భంగా ఏపీపీగా నియమితులైన న్యాయవాది ప్రతాప్ ను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## కొండపల్లిలో పర్యాటక రంగ అభివృద్ధికి కృషి,

### - మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు



**ఎన్టీఆర్ జిల్లా, కొండపల్లి,బ్యూరో చీఫ్ ఏప్రిల్ 22నంది పత్రిక** కొండపల్లిలో పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు వెల్లడించారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో పర్యాటకశాఖ, పురావస్తు శాఖ అధికారులతో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు బుధవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కొండపల్లి ఖిల్లా అభివృద్ధికి, కిలా పైకి పర్యాటకులను ఆకర్షించేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి సమగ్రంగా చర్చించారు. ప్రస్తుతం ఖిల్లా పైకి మెట్ల నడక మార్గం, పశ్చిమ ఇబ్రహీంపట్నం వైపు నుంచి రోడ్డు మార్గాలు ఉన్నాయి. కొండపల్లి ఖిల్లా పైకి రోప్ వే మార్గాన్ని కూడా నిర్మించాలన్నారు. అలాగే ఖిల్లాపై లేజర్ షోతో పునః ప్రారంభించాలన్నారు. పర్యాటక శాఖ టూరిజం కార్పొరేషన్ (ఏపీటీడీసీ) ద్వారా ఖిల్లాకు రవాణా సౌకర్యాలు కల్పించాలని అన్నారు. కొండపల్లి బొమ్మలు, కృష్ణ గోదావరి నదిలో నదుల అనుసంధానం పవిత్ర సంగమం, కొండపల్లి కోట వైభవం, వీటన్నింటి గురించి వివరిస్తూ ప్రత్యేక టూరిజం ప్యాకేజీలను విస్తృతంగా ప్రచారం చేసి పర్యాటకులను ఆకర్షించాలన్నారు. పర్యాటక రంగ అభివృద్ధితో ఈ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. కొండపల్లి కూడా ఇప్పటికే అమరావతిలో భాగమైనందున రాజధానికి వచ్చే విదేశీ పర్యాటకులు కూడా కొండపల్లి కోట, ఖిల్లా, బొమ్మలతో పాటు మన ప్రాంతాన్ని సందర్శిస్తారన్నారు. అంతేకాకుండా సాహస యాత్రకు, పర్వతాల అధిరోహణకు, ట్రెక్కింగ్, ర్యాప్లింగ్ కూడా కొండపల్లి ఖిల్లా అనువుగా ఉన్నందున యువత ఈ ప్రాంతాన్ని ఎంచుకుంటారని అన్నారు. కొండపల్లిని పర్యాటకం పరంగా సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలు అన్నీ సద్వినియోగం పరుచుకుంటామన్నారు. ఈ విషయంపై తగు ప్రతిపాదనలు రూపొందించి మంత్రి దుర్గేష్ తో పాటు, రేపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గారు వెల్లడించారు.



## రోటరీ క్లబ్ సేవలు బేస్ డి.ఎస్.పి ఏ శ్రీనివాసులు రోటరీ క్లబ్ కు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తా

### డీఎస్పీఏ శ్రీనివాసులు




**ఆళ్లగడ్డ ప్రతినిధిఏప్రిల్ 22 నంది పత్రిక** రోటరీ క్లబ్ సేవలు అమోఘమని ఆళ్లగడ్డ డిఎస్పీఏ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని చింతకుంట సమీపంలో ఉన్న బాలసదన్ శరణాలయం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచమంతటా అన్ని దేశాలలో సమాజ సేవలో రోటరీ క్లబ్ ముందు ఉందని అలాగే ఆళ్లగడ్డ రోటరీ క్లబ్ కూడా సమాజ సేవా రంగంలో ఆయన అన్నారు. రోటరీ క్లబ్ లాంటి సేవా సంస్థలు ఇలాంటి కార్యక్రమాలు చేయడం మంచి పరిణామం అని అనాథ పిల్లలకు ఆదుకోవడం మన ధర్మం అన్నారు. మానవసేవయే మాధవసేవ అని క్లబ్బు అధ్యక్షులు మిగతా సభ్యులందరూ ఇలాంటి కార్యక్రమాలు చేయడం సంతోషమన్నారు. తాను బాపట్ల,నెల్లూరు డీఎస్పీగా పనిచేసే రోజుల్లో అక్కడున్న రోటరీ క్లబ్ మంచి సత్సంబంధాలు ఉన్నాయని ప్రతి సంవత్సరం అక్టోబర్ 21 పోలీసు సంస్కరణ దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ వారి సహకారంతో రక్తదాన కార్యక్రమాలు చేశామన్నారు,పుట్టినరోజు సందర్భంగా ఎన్నో మంచి కార్యక్రమాలు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చేశామన్నారు. సమాజంలో సేవ చేయాలని దేవుడు సంకల్పించారు కాబట్టి అవకాశాన్ని రోటరీక్లబ్ సభ్యులకి ఇవ్వడం ఆనందదాయకమన్నారు . రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు ఆళ్లగడ్డ రోటరీ క్లబ్ చేయాలని కోరుతూ సభ్యులందరినీ అభినందిస్తూ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామనిఆయన తెలిపారు. పట్టణ సీఐ నాగరాజరావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఇలాంటి మంచి కార్యక్రమాలు చేస్తున్నారని రోటిరీ క్లబ్ సభ్యులందరూ తమ సొంత నిధులతో సేవలు చేయడం గొప్ప పరిణామం అన్నారు. ఆళ్లగడ్డ క్లబ్బు సభ్యులందరినీ ఆయన అభినందించారు. పట్టణ ఎస్ఐ పీరయ్య రోటరీ క్లబ్బు విశిష్టతను గురించి ప్రసంగించారు. రోటరీ క్లబ్బు అధ్యక్షులు పోలేపల్లె సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బైసాని రవి ప్రకాష్ రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు ప్రముఖ పారిశ్రామికవేత్త టీఎంసీ వేణుగోపాల్ రోటరీ క్లబ్బు చేసిన కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం 40 మంది బాలికలకు 80 జతల వేసవి దుస్తులను అతిథులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డిఎస్పి ఏ శ్రీనివాసులు క్లబ్బు సభ్యులందరూ శాలువాలతో పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో శబరిష్ సత్యం అధ్యాపకులు మల్లేశ్వర్ రెడ్డి బాలిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు రామచంద్రారెడ్డి రత్నరాజు చంద్ర సేన ఇన్నర్ విల్ అధ్యక్షులు కవిత సెక్రటరీ ఉమామహేశ్వరి గీతా సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.





## తణుకు రైతు బజార్ సందర్శించిన జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి



**తణుకుబ్యూరో చీఫ్ ఏప్రిల్ 22,నంది పత్రిక** జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి బుధవారం తణుకు పట్టణంలోని రైతు బజార్, మండపాక గ్రామంలోని రైతు సేవా కేంద్రం, తేతలి గ్రామంలోని సిఎన్జి మదర్ స్టేషన్‌లను సందర్శించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ముందుగా తేతలి గ్రామంలోని సిఎన్జి మదర్ స్టేషన్‌ను సందర్శించిన జాయింట్ కలెక్టర్, అక్కడి కార్యకలాపాలు, భద్రతా ప్రమాణాలు, నిర్వహణపై సంబంధిత సిబ్బందితో చర్చించి వివరాలు తెలుసుకున్నారు. సౌకర్యాలను సమర్థవంతంగా వినియోగించి సేవలను మరింత మెరుగుపరచాలని సూచించారు. తదనంతరం తణుకు రైతు బజార్‌ను సందర్శించిన జాయింట్ కలెక్టర్, రైతు బజార్ నిర్వహణ, ధరల స్థితి, వినియోగదారులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మరియు వినియోగదారులతో మాట్లాడి కూరగాయలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల ధరలు, సరఫరా పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతు బజార్‌లో శుభ్రత, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, తూకాల సక్రమ వినియోగం వంటి అంశాలపై అధికారులతో చర్చించి అవసరమైన మెరుగుదల చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతు బజార్‌కు వినియోగదారుల రాక తగ్గిందని రైతులు తెలియజేయగా, వినియోగదారులను ఆకర్షించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండపాక గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించిన జాయింట్ కలెక్టర్, ధాన్యం సేకరణ ప్రక్రియ, నిల్వ సౌకర్యాలు, రైతులకు అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. రైతు సేవా కేంద్రంలో గోనె సంచులు సరిపడా లేవని రైతులు తెలియజేయగా, తక్షణమే అదనపు గోనె సంచులు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతుల సౌకర్యాలను మెరుగుపరచడం, వ్యవసాయ ఉత్పత్తుల సరైన ధరలు అందేలా చర్యలు తీసుకోవడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. రైతు బజార్‌లు, రైతు సేవా కేంద్రాలు రైతులకు మరియు వినియోగదారులకు మధ్య సమన్వయ వేదికలుగా మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ డి.వి.ఎస్.అశోక్ వర్మ, డి.ఎస్.ఓ ఎన్.సరోజ, మండల వ్యవసాయ శాఖ అధికారి రాజేంద్ర ప్రసాద్, సిఎన్జి సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరం

### ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

## టైక్వాండో నేర్చుకునే ఆడపిల్లలకు మేము అండగా ఉంటాం

### ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ ప్రతినిధి, ఏప్రిల్ 22 నంది పత్రిక** విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ అన్నారు. ఆళ్లగడ్డపట్టణ శివారులోని కందుకూరు రోడ్డులో ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థుల ఆత్మరక్షణ నైపుణ్యాల పెంపుకు తైక్వాండో ప్రదర్శన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, డీఎస్పీ శ్రీనివాసరావు, పట్టణ సీఐ నాగరాజరావు, ఎస్ఐ చిన్న పిరయ్య, ఎంఈఓ శోభా వివేకవతి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు తైక్వాండోలో తమ ప్రతిభను చాటుతూ వివిధ విన్యాసాలు ప్రదర్శించారు. వేగం, సమన్వయం, ధైర్యంతో చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఆత్మరక్షణ పద్ధతులను ప్రాక్టికల్‌గా చూపించడం అందరినీ మెప్పించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు ఆత్మరక్షణ నైపుణ్యాలు కూడా అలవర్చుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. టైక్వాండో అనేది ఆడపిల్లల సంరక్షణ కోసం అని, ఏదో ఇప్పుడు నేర్చుకున్నాం కదా అని వదిలేయకుండా మంచి ఉన్నత స్థానాలకు వెళ్లాలన్నారు. ఆడపిల్లలంటే అన్ని రంగాల్లో ముందు ఉంటారని సమాజానికి తెలియజేయాలన్నారు. రాబోయే రోజుల్లో ఆళ్లగడ్డ కచ్చితంగా సాధిస్తుందని టైక్వాండో నేర్చుకునే ఆడపిల్లలకు మేము అండగా ఉంటామన్నారు.





## ఇటలీలో సాయం అందలేదన్న యువకుడు.. స్పందించిన భారత ఎంబసీ

తనకు భారత ఎంబసీ సాయం చేయలేదని ఒక పౌరుడు చేసిన ఆరోపణలను ఇటలీలోని భారత రాయబార కార్యాలయం ఖండించింది. సోషల్ మీడియా ఖాతా ప్రకారం, జతిన్ సరోహా అనే వ్యక్తి ఇటీవల రోమ్‌లోని భారత ఎంబసీని సంప్రదించాడు. పర్యావరణంపై అవగాహన కల్పించడంలో భాగంగా తాను మాల్టా నుంచి భారత్‌కు పాదయాత్రగా వెళుతున్నానని పేర్కొన్నాడు. తాను భారతీయుడినని, ఇప్పటికే 1500 కిలోమీటర్లు నడిచానని తెలిపాడు. అయితే తాను ఇటలీలోని రాయబార కార్యాలయం అధికారులను సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ తనను లోనికి అనుమతించడం లేదని ఆరోపించాడు. ఈ మేరకు అతను ఈ వీడియోను సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశాడు.

## దొంగరావిపాలెంలో రైతు బజార్ ఏర్పాటుకు స్థలం పరిశీలన

### జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి



**బీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 22నంది పత్రిక** జిల్లాలో రైతులకు ప్రత్యక్ష మార్కెట్ సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా, దొంగరావిపాలెం గ్రామంలో రైతు బజార్ ఏర్పాటు కోసం అనువైన స్థలాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి బుధవారం పరిశీలించారు. గ్రామ పర్యటన సందర్భంగా సుమారు 21 సెంట్ల ప్రభుత్వ భూమి రైతు బజార్ స్థాపనకు అనుకూలంగా ఉన్నట్లు గుర్తించి, తదుపరి చర్యలు చేపట్టాలని రెవెన్యూ శాఖ మరియు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రైతులకు తమ వ్యవసాయ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించే అవకాశం కల్పించడమే రైతు బజార్ లక్ష్యమని ఆయన తెలిపారు. అనంతరం హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌ను సందర్శించిన జాయింట్ కలెక్టర్, మార్కెట్లో అమలవుతున్న ధరల పట్టిక, తూకాల సక్రమ వినియోగం, కూరగాయల నాణ్యత వంటి అంశాలను పరిశీలించారు. వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు సరైన ధరలకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. తదుపరి సిద్ధాంతం రెవెన్యూ గ్రామ సచివాలయాన్ని సందర్శించి, రాబోయే మే నెలలో రైతులకు పంపిణీ చేయాల్సిన పట్టాదారు పాస్ పుస్తకాల కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. వీఆర్వోలు, సర్వేయర్లకు పంపిణీ విధానాలపై సవివరంగా మార్గదర్శకాలు అందించారు. పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ ప్రక్రియ పారదర్శకంగా, సమయపాలనతో నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో ఎటువంటి అలసత్వం లేకుండా రైతులకు సకాలంలో పాస్ పుస్తకాలు అందేలా చూడాలని ఆదేశించారు. రైతుల ఆదాయాన్ని పెంచడం, వారికి మార్కెట్ సౌకర్యాలు కల్పించడం, భూసంబంధిత సేవలను సమర్థవంతంగా అందించడం ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు.

## కేసముద్రం 11వ వార్డులో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన కౌన్సిలర్ ఆగే రాము



**కేసముద్రం, ఏప్రిల్ 22(నంది పత్రిక):**కేసముద్రం మున్సిపల్ ఎన్నికల హామీల్లో భాగంగా కేసముద్రం మున్సిపాలిటీ 11వ వార్డు కౌన్సిలర్ ఆగే రాము ఇచ్చిన మాటకు కట్టుబడి రూ.1 లక్ష 2 వేల విలువైన 12 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ నేపథ్యంలో కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలోని 11 వార్డు పరిధిలోని ఆదర్శ నగర్ ప్రాంతంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ క్రింద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సీఐ సత్యనారాయణ ఆదేశాల మేరకు బుధవారం ఎస్సై క్రాంతి కిరణ్ తన బృందంతో పరిశీలించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని పేర్కొన్నారు. సీసీ కెమెరాల నిఘాతో నేర నియంత్రణకు చెక్ పెట్టొచని, సీసీ కెమెరాలు ఉన్న ప్రాంతంలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు సాగించాలన్న బయపడాలన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ప్రజలకు, ఇటు పోలీసులకు తన వంతు సహకారం అందించిన 11 వార్డు కౌన్సిలర్ ఆగే రామన్నను పోలీసుల తరుపున అభిందించారు. కౌన్సిలర్ రామన్నను ఆదర్శంగా తీసుకోని మిగితా వార్డు కౌన్సిలర్లు తమ వంతుగా వారి వారి వార్డుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నేర నియంత్రణకు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ ఎంపీటీసీ ఆగే మంజుల వెంకన్న, మాజీ వార్డ్ మెంబర్ బిర్రు వెంకన్న, రొడ్డ రాజు , బోడ రవి, ఆగే దేవేందర్, ఆగే శ్రీను, ధరావత్ భీమ తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహాల పనితీరును మెరుగుపరచడం, విద్యా ప్రమాణాలను పెంచడంలో అధికారులు శ్రద్ధ వహించాలి.

### స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో.



**కేసముద్రం, ఏప్రిల్ 22(నంది పత్రిక):**99 రోజుల ప్రజాపాలన ప్రణాళికలో భాగంగా మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో బుధవారం కేసముద్రం మండలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండలం లోని గిరిజన సంక్షేమ బాలికల కళాశాల, కేజీబీవీ కళాశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజన నాణ్యత, విద్యా బోధనను పరిశీలించారు. పాఠశాల నిర్వహణ, రికార్డులు, హాజరును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ హాస్టళ్లలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సౌకర్యాలు నిరంతరం అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని, వంటశాలలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పెండింగ్‌లో ఉన్న చిన్నపాటి మరమ్మతు పనులను తక్షణమే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ వసతి గృహాల పనితీరును మెరుగుపరచడంలో, విద్యా ప్రమాణాలను పెంచడం అధికారుల యొక్క కర్తవ్యమన్నారు. అదనపు కలెక్టర్ వెంట స్థానిక మండల అధికారులు పాల్గొన్నారు.

## కమ్యూనిజంతోనే దేశంలో ప్రజా విముక్తి జరుగుతుంది.

### సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు అన్నారపు హనుమంతు.



**కేసముద్రం, ఏప్రిల్ 22(నంది పత్రిక):**కమ్యూనిజం తోనే దేశంలో ప్రజా విముక్తి జరుగుతుందని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు అన్నారపు హనుమంతు అన్నారు. బుధవారం మండలంలోని గ్రామ గ్రామాన ఘనంగా సిపిఎంఎల్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించగా, కేసముద్రం పట్టణ కేంద్రంలో బట్టమేకల రాజు అధ్యక్షతన సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు అన్నారపు హనుమంతు జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం పి.చంద్రమౌళి అధ్యక్షతన బొమ్మగాని వెంకన్న మాట్లాడుతూ మార్క్సిస్టు మహోపాధ్యాయుడు జయంతి సందర్భంగా ఆవిర్భవించిన సిపిఐ ఎంఎల్ పార్టీని 57 సంవత్సరాలుగా ప్రజల కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న విప్లవ పార్టీ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ అన్నారు. అన్నారపు హనుమంతు మాట్లాడుతూ అనేక పోరాటాలు నిర్వహించి సాధించుకున్న తెలంగాణలో 9 సంవత్సరాలు పరిపాలించిన కేసీఆర్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని, ప్రజలు కెసిఆర్ ను గద్దె దింపి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపిస్తే అనేక హామీలు ఇచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజల్ని ప్రలోభాలు పెట్టి గద్దెనెక్కిన తర్వాత ప్రజలకు మొండి చేయి చూపించిన పరిస్థితి ఉందని, ఇప్పటికైనా ప్రజలు చైతన్యంతో కమ్యూనిస్టు పార్టీ ప్రజా పోరాటాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో బట్టమేకల రాజు, పిన్నోజు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానమే దేశ విముక్తి సిద్ధాంతం.

### సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మండల వెంకన్న

**మహబూబాబాద్, ఏప్రిల్ 22(నంది పత్రిక):**మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కామ్రేడ్ లెనిన్ జయంతిని పురస్కరించుకొని సిపిఐ(ఎంఎల్) ఆవిర్భావ దినోత్సవాన్ని మహబూబాబాద్ పట్టణం లోని సామ పూలక్క నగర్, విక్రమ్ నగర్ కాలనీ, మాధవన్న నగర్, భట్టు అంజయ్య నగర్, కనకయ్య నగర్, ప్రగతి నగర్, పైలా వాసుదేవరావు నగర్ కాలనీల తో పాటు గుమ్ముడూరు లోని బట్టు అంజయ్య స్మారక భవనంపై సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జెండాను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ మండల వెంకన్న మాట్లాడుతూ భూమి, భుక్తి, ఈ దేశ విముక్తి కోసం 1969 లో రివిజనిస్టు నయా రివిజనిస్టులతో తెగదెంపులు చేసుకొని సిపిఐ(ఎంఎల్) ఆవిర్భవించిందన్నారు. ఆవిర్భవించిన నాటి నుండి నేటి వరకు సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో అనేక ప్రజా పోరాటాలు నిర్వహించామన్నారు. లక్షలాది ఎకరాల భూములను పేద ప్రజలకు, గిరిజనులకు పంచిపెట్టామన్నారు. అనేక గ్రామాలు నిర్మించామన్నారు. ప్రజలకు నిత్యం ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్మించామన్నారు. ప్రస్తుతం భారతదేశంలో మతోన్మాద ఫాసిస్టు భావజాలంతో బిజెపి ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీ పని చేస్తున్నారన్నారు. రాజ్యాంగాన్ని మార్చివేసి మనువాద సిద్ధాంతాన్ని ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మాట్లాడే వాళ్ళపై నిర్బంధం ప్రయోగించి అణచి వేస్తున్నారన్నారు. దళితులు, ఆదివాసీలు, గిరిజనులు, మైనారిటీల పైన రోజురోజుకు దాడులు కొనసాగిస్తున్నారు. దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు, ధనిక వర్గాలకు, ప్రైవేటు శక్తులకు దోచిపెట్టే నిర్ణయాలు చేస్తున్నారన్నారు. దేశాన్ని తాకట్టు పెట్టి దేశ సంపదను లూటీ చేస్తున్నారన్నారు. మరోపక్క సామ్రాజ్యవాదం బుసలు కొడుతూ ప్రపంచ యుద్ధాలను ప్రేరేపిస్తున్నారన్నారు. మరోపక్క రాష్ట్రంలో దొంగలు పడి ప్రజల సంపదను యావత్ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారన్నారు. ఎన్నికల నాడు అనేక ఉచిత వాగ్దానాలు, హామీలు ఇచ్చి అవి నెరవేర్చలేని స్థితిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధికార యంత్రాంగం ఉందన్నారు. ప్రభుత్వ భూములను కబ్జాలు చేయడమే పనిగా పెట్టుకుని దోపిడీని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. దేశంలో, రాష్ట్రంలో దళారీ ప్రభుత్వాలు కొనసాగుతున్నాయన్నారు. ఈ దళారీ ప్రభుత్వాలను కూల్చివేయడానికి విప్లవకారులంతా ఐక్యం కావాలన్నారు. దేశంలో వర్గాలు లేని సమ సమాజాన్ని స్థాపించాలంటే నూతన ప్రజాస్వామిక విప్లవమే మార్గమన్నారు.



దేశంలో ప్రజలందరూ స్వేచ్ఛా, సమానత్వంతో జీవించాలంటే మార్క్సిజం-లెనినిజం- మావో ఆలోచనా విధానంలో సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. బూర్జువాలకు, భూస్వాములకు, పెత్తందారులకు, పెట్టుబడుదారులకు, సామ్రాజ్యవాదులకు ఊడిగం చేసే దళారీ నిరంకుశ ప్రభుత్వాలను కూకటి వేళ్ళతో కూల్చి వేయాలన్నారు. నూతన ప్రజాస్వామిక వ్యవస్థను నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్స్ హలవత్ లింగన్న, గుజ్జు దేవేందర్, బట్టు చైతన్య, పర్వత కోటేష్, ఎండి జబ్బార్, కుక్కమూడి యాకయ్య, గుండెల కృష్ణ, గుజ్జు కృష్ణవేణి, సామ రజిత, మంద మామిడి, వెంకన్న, నూకల మురళి, పొన్నం రమ, అల్లి ఏకాంబరం, మునీత, కల్పన, జంపాల ఉపేందర్, ధర్మారపు ముత్తయ్య పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు వెంటనే పరిష్కరించాలి.

### ఎంసీపీఐయు జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న డిమాండ్.



**కేసముద్రం, ఏప్రిల్ 22(నంది పత్రిక):**కేసముద్రం మండలం వ్యవసాయ మార్కెట్ సెంటర్ లో ఎంసిపిఐయు అనుబంధ ఏఐసిటియు కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంసిపిఐయు మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. రవాణా రంగం స్తంభించి పోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం కాలయాపన చేయకుండా వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు ఎంసిపిఐయు అనుబంధ ఏఐసిటియు కార్మిక సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతూ, వారికి మద్దతుగా ప్రత్యక్ష పోరాటాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వేల్పుల వెంకన్న, గుగులోతు లక్ష్మణ్, అందే భాస్కర్, రాస ఉప్పలయ్య, కస్తూరి వెంకన్న, బోడ వీరన్న నాయక్, సునీల్, మురళి, నేరడ వీరస్వామి, బిక్కు నాయక్, సురేష్, సంజీవ, బానోత్ ఈసు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పిస్తుంది.

### ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పన్నులు చెల్లించాలి. విద్యాశాఖలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి. మున్సిపల్ కమిషనర్లు, విద్యాశాఖ, ఇంజనీరింగ్ విభాగం సిబ్బందితో సుదీర్ఘంగా కలెక్టర్ సమావేశం

**మహబూబాబాద్, ఏప్రిల్ 22(నంది పత్రిక):**పట్టణాలు, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని అధిక నిధులు కేటాయించడం జరుగుతుందని, గ్రామాలు పట్టణాలలో ప్రజలు తమ ఇంటి పన్ను, నల్ల పన్నులను బాధ్యతాయుతంగా చెల్లించి గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి సహకరించాలని, విద్యాశాఖలో పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోతు జ్యోతి, కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ బానోతు సునీత, వైస్ చైర్ పర్సన్ అల్లం రమ, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత ఇంజనీరింగ్, హెల్త్, శానిటేషన్, విద్యాశాఖ సిబ్బందితో పెండింగ్ పనులు అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో పాటు ప్రజల సహకారంతో పట్టణాల అభివృద్ధికి సహకరించాలని, ఇంటి పన్ను, నల్లా పన్ను, ట్రేడ్ లైసెన్స్, లే అవుట్ అనుమతుల ద్వారా నిధులు సేకరించాలని, పన్నుల వసూళ్లకు విస్తృత ప్రచారం కల్పించాలని, బల్క్ ఎస్ఎంఎస్ ల ద్వారా ప్రజలకు తెలియపరచాలని సూచించారు. మున్సిపల్ పరిధిలో నిత్యం సానిటేషన్ నిర్వహిస్తూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దశలవారీగా సిబ్బందిని కేటాయించాలని, వారికి షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలని, యూనిఫామ్స్ ఇతర సదుపాయాలు కల్పించాలని సూచించారు. బయోమెట్రిక్ విధానం ద్వారా హాజరు నమోదు చేయాలని తెలిపారు. ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మిషన్ భగీరథ, మున్సిపల్ ద్వారా అందించే వాటర్ సప్లై నిత్యం గమనిస్తూ ఉండాలని, అవసరం ఉన్నచోట టాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని తెలిపారు. ఒక ప్రణాళిక ప్రకారం అన్ని విభాగాల సిబ్బంది పనిచేసి పట్టణాల అభివృద్ధికి కృషి చేయాలని ఆదేశించారు.

ప్రభుత్వ స్థలాలలో అక్రమ నిర్మాణాలను అరికట్టాలని ఆదేశించారు, శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ వహించి అవసరం ఉన్నచోట ఆటోలు ట్రాక్టర్స్ ఇతర వాహనాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని సూచించారు. కేసముద్రం నూతన మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపాలన్నారు. మహబూబాబాద్, కేసముద్రం మున్సిపల్ చైర్ చైర్ పర్సన్ లు పట్టణాల అభివృద్ధి కోసం పలు సూచనలు సలహాలు అందించారు. అంతర్గత రోడ్ల నిర్మాణం, అభివృద్ధి పనులు, పార్కులు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వినియోగంలోకి తీసుకురావడం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు సమన్వయంతో కలిసి పనిచేసి పట్టణాలు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఆమె సూచించారు. విద్యాశాఖలో సుమారు 839 పాఠశాలలలో వివిధ అభివృద్ధి పనులు కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, టాయిలెట్స్, కాంపౌండ్ వాల్, త్రాగునీరు సరఫరా సిస్టం, మైనర్ రిపేర్, మన ఊరు మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా మంజూరు అయిన పనులు కొన్ని పెండింగ్లో ఉన్నందున వెంటనే పూర్తి చేయాలని సంబంధిత పంచాయతీరాజ్, రహదారులు భవనాల శాఖ, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ విభాగం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సంస్థ, ఈడబ్ల్యూఐసి, అధికారులు ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి రాజేశ్వర్, కేసముద్రం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మహబూబాబాద్ ఇంచార్జ్ కమిషనర్ ఉపేందర్, టిపిఓ సాయి రామ్, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, విద్యా శాఖ ఇంజినీరింగ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈలు తదితరులు పాల్గొన్నారు.



## జనభా గణన-భవిష్యత్తుకు పునాది.



**కేసముద్రం, ఏప్రిల్ 22(నంది పత్రిక):**జనాభా గణన భారతదేశ భవిష్యత్తుకు పునాది వంటిదని కేసముద్రం తహశీల్దార్ జి.వివేక్ అన్నారు. కేసముద్రం (స్టేషన్) లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జన గణన రెండవ బ్యాచ్ శిక్షణ కార్యక్రమంను ఉద్దేశించి చార్జ్ ఆఫీసర్, స్థానిక తహశీల్దార్ జి.వివేక్ మాట్లాడుతూ నూతన పథకాలు, పరిపాలన విధానాలు, నూతన ఆవిష్కరణలు అన్నీ కూడా జనాభా లెక్కల ఆధారంగానే ఉంటాయి కాబట్టి ఎన్యూమరేటర్స్ ఖచ్చితమైన సమాచారం సేకరించాలన్నారు. అడిషనల్ చార్జ్ ఆఫీసర్ స్థానిక ఎంపీడీవో క్రాంతి మాట్లాడుతూ ఈసారి డిజిటల్ పద్ధతిలో జనాభా గణన జరుగుతుంది. ప్రజలకు స్వీయ గణనకు అవకాశం ఇచ్చారు కాబట్టి ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్ లు చక్కని శిక్షణ పొంది మొదటి దశలో ఇండ్ల గణన, ఇండ్ల జాబితా చక్కగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సౌజన్య, ఫీల్డ్ ట్రైనర్లు యేదునూరి అశోక్, బోరిగం రాములు, ఏఎస్ఓ వేణు, సూపర్ వైజర్ లు, ఎన్యుమరేటర్స్ తదితరులు పాల్గొన్నారు.

## భార్య నైటీ ధరించిందని కిరోసిన్ పోసి నిప్పంటించిన భర్త

కర్ణాటకలోని బెళగావి జిల్లాలో, దుస్తుల విషయంలో వివాదం తలెత్తడంతో భర్త భార్యకు నిప్పంటించాడు. ఈ సంఘటన ఖానాపూర్ తాలుకాలోని నందగడ గ్రామంలో జరిగింది. రోజువారీ కూలీ అయిన కృష్ణాజీ పాటిల్ తన భార్య మంజులా పాటిల్ నైటీ ధరిస్తుందని తరుచూ గొడవపడేవాడు. తాను ఎంత చెప్పినా వినడం లేదనే కోపంతో ఇటీవల ఆమెపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. పోలీసులు భర్తను ఏప్రిల్ 20వ తేదీన అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఆమెకు సుమారు 80 శాతం గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆమెను తొలుత స్థానిక ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆ తర్వాత బ్రిమ్స్‌కు, అక్కడి నుంచి గోవాలోని ఆసుపత్రికి తరలించారు. కృష్ణాజీ, మంజులకు ఎనిమిదేళ్ల కిందట వివాహం జరిగింది. నైటీ ధరించవద్దని తరుచూ గొడవపడిన అతను, మూడు రోజుల క్రితం ఈ దారుణానికి పాల్పడ్డాడు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ ఘటన ఏప్రిల్ 19వ తేదీన ఉదయం 11 గంటలకు జరిగింది. వారు నివసిస్తున్న అద్దె ఇంట్లోనే ఘటన జరిగింది. ఘటన జరిగిన రోజు కూడా ఆమె నైట్ డ్రెస్ ధరించిందని, దీనితో భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరిగింది. అతను నిప్పంటించడంతో ఆమె అరిచిందని, దీనితో స్థానికులు ఆమెను ఆసుపత్రికి తరలించారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com